







తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రచురణ,
హైదరాబాదు

సహ పాఠ్యాంశాలు



# విలువల విద్య - జీవన నైపుణ్యాలు

## 4వ తరగతి
















రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ,
తెలంగాణ రాష్ట్రం, హైదరాబాదు

# విలువల విద్య - జీవన నైపుణ్యాలు

## వాచకం, ఉపాధ్యాయ కరదీపిక

## 4వ తరగతి

రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ

తెలంగాణ, హైదరాబాదు.

# ముందుమాట

మానవులు సంఘజీవులు. తమ మనుగడకోసం అవసరమైన సమాజాన్ని నిర్మించుకొన్నారు. ఈ వ్యవస్థ నిర్వహణకు, కలిసికట్టుగా మనుగడ సాధించడానికి, అభివృద్ధి పొందడానికి సరైన అవగాహన, విశ్వసనీయతలు అవసరం. దీనికి సమిష్టితత్త్వం, పరస్పరాధారిత భావాలు కూడా అవసరం. కాబట్టి మానవ సమాజాలకు జనమెరిగిన ఆమోదయోగ్యమైన ప్రవర్తనా నియమావళి అవసరం. మనం కోరుకొన్న విధంగా మనం ప్రవర్తించలేం. ప్రతి సమాజానికీ దానికి అనుగుణమైన నైతిక నియమావళి ఉంటుంది. ఈ నైతిక నియమాల బహుళత్వానికి కూడా అంతర్లీనంగా కొన్ని ఆమోదిత ఉమ్మడి నియమాలు ఉంటాయి.

నీతిసూత్రాలు మన నడవడికి మార్గదర్శకంగా ఉండే నియమాలు. కాబట్టి పిల్లలుకూడా వాటిని ఆకళింపుచేసుకోవాలి. నైతికాభివృద్ధి అంటే కొన్ని నిబంధనలను అనుసరించడమో లేక ఎవరో ఏర్పరిచిన ఆదర్శ నమూనాల ప్రకారం నడుచుకోవడం మాత్రమేకాదు. నైతికాభివృద్ధి అంటే ప్రతి సందర్భంలోనూ సరైన కారణాన్ని తెల్సుకోగలగడం, విచక్షణతో నిర్ణయాన్ని తీసుకొని దాని ప్రకారం నడుచుకోగల సామర్థ్యం కలిగి ఉండడం. నైతిక చైతన్య అభివృద్ధిలో తాను తీసుకోబోయే నిర్ణయంతో తాను స్థిరంగా ప్రశాంతంగా ఉండగలిగే సామర్థ్యంకూడా ఉంటుంది. “అది నాకలాగే చెప్పారు. కాబట్టి నేను చేస్తున్నాను” అనే భావనకు ఇది విరుద్ధం. అందుచేత ఒక వ్యక్తి తనకు తాను శాంతి సౌఖ్యాలతో, ప్రశాంతంగా, స్థిరంగా ఉండడమే నైతికాభివృద్ధి సారాంశం. ఇందుకవసరమైన నైపుణ్యాలు కలిగి ఉండడమే జీవననైపుణ్యాలు. వీటిలో సమస్యను పరిష్కరించుకోవడం కలిసి పనిచేయడం, భావప్రసారంచేయడం, నాయకత్వం వహించడం, ఇతరులతో పరస్పర సంబంధాలను కల్గి ఉండడం వంటివి ముఖ్యమైనవి.

దురదృష్టవశాత్తు నేడు సమాజంలో నైతిక విలువలు పతనమౌతున్నాయని ప్రతి ఒక్కరూ భావిస్తున్నారు. మనలో స్వార్థం పెరగడం, దురాశ పెరగడం, అవినీతికి అలవాటుపడడం, నైతిక నియమావళిని ఉల్లంఘించడం, లోభత్వం పెరగడం, నేను నాది వంటి అవలక్షణాలవల్ల వ్యక్తులు తమ జీవితాన్ని సంక్లిష్టం చేసుకోవడంతోపాటు సమాజంలోని వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారు. ప్రతి ఒక్కరిలో అశాంతి పెరిగింది. నైతిక విలువల పతనంతోపాటు, పెరిగిపోతున్న ఒత్తిడిని, కనుమరుగౌతున్న మానవతా విలువలు, మానవసంబంధాలను గమనించవచ్చు. ఇవన్నీ ఒకరోజులోనో, ఒక సంవత్సరంలోనో వచ్చినవి కావు. మన జీవితాలలో సంయమనం, సమతుల్యత, విచక్షణ లోపించడమే దీనికి కారణం. వాటి స్థానంలో దురాశ, వినిమయవాదం, దోపిడీలు చోటుచేసుకొంటున్నాయి. వాటి నికర ఫలితమే సమాజంలోని అభద్రతాభావం, అపనమ్మకం, విచ్ఛిన్నమైన కుటుంబవ్యవస్థ, విలువల పతనం, సమాజంలో అశాంతి వ్యాపించడం మొదలగునవి.

వీటిని అరికట్టడానికి విద్యను ఒక సాధనంగా భావించి మనం విలువల విద్య, జీవననైపుణ్యాలు అనే అంశాన్ని ఒక ప్రధాన సబ్జెక్టుగా పాఠశాల విద్యలో ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు ప్రవేశపెట్టడం ద్వారా పిల్లలు పాఠశాల విద్య పూర్తయ్యేసరికి హేతుబద్ధమైన పౌరులుగా ఎదగడానికి అవసరమైన శిక్షణ పొందుతారు. ఉన్నతమైన విలువలు, వైఖరులు, త్యాగబుద్ధి కలిగి ఉండి సమాజంపట్ల, పర్యావరణంపట్ల, తోటివారిపట్ల సమన్యాయంతో ప్రతిస్పందించే బాధ్యతాయుత పౌరులుగా ఎదగడానికి అవసరమైన పాఠ్యప్రణాళికను (Syllabys) రాష్ట్రవిద్య, పరిశోధన, శిక్షణసంస్థ రూపొందించింది. పిల్లలు స్వేచ్ఛగా మాట్లాడడం, ప్రశ్నించడం, ప్రతిస్పందించడం, విచక్షణతో వ్యవహరించడం చేయగలగాలని రాష్ట్ర

విద్యాప్రణాళిక పరిధిపత్రం 2011లోని రాష్ట్ర దృక్పథం (State Vision)లో పేర్కొన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో 1 నుండి 10వ తరగతి వరకు విలువల విద్య, జీవన నైపుణ్యాల పాఠ్యప్రణాళిక రూపొందించారు. అనంతరం తరగతి వారీగా బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణకోసం ఉపాధ్యాయుల కరదీపికలను రూపొందించారు. 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు పెంపొందించాల్సిన 18 ప్రధాన విలువలను గుర్తించి ప్రతి తరగతిలో వీటికి సంబంధించిన పాఠాలను చేర్చారు. అవి, 1) స్వేచ్ఛ, 2) సంతృప్తిగా జీవించడం, 3) శీలనిర్మాణం, 4) జీవన నైపుణ్యాలు, 5) బాధ్యతవహించడం, 6) పొదుపుచేయడం, 7) ఆరోగ్యవిలువలు, 8) సంస్కృతి సంప్రదాయలపట్ల గౌరవం, 9) ఆరోగ్య విలువలు, 10) శాస్త్రీయదృక్పథం, 11) న్యాయం, 12) శాంతి, కలిసిమెలిసి జీవించడం, 12) శ్రమవిలువ, 14) సేవాభావం, 15) సమానత్వం, సోదరభావం, స్త్రీలపట్ల గౌరవం, 16) జాతీయ భావన – దేశభక్తి, 17) లౌకికతత్త్వం – మతసామరస్యం, 18) ప్రజాస్వామ్య విలువలపట్ల గౌరవం. వీటిలో ప్రాథమికస్థాయికి 12 ప్రధాన విలువలు, ఉన్నతస్థాయికి మొత్తం 18 విలువల ఆధారంగా ఒక్కొక్క విలువకు తరగతివారీగా ఉపవిలువలను నిర్ధారించి పాఠాలను పొందుపర్చారు.

విలువలు ప్రధానంగా బోధిస్తే వచ్చేవికావు. ఆచరిస్తే వచ్చేవి. కాబట్టి తరగతి వారీగా రూపొందించిన ఉపాధ్యాయ కరదీపికల్లో సన్నివేశాలు, సంఘటనల ఆధారంగా చర్చించడం, ఆచరించి అనుభవాలు చెప్పడం వంటి కృత్యాలతో కూడిన అభ్యాసాలు ఉన్నాయి. చర్చల ద్వారా వైఖరి నిర్మాణం జరగాలి. ఆచరణ ద్వారా ప్రవర్తనలో మార్పురావాలని ఆశించి పాఠాలను పొందుపరచారు. వీటిని నిర్వహించడం మన బాధ్యత. నిర్వహణ తీరుతెన్నులను గురించి “ఉపాధ్యాయులకు సూచనలు” కూడా చేర్చారు. అట్లే విద్యార్థులకు సూచనలు కూడా ఉన్నాయి.

ఎంత మంచి కరదీపికైనా ఉపాధ్యాయుడికి ధీటుగాదు. ఉపాధ్యాయుడు తాను ఆదర్శంగా ఉంటూ విలువలను పెంపొందించడానికి కృషి చేయాలి. ప్రణాళికాబద్ధంగా తరగతి వారీగా రూపొందించిన కరదీపికల ఆధారంగా బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి. మన రాజ్యాంగం పీఠికలో పేర్కొన్నవిధంగా ఉన్నతమైన విలువలు, వైఖరులుకల్గిన హేతుబద్ధమైన పౌరులుగా ఎదగడానికి ఉపాధ్యాయులుగా మనవంతు కృషిచేయాలి. ఈ కరదీపికలోని అంశాలు మీకు కొంతమేరకు దిశానిర్దేశం చేస్తాయి. వీటికే పరిమితం కాకుండా అదనపు అంశాలు కూడా సేకరించవచ్చు. వినియోగించవచ్చు. విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి మన ఈ చిన్న ప్రయత్నం గోరంతదైనా ఇది కొండంత వెలుగునిస్తుందనే విశ్వాసంతో ప్రయత్నిద్దాం. ఫలితాలు సాధిద్దాం!

**సంచాలకులు**

రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణసంస్థ, తెలంగాణ, హైదరాబాద్.

**యత్కర్మకుర్వతోఽ స్యస్యాత్, పరితోషాఽ ం తరాత్మనః**
**తత్ ప్రయత్నేన కుర్వీత, విపరీతం తు వర్జయేత్ – మనుస్మృతి**

**ఏపని చేస్తే అంతరాత్మకు సంతృప్తి కలుగుతుందో, ఆపనులే చేయాలి. దానికి విపరీతమైన పనులు చేయకూడదు.**

## రూపొందించినవారు

**శ్రీ సువర్ణ వినాయక్,** కోఆర్డినేటర్, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీ టి.వి.ఎస్.రమేశ్,** కోఆర్డినేటర్, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీ శ్రీనివాసుల రఘురాం,** ఉపాధ్యాయుడు, ప్రా.పా., గ్రంథసిరి, గుంటూరు జిల్లా.

**శ్రీ ఎల్.ఎం.ప్రసాద్,** ఉపాధ్యాయుడు, ప్ర.ఉ.పా., సి.పి.ఎల్, అంబర్‌పేట్, హైదరాబాదు.

**శ్రీ పసుల ప్రతాప్,** ఉపాధ్యాయుడు, ప్రా.పా.గిమ్మ, జైనత (మం), ఆదిలాబాద్ జిల్లా.

**శ్రీ బలగం రామ్మోహన్,** ఉపాధ్యాయుడు, ప్రా.పా., రవీంద్రపూర్, ముథోల్ (మం), ఆదిలాబాద్ జిల్లా.

**శ్రీ నందిగామ కిశోర్‌కుమార్,** తెలుగు పండితులు, జి.ప.ఉ.పా., ఇప్పటూరు, మహబూబ్‌నగర్ జిల్లా.

**శ్రీమతి కె.ఆర్.టి.ఎల్. జ్యోతిర్మయి,** ఉపన్యాసకురాలు, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీమతి యు. బుగ్గమ్మ,** తెలుగు పండితులు, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీమతి వంగీపురం స్వర్ణలత,** ఉపాధ్యాయిని, జి.ఉ.పా., పాతపట్టిసం, పోలవరం, పశ్చిమగోదావరి జిల్లా.

**శ్రీమతి అగుడూరి సరళమ్మ,** ఉపాధ్యాయిని, ప్రా.పా., చెర్లోపల్లి, చిత్తూరు జిల్లా.

**శ్రీమతి పల్లి మాధవి,** తెలుగు పండితులు, భారతీయ విద్యాభవన్, ఆత్మకూరి రామారావు పాఠశాల, జూబ్లీహిల్స్, హైదరాబాదు.

**శ్రీమతి జి. సరళాదేవి,** ఉపాధ్యాయిని, ప్రా.పా, గంగాపూర్, మహబూబ్‌నగర్

## సహకరించినవారు

**డా॥ రమాదేవి,** ఉపన్యాసకురాలు, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.
**శ్రీ వొజ్జల శరత్‌బాబు,** తెలుగు పండితులు, సీతాఫల్‌మండి, హైదరాబాదు.
**డా॥ దోనేపూడి నరేశ్ బాబు,** తెలుగు పండితులు, జి.ఉ.పా., గోస్పాడు, కర్నూల్ జిల్లా.
**శ్రీ దోరవేటి చెన్నయ్య,** స్కూల్ అసిస్టెంట్, జగద్గిరినగర్, రంగారెడ్డి జిల్లా.
**శ్రీ రామక విఠల్‌శర్మ,** ఉపాధ్యాయుడు, కరీంనగర్ జిల్లా.
**డా॥ గుడిసేవ విష్ణుప్రసాద్,** స్కూల్ అసిస్టెంట్, కృష్ణా జిల్లా.
**శ్రీ కలమట సోమేశ్వరరావు,** ఉపాధ్యాయుడు, శ్రీకాకుళం జిల్లా.
**శ్రీ దివ్వెల చిన్నారావు,** తెలుగుపండితులు, విజయనగరం జిల్లా.
**శ్రీ అయ్యగారి శ్రీనివాసరావు,** స్కూల్ అసిస్టెంట్, విజయనగరం జిల్లా.

**ముఖచిత్రం – డిజైనింగ్**
**కె.సుధాకరాచారి,**
SGT, UPS,
నీలకుర్తి, వరంగల్

## విషయనిపుణులు, ఎడిటింగ్

**డా॥ఎన్.ఉపేందర్‌రెడ్డి,**
ప్రొఫెసర్, విద్యాప్రణాళిక విభాగాధిపతి,
ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీ సువర్ణ వినాయక్,**
కోఆర్డినేటర్, ఎస్.సి.ఇ.ఆర్.టి.,
హైదరాబాదు.

## సలహాదారులు

**శ్రీ జి.గోపాల్‌రెడ్డి,**
పూర్వ సంచాలకులు, రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ,
తెలంగాణ, హైదరాబాదు.

**శ్రీ ఎస్.జగన్నాథరెడ్డి,**
సంచాలకులు, రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ,
తెలంగాణ, హైదరాబాదు.

# కృతజ్ఞతలు

**"విలువల విద్య – జీవననైపుణ్యాలు"** కరదీపిక / వాచకాలను రూపొందించడంలో తమ అమూల్యమైన సలహాలు, సూచనలు అందజేసి అవసరమైన సామగ్రిని ఇచ్చి ప్రోత్సహించిన పెద్దలకు, ఆయా సంస్థలకు రాష్ట్ర విద్యా, పరిశోధన, శిక్షణ సంస్థ, పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు.

**సలహాలు, సూచనలిచ్చినవారు :**

**శ్రీ శితికంఠానంద,** రామకృష్ణమఠం, హైదరాబాద్.
**శ్రీ కె.ఆర్.వేణుగోపాల్,** విశ్రాంత ఐ.ఎ.ఎస్., అధికారి, హైదరాబాదు.
**శ్రీ వాసగిరి లక్ష్మీనారాయణ,** ఐ.పి.ఎస్., కమీషనర్ ఆఫ్‌పోలీస్, థానే, మహారాష్ట్ర.
**డా॥ వి.బ్రహ్మారెడ్డి,** ప్రజావైద్యశాల, కర్నూలు జిల్లా.
**శ్రీ దూస రామకృష్ణ,** ఉపాధ్యక్షులు, విద్యాభారతి, అఖిలభారతీయ శిక్షాసంస్థాన్, న్యూఢిల్లీ మరియు సంచాలకులు, విజ్ఞానవిహార్, గడిలోవ, విశాఖపట్టణం.
**శ్రీ రావుల సూర్యనారాయణ,** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల శైక్షణిక ప్రముఖ, సరస్వతి విద్యాపీఠం, బండ్లగూడ, హైదరాబాదు.
**శ్రీ ఫాదర్ పల్లిదానం,** సంచాలకులు, పీపుల్స్ ఆక్సన్ ఫర్ రూరల్ అవేకనింగ్ (PARA), రావులపాలెం, తూ.గో.జిల్లా.
**శ్రీ సుదర్శనాచార్య,** జాతీయ సంధానకర్త, లీడ్ ఇండియా సంస్థ, హైదరాబాదు.
**శ్రీమతి పోరూరి కృష్ణకుమారి,** ప్రజ్ఞ, కో–ఆర్డినేటర్, వికాస తరంగిణి, జియ్యర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్, హైదరాబాదు.
**శ్రీ ప్రేమ్‌కుమార్‌సింగ్,** రామకృష్ణమఠం, హైదరాబాద్.
**డా॥ పి.జయధీర్ రెడ్డి,** విశ్రాంతప్రధానాచార్యులు, జిల్లా విద్యా శిక్షణ సంస్థ, కరీంనగర్.
**శ్రీ రవీందర్,** కో–ఆర్డినేటర్, వందేమాతరం సంస్థ, వరంగల్ జిల్లా.
**శ్రీ కె.మాధవరెడ్డి,** వందేమాతరం సంస్థ, మహబూబ్‌నగర్ జిల్లా.

**సహకరించిన సంస్థలు :**

- జియ్యర్ ఎడ్యుకేషన్ ట్రస్టు, హైదరాబాదు.
- రామకృష్ణమఠం, హైదరాబాదు.
- శ్రీ సరస్వతీ విద్యాపీఠం, బండ్లగూడ, హైదరాబాదు.
- సత్యసాయి విద్యాసంస్థలు, హైదరాబాదు.
- బ్రహ్మకుమారీ సంస్థ, హైదరాబాదు.
- వందేమాతరం సంస్థ, వరంగల్, మహబూబ్‌నగర్.
- ఈనాడు, నమస్తే తెలంగాణ, ఆంధ్రజ్యోతి, సాక్షి, దినపత్రికలు.
- ఎమెస్కో పబ్లిషింగ్ సంస్థ, హైదరాబాదు.
- జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ (ఎన్.సి.ఇ.ఆర్.టి.), న్యూఢిల్లీ.
- శ్రీ సీతారామ సేవాసదన్, మంథని, కరీంనగర్ జిల్లా.

పైన తెల్పిన వ్యక్తులు, సంస్థలతోపాటు పరోక్షంగా కూడా సహకరించిన వ్యక్తులకు, సంస్థలకు, వాచకాలు / కరదీపికల రూపకల్పనలో పాల్గొన్న ఉపాధ్యాయులు, ఉపన్యాసకులు, విషయనిపుణులు, ఎడిటింగ్ చేసిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు. **విలువల విద్య – జీవన నైపుణ్యాల** గురించి వాచకం కరదీపికను రూపొందించడంలో ఇది ఒక తొలి అడుగుమాత్రమే! దీన్ని మరింత వృద్ధిపరచుకోవచ్చు. ఇందుకోసం భవిష్యత్తులో కూడా అందరూ సహాయ సహకారాలను ఇలాగే అందిస్తారని ఆశిస్తున్నాం.

**సంచాలకులు**
రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణసంస్థ, తెలంగాణ, హైదరాబాద్.

# ఉపాధ్యాయులకు సూచనలు

- "విలువల విద్య - జీవన నైపుణ్యాలు" కోసం 1 నుండి 10 తరగతులకు తరగతివారీగా కరదీపికలు రూపొందించారు. వీటిని పిల్లలను ఉద్దేశించి తయారుచేశారు. అనగా వీటిని ఉపాధ్యాయులు బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణకు, పిల్లలు స్వయం అభ్యసనానికి వినియోగించవచ్చు.
- ఒక విద్యా సంవత్సరంలో పాఠశాల విద్యాశాఖ సబ్జక్టువారీగా కేటాయించిన పీరియళ్ళ భారత్వం ప్రకారం తరగతి వారీగా పాఠాలు పొందుపర్చారు.
- 1 నుండి 5 తరగతులకు వారానికి 42 పీరియళ్ళు ఉంటాయి. వీటిలో ఒక్కొక్క సబ్జక్టుకు కింది విధంగా భారత్వం ఉంటుంది.

| | | |
|---|---|---|
| మాతృభాష (తెలుగు / ఉర్దూ) | - | 12 పీరియళ్ళు |
| గణితం | - | 12 పీరియళ్ళు |
| ఆంగ్లం | - | 6 పీరియళ్ళు |
| పరిసరాల విజ్ఞానం | - | 6 పీరియళ్ళు |
| విలువలవిద్య, జీవననైపుణ్యాలు | - | 1 పీరియడ్ |
| శారీరక, ఆరోగ్యవిద్య | - | 2 పీరియళ్ళు |
| కళలు, సాంస్కృతికవిద్య | - | 2 పీరియళ్ళు |
| పని, కంప్యూటర్ విద్య | - | 1 పీరియడ్ |
| **మొత్తం** | - | **42 పీరియళ్ళు** |

- విలువల విద్య, జీవన నైపుణ్యాల గురించి బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణకు ప్రాథమికస్థాయిలో వారానికి 1 పీరియడ్, ఉన్నతస్థాయిలో వారానికి 2 పీరియళ్ళు ఉన్నందున, ఇందుకనుగుణంగానే పాఠాలను పొందుపర్చారు.
- ప్రాథమిక స్థాయిలో 12 ప్రధాన విలువల ఆధారంగా ఒక్కొక్కదానికి ఒకటి చొప్పున 12 పాఠాలు ఉన్నాయి. అట్లే ఉన్నత స్థాయిలో 18 ప్రధాన విలువల ఆధారంగా ఒక్కొక్క దానికి ఒక పాఠం చొప్పున 18 పాఠాలు ఉన్నాయి.
- వీటితోపాటు విలువలను పెంపొందించడానికి తోడ్పడేలా పద్యాలు, కథలు, గేయాలు, పాటలు అదనంగా చేర్చారు. 3వ తరగతి నుండి స్ఫూర్తిదాతలను కూడా చేర్చారు.
- విలువల విద్య - జీవన నైపుణ్యాలను పాఠాలలో సగటున ఒక పాఠానికి 3 పీరియళ్ళు అవసరమౌతాయి.

- ఒక పాఠంలోని విషయం అమరిక కింది విధంగా ఉంటుంది.

  •) పాఠం పేరు, •) ప్రధానవిలువ, •) ఉపవిలువ, •) ఆశించేఫలితాలు / లక్ష్యాలు, •) ఉపోద్ఘాతం, •) విషయం – సన్నివేశాలు / సంఘటనలు / కథనాలు, •) అభ్యాసాలు – 'ఆలోచించడం – ప్రతిస్పందించడం', 'తరగతి కృత్యం – జట్టుపని', 'ఆచరించడం – అనుభవాలు చెప్పడం', •) సూక్తి.

- విలువల విద్య, జీవన నైపుణ్యాలలోని అంశాలు ప్రధానంగా చర్చింపజేయడానికి ఉద్దేశించినవి. ఆచరించి అనుభవాలు చెప్పించడానికి ప్రాధాన్యతనిచ్చారు. కాబట్టి వీలైనంతమేరకు వీటిని రాయించకూడదు.

- **ఆలోచించడం – ప్రతిస్పందించడం**లోని ప్రశ్నల ద్వారా తరగతిలో చర్చ నిర్వహించాలి. ఆ తర్వాత **'తరగతి కృత్యం – జట్టుపని'** నిర్వహించాలి. అట్లే **'ఆచరించండి – అనుభవాలు చెప్పండి'**లోని అంశాలను ఆచరింపజేసేలా చేసి పిల్లలతో వారి అనుభవాలు, అనుభూతులను చెప్పించాలి.

- మిగతా సబ్జక్టులవలెనే **విలువల విద్య – జీవన నైపుణ్యాల**ను కూడా మూల్యాంకనం చేయాలి. వీటిని సంగ్రహాత్మక మూల్యాంకనం సందర్భంగా చేయాలి. అనగా ఒక విద్యా సంవత్సరంలో మూడుసార్లు మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం పరీక్షలు నిర్వహించకూడదు. పిల్లల్ని పరిశీలించడం, వారి అనుభవాలు, ఆచరణ, ప్రవర్తన, విలువలు మొదలగు వాటి ఆధారంగా మూల్యాంకనం చేయాలి.

- దీని మూల్యాంకనాన్ని 50 మార్కులకు నిర్వహించాలి. **విలువల విద్య – జీవన నైపుణ్యాలు** ఆధారంగా పిల్లల్లో విద్యాప్రమాణాలు సాధించాలి. అవి 1) మంచి, చెడు విచక్షణ జ్ఞానాన్ని ప్రదర్శించడం, సత్ప్రవర్తనకల్గి ఉండడం, 2) రాజ్యాంగ విలువలు పాటించడం, 3) వ్యక్తిగత విలువలు అనగా సహనం, దయ, సానుభూతి, తదానుభూతి మొదలగునవి కల్గి ఉండడం, 4) జీవన నైపుణ్యాలు కల్గి ఉండడం, 5) ఉపాధ్యాయులు, పెద్దలు, సమాజం, ప్రభుత్వ ఆస్తులపట్ల సరైన వైఖరులు కల్గి ఉండడం.

- పైన తెల్పిన విద్యాప్రమాణాలను ఆయా పాఠాల ఆధారంగా పరిశీలించాలి. వీటిని సాధించడానికి అనుగుణంగానే ప్రధాన విలువకు సంబంధించిన పాఠాలు తరగతుల వారీగా ఉన్నాయి. ఒక్కొక్క సామర్థ్యానికి 10 మార్కుల చొప్పున 50 మార్కులకు నిర్వహించాలి. అనగా పరిశీలించి మార్కులు కేటాయించాలి.

- పిల్లల ప్రగతిని పరిశీలించి గ్రేడింగ్ నమోదుచేయాలి.

  A1 – 91%

  A2 – 71% – 90%

  B1 – 51% – 70%

  B2 – 41% – 50%

  C – 0 – 40%

- పిల్లల ప్రగతిని గురించి గ్రేడింగ్ నమోదు చేసినప్పుడు వాటికి సంబంధించిన గుణాత్మక రిమార్కులు కూడా నమోదుచేయాలి.
- బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ విధానం - ప్రాథమిక స్థాయి

**మొదటి పీరియడ్** :
- ఉపోద్ఘాతం గురించి తెలియజేయాలి.
- పాఠానికి సంబంధించిన విషయంలోని సన్నివేశాలు / సంఘటనలు / కథనాలను ఒకరితో చదివించాలి. లేదా చెప్పాలి.
- 'ఆలోచించండి - ప్రతిస్పందించండి' లోని ప్రశ్నల ఆధారంగా తరగతిలో చర్చ నిర్వహించాలి.

**రెండవ పీరియడ్** :
- **'తెలుసుకోండి'**లోని విషయాన్ని గురించి పిల్లలకు చెప్పాలి లేదా ఒకరితో చదివించాలి. చర్చద్వారా అవగాహన కల్పించాలి.
- **'తరగతి కృత్యం - జట్టుపని'**ని తరగతిలో పిల్లలను జట్లుగా విభజించి నిర్వహించాలి.
- ఒక్కొక్క జట్టువారు చేసిన పనులను ప్రదర్శించాలి.
- **'ఆచరించండి - అనుభవాలు చెప్పండి'** లోని అంశాలను ఇంటివద్ద ఆచరించమని చెప్పాలి.

**మూడవ పీరియడ్** :
- పుస్తకం చివర ఉన్న 'అనుబంధం'లో చేర్చిన కథ / పాట / పద్యం / శ్లోకం / స్ఫూర్తిదాతల గురించి తరగతిలో పిల్లలతో చదివించాలి. చర్చద్వారా అవగాహన కల్పించాలి.
- ఆ తరవాత **'ఆచరించండి - అనుభవాలు చెప్పండి'** గురించి ఒక్కొక్కరితో మాట్లాడించాలి.
- పాఠం చివర ఉన్న సూక్తి గురించి తెలియజేయాలి.

- పాఠశాలలో **'విలువల విద్య - జీవన నైపుణ్యాలు'** పుస్తకాలను పిల్లలకు కూడా ఇవ్వవచ్చు. గ్రంథాలయ పీరియడ్ సమయంలో లేదా భోజన విరామ సమయంలో కూడా పిల్లలకిచ్చి చదువుకోమని చెప్పాలి.
- 'విలువల విద్య - జీవన నైపుణ్యాలు' లోని సన్నివేశాలు, సంఘటనలు, సూక్తులు, పద్యాలు, శ్లోకాలు, కథలు, స్ఫూర్తిదాతల వంటి ఇతర అంశాలు కూడా సేకరించి తెలియజేయవచ్చు. వాటి ఆధారంగా కూడా చర్చ నిర్వహించడం, జట్టుపనులు చేయించడం, 'ఆచరించండి - అనుభవాలు చెప్పండి' వంటివి నిర్వహించవచ్చు.
- పాఠశాల గ్రంథాలయంలోని పుస్తకాలు, మ్యాగజైన్లు, వార్తాపత్రికలు వంటి వాటిని వినియోగించాలి.
- విద్యార్థులకు సూచనలు కూడా ఉన్నాయి. వీటిని మొదటి పీరియడ్‌లోనే చదివి వినిపించాలి. వీటి గురించి అర్థం చేయించాలి. ఆ ప్రకారం పిల్లలు నడుచుకొనేలా చూడాలి.

# విషయసూచిక


| వ.సం. | ప్రధాన విలువ | నేర్పవలసిన విలువ | పాఠ్యాంశం | పేజీ |
|---|---|---|---|---|
| 1. | స్వేచ్ఛ | ఇంట్లో, పాఠశాలలో స్వేచ్ఛగా ప్రశ్నించడం | ప్రశ్నిద్దామా! | 1 |
| 2. | సంతృప్తిగా జీవించడం | ఉన్నదాంతో తృప్తి పొందడం | తృప్తిపడదాం | 5 |
| 3. | శీల నిర్మాణం | నిజాయితీ కలిగి ఉండడం | నిజాయితీ | 8 |
| 4. | జీవన నైపుణ్యాలు | ఇతరుల గొప్పతనాన్ని అభినందించడం | అభినందన | 13 |
| 5. | బాధ్యతవహించడం | పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం | బాధ్యత | 17 |
| 6. | పొదుపు చేయడం | ఆహారపదార్థాలను వృథాచేయకుండా ఉండడం | ఆహారం వృథా చేయం | 22 |
| 7. | ఆరోగ్య విలువలు | వ్యక్తిగత పరిశుభ్రత (చేతులు, గోళ్ళు పరిశుభ్రతపై అవగాహన) | మన చేతుల్లో మన ఆరోగ్యం | 27 |
| 8. | సంస్కృతి, సంప్రదాయాలపట్ల గౌరవం | మాతృదేవోభవ, పితృదేవోభవ | శ్రవణ కుమారుడు | 33 |
| 9. | పర్యావరణ పరిరక్షణకు తోడ్పడం | పెరటితోట పెంపకంపై ఆసక్తి కలిగి ఉండటం. ప్రతి విద్యార్థి ఒక మొక్క పెంచటం | పెరటితోట పెంచుదాం | 37 |
| 10. | శాస్త్రీయ దృక్పథం | నిర్భయంగా వాస్తవాలను చెప్పడం | నిర్భయంగా మాట్లాడుదాం | 41 |
| 11. | న్యాయం | సమాన అవకాశాలు పొందడం | అందరూ సమానమే | 44 |
| 12. | శాంతి / కలిసి మెలిసి జీవించడం | ఇతరులపట్ల దయ, కరుణ కలిగి ఉండటం | సాయంచేద్దాం | 47 |


## అనుబంధం


| | | |
|---|---|---|
| 1. | శ్లోకాలు | 51 |
| 2. | పద్యాలు | 52 |
| 3. | పాటలు, గేయాలు | 54 |
| 4. | కథలు | 63 |
| 5. | స్ఫూర్తిదాతలు | 75 |

# విద్యార్థులకు సూచనలు

- పిల్లలూ! **'విలువల విద్య – జీవన నైపుణ్యాలు'** పుస్తకం మీకోసమే రూపొందించి పాఠశాలలకు పంపారు.
- వీటిలోని పాఠాలు, పద్యాలు, కథలు, శ్లోకాలు, పాటలు, స్ఫూర్తిదాతల గురించి మీకు మీ ఉపాధ్యాయులు బోధిస్తారు. లేదా మీరే చదవండి. ఇతరులకు చెప్పండి, వాటి గురించి చర్చించండి.
- వీటి గురించి మీకు వారానికి ఒకరోజు బోధిస్తారు.
- ఒక పాఠంలోని సన్నివేశాలు, సంఘటనలు గురించి మీలో ఒకరు చదివిన తర్వాత మీ ఉపాధ్యాయుడు, కొన్ని ప్రశ్నలు అడుగుతారు. వీరందరూ ఆ ప్రశ్నలకు ఆలోచించి జవాబులు చెప్పండి. చర్చలో పాల్గొనండి.
- తరగతిలో జట్టు కృత్యాలు నిర్వహిస్తారు. మీరు మీ మిత్రులతోకల్సి జట్టు పనుల్లో పాల్గొనండి. మీరు జట్లలో చర్చించిన విషయాల గురించి తరగతిలో చెప్పండి.
- **'ఆచరించండి – అనుభవాలు చెప్పండి'** అని కొన్ని పనులను మీకు పురమాయిస్తారు. ఆ ప్రకారం మీరు ఆచరించండి. ఆ తరవాత వచ్చే పీరియడ్‌లో ఏం చేశారు? మీకెలా అనిపించింది? దీన్నుండి మీరేమి నేర్చుకొన్నారు? మొదలగు విషయాలను, మీ అనుభవాలను తెలియజేయండి.
- వీటిలోని అంశాలు ఎక్కువగా చర్చించడానికి, ఆచరించి అనుభవాలు చెప్పడానికి ఉద్దేశించినవి కాబట్టి రాయాలని భావించకండి. తప్పనిసరిగా చేయండి.
- మీరు తెల్సుకొన్న, చర్చించిన అంశాల ఆధారంగా వార్తాపత్రికలలో చూడండి. వాటి నుండి సేకరించిన విషయాలు, వార్తలు, వ్యాసాలు, సూక్తులు మొదలగువాటిని తరగతిలో చదివి విన్పించండి. ఆ తరవాత వాటిని తరగతిలోని గోడపత్రికలో ప్రదర్శించండి.
- వీటికి కూడా మూల్యాంకనం ఉంటుంది. ఐతే, వీటికి పరీక్షలు ఉండవు. మీరెలా పాల్గొంటున్నారు? మీ ప్రవర్తన ఎలా ఉంది? మీలో ఏం మార్పువచ్చింది? మొదలగు విషయాలను మీ ఉపాధ్యాయులు పరిశీలించి మార్కులు కేటాయిస్తారు. వాటి ఆధారంగా మీకు గ్రేడింగ్ ఇస్తారు.
- ఇలా ఒక విద్యా సంవత్సరంలో మూడుసార్లు మీ గురించి నమోదుచేస్తారు. మొదటి సంగ్రహణాత్మక, రెండవ సంగ్రహణాత్మక, మూడవ సంగ్రహణాత్మక మూల్యాంకనాలతోపాటు మిమ్మల్ని పరిశీలించి మీ ప్రగతిని గ్రేడుల రూపంలో నమోదుచేస్తారు.
- 10వ తరగతి మెమో / సర్టిఫికెటులో కూడా ఈ వివరాలు ఉంటాయి.
- వంట ఎంత మంచిగా వండినా, దాంట్లో చిటికెడు ఉప్పు లేకుంటే రుచి ఉండదని భాస్కరశతకంలోని పద్యం ఉంది. అట్లే మనం ఎంత చదువుకున్నా, ఎంత మంచి గ్రేడు వచ్చినా, మనలో 'వినయం, సహనం, శీలం, విచక్షణ' లేకుంటే మనకు విలువ ఉండదు. కాబట్టి విలువల విద్య – జీవన నైపుణ్యాలు పాఠాల ద్వారా మీరు గొప్పవారుగా ఎదగాలి.

# 1 ప్రశ్నిద్దామా!

**I. ప్రధాన విలువ**

స్వేచ్ఛ

**II. ఉప విలువ**

ఇంట్లో, పాఠశాలలో స్వేచ్ఛగా ప్రశ్నించడం.

**III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు**

- పిల్లలు తమకున్న సందేహాల గురించి, తెలియని విషయాల గురించి నిర్భయంగా ప్రశ్నించగలగాలి.
- పిల్లలు తమ అవసరాలు, సమస్యల గురించి స్వేచ్ఛగా, నిర్భయంగా ప్రశ్నించగలగాలి.

## IV. ఉపోద్ఘాతం

ప్రశ్నించడంతోనే, నేర్చుకోవడం మొదలవుతుంది. సమాజంలో 'ప్రశ్నించడం' అన్నది చాలా అరుదుగా జరిగే అంశం. ప్రశ్నించడం అన్నది పిల్లల సహజలక్షణం. చిన్నతనం నుండీ ప్రతిదీ ప్రశ్నించే స్వభావం ఉన్న పిల్లల్లో వయసు పెరుగుతున్నకొద్దీ ఈ స్వభావం తగ్గుతోంది. పాఠశాలకు వచ్చేసరికి భయం, బిడియంతో ఈ స్వభావం మరీ తగ్గిపోతున్నది. పాఠశాలలో పిల్లలు ప్రశ్నించడం అన్నది ఒక ముఖ్య అంశం. ఈ అంశాన్నే విద్యాహక్కు చట్టం కూడ తెలియజేసింది. 'స్వేచ్ఛ' రాజ్యాంగం ఇచ్చిన హక్కు. పిల్లలు ప్రశ్నించే హక్కును కలిగి ఉన్నారు. అయినా దీని గురించి మనం ఆలోచించడంలేదు. పిల్లలు ప్రశ్నించడాన్ని, వారి ఇష్టాలు తెలియజేయడాన్ని మనం ప్రోత్సహించడం లేదు. ప్రశ్నించడం పిల్లల హక్కుగా గుర్తించాలని తెలియజేయడమే ఈ పాఠ్యాంశ ఉద్దేశం.

## V. సన్నివేశాలు

### సన్నివేశం - 1

రమ్య, పూజ నాల్గవతరగతి చదువుతున్నారు. రమ్య ఎప్పుడూ ప్రశ్నిస్తూనే ఉంటుంది. తరగతిలో టీచర్ పాఠం చెబుతుంటే తనకు అర్థంకాకపోతే వెంటనే ప్రశ్నించి సందేహాలు తీర్చుకుంటుంది. హోంవర్కు ఇస్తే ఎలా చేయాలి? అని అడిగి చేసుకుని వస్తుంది. తనకు అర్థంకాని విషయాలను పెద్ద తరగతి పిల్లలను, టీచర్లను అడిగి తెలుసుకుంటుంది. తరగతిలో జట్టుపనుల్లో చురుకుగా పాల్గొంటుంది. పూజ బిడియంగా, భయంగా ఉంటుంది. తనకు తెలియని విషయాలున్నా టీచర్‌ని అడగాలంటే భయం. అందుకని ఎప్పుడూ ప్రశ్నించి తెలుసుకునే ప్రయత్నం చేయదు. తనకు అర్థమైన విషయంతోనే సరిపెట్టుకుంటుంది.

ఒకరోజు పూజ దిగులుగా కూర్చుని ఉంది. దీన్ని గమనించిన రమ్య ఎందుకలా ఉన్నావు? అని పూజను అడిగింది. నాకు ఈ లెక్కల సమస్య అర్థం కాలేదు. టీచర్‌ని అడగాలంటే భయంగా ఉంది. పిల్లలను అడుగుదామంటే ఎగతాళి చేస్తారేమోనని అడగలేదు అని చెప్పింది. అందుకు రమ్య పూజను ఓదార్చి ఇలా చెప్పింది : చూడుపూజా! మనకు అర్థం కానప్పుడు అడిగి తెలుసుకునే ప్రయత్నం చేయాలి. అంతేకాని ఇలా దిగాలుగా ఉంటే ఏం లాభం చెప్పు. 'ఇక నుండి నీకు తెలియని విషయాలను ధైర్యంగా అడిగి తెలుసుకో' అని చెప్పింది. దాంతో పూజ మెల్లమెల్లగా తెలియని విషయాల గురించి ప్రశ్నించసాగింది. ఆమెలో కూడ ధైర్యం, పట్టుదల పెరిగింది. తెలియని విషయాలను తెలుసుకోసాగింది. ప్రశ్నించడానికి ఎప్పుడూ భయపడలేదు.

### సన్నివేశం - 2

సుమ చాలా చురుకైన అమ్మాయి. అన్ని విషయాలు తెలుసుకోవాలనే తపన. తెలుసుకోవాలన్న ఆశతోపాటు ఎవరైనా తప్పుగా మాట్లాడినా, అబద్ధాలు చెప్పినా ఆమెకు అస్సలు నచ్చదు. ధైర్యంగా ప్రశ్నిస్తుంది. ఒకసారి అమ్మ తమ్ముడికి ఎక్కువ మిఠాయిలు ఇచ్చింది. 'అదేంటి నాకు తక్కువ ఇచ్చి, తమ్ముడికి ఎక్కువ ఇచ్చావు?' అని అడిగింది సుమ. వాడు మగపిల్లాడు కదా! అంది అమ్మ. అయితే ఏం. మేమిద్దరం నీ పిల్లలేకదా! నీకు మేమిద్దరం సమానం కాదా! అని ప్రశ్నించింది. ఇంట్లో తమ్ముడికి అస్సలు పని చెప్పదు. తనకే అన్ని పనులు చెబుతుంటే! ఇలా ఎందుకు జరుగుతుంది? నాకే పనులు చెబుతారు ఎందుకు? అంటూ అమ్మ నాన్నలను ప్రశ్నించేది సుమ. ఓసారి తమ్ముడు అబద్ధం చెప్పాడు. అమ్మ వాణ్ణి మందలించలేదు సరికదా! వెనకేసుకొనివచ్చింది. ఇది సుమకు నచ్చలేదు. ఎందుకమ్మ ఇలా చేశావు! అని సుమ అమ్మను అడిగింది. పోన్లేవే చిన్న పిల్లాడు కదా! అంటూ అమ్మ సర్దిచెప్పబోయింది. చిన్నపిల్లాడైతే అబద్దాలు ఆడవచ్చా! తప్పుకదా! అని సుమ అమ్మతో అంది.

*సన్నివేశం - 3*

*వరుణ్‌కు ఎప్పుడూ సందేహాలే. ఇంట్లో ఉన్నా, బడిలో ఉన్నా, బయట ఉన్నా ప్రశ్నలు అడుగుతూనే ఉంటాడు. వరుణ్ ప్రశ్నలకు కొన్నిటికీ సమాధానాలు దొరుకుతాయి కొన్నిటికి దొరకవు. దొరకక కాదు పెద్దవాళ్ళకు కూడా ఆ సమాధానం తెలీక. వరుణ్ అడిగే ప్రశ్నలు చాలా వింతగా ఉంటాయి. వరుణ్ వాళ్ళ తాతయ్యని ఏ ఏ ప్రశ్నలు అడుగుతున్నాడో చూడండి. "తాతయ్యా! సూర్యుడు అస్తమించిన తర్వాత ఎక్కడికి వెళతాడు?*

*"భూమి తన చుట్టూ తాను తిరుగుతూ ఉంటుందట కదా! మరి మనం ఎందుకు పడిపోము?"*

*"వడగళ్ళు ఆకాశంలో ఎలా తయారవుతాయి? ఆకాశంలో ఫ్రిజ్ ఉందా? ఐస్ ముక్కలు పడుతున్నాయి?"*

*"జంతువులకు మనలాగ భాషలేదెందుకు?"*

*"మన కుక్క పళ్ళుతోముకోకపోయినా తెల్లగా ఎలా ఉంటాయి?"*

*చూశారా వరుణ్ వేసే ప్రశ్నలు ఎలా ఉన్నాయో? వరుణ్ తన చుట్టూ ఏవి చూసినా వెంటనే ప్రశ్నలు అడిగేస్తాడు. అన్నీ తెలుసుకోవాలని వరుణ్‌కి ఆసక్తి.*

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) మీరు ఎందుకు ప్రశ్నిస్తారు? ఏఏ సందర్భాల్లో ప్రశ్నిస్తారు?

2) ప్రశ్నించడంవల్ల కలిగే లాభం ఏమిటి? ప్రశ్నించకపోతే కలిగే నష్టం ఏమిటి?

3) ఇంట్లో, బళ్ళో ఏ ఏ అంశాల గురించి ప్రశ్నిస్తారు? ఎవరెవరిని ప్రశ్నిస్తారు? ఏమని ప్రశ్నిస్తారు.

4) వరుణ్ అడిగిన ప్రశ్నలు విన్నారు కదా! ఇలాంటి ప్రశ్నలు మీరు మీ టీచర్‌ను లేదా పెద్దలను అడగండి.

### తెలుసుకోండి

ప్రశ్నలతోనే మనిషి ప్రస్థానం ప్రారంభమౌతుంది. మనిషి పుట్టినప్పటి నుంచి తన చుట్టూ ఉన్న ప్రపంచంలో ఉన్న విషయాలను తెలుసుకోవాలన్న కుతూహలమే ప్రశ్నల రూపంలో బయటపడుతుంది. అప్పుడప్పుడే మాటలు వచ్చే చిన్నారులను గమనిస్తే తల్లితో సహా కనిపించిన వారినందరినీ తన ముద్దు ముద్దు మాటలతో ప్రశ్నిస్తూ ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ ఉంటుంది. అలా ప్రశ్నించడం అనేది సహజంగా మనిషికి అబ్బిన ఒక లక్షణం.

మామూలు మనుషులనుండి గొప్ప గొప్ప శాస్త్రవేత్తల వరకూ తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అన్వేషించడానికి ఈ ప్రశ్నలే ఆధారమయ్యాయి. ఇది ఇలాగే ఎందుకు జరిగింది? ఎలా అయితే అందరికీ ఉపయోగపడుతుంది? ఇంకా ఎంత బాగా ఈ పనిని చేయగలం? ఎందుకు? ఏమిటి? ఎలా? అనే ప్రశ్నలు మనకు మనం వేసుకోవడమే కాకుండా ఎదుటివారికి వేయడంవల్ల మనిషి అభివృద్ధి చెందడానికి, సమాజం అభివృద్ధి చెందడానికి దోహదపడ్డాయి.

అనుమానాలు, సందేహాలు నివృత్తి చేసుకోవాలంటే ప్రశ్నించాలి. మన హక్కులు కోల్పోతున్నామంటే ప్రశ్నించాలి. సమాజంలో అసమానతలు ఉంటే ప్రశ్నించాలి. తప్పుచేసే వారు ఎవరైనా, ఎంతటి హోదాలో ఉన్నా ప్రశ్నించాలి. ప్రశ్నించడంవల్ల మనలో ఆత్మవిశ్వాసంతోపాటు సమాజ శ్రేయస్సు, అభివృద్ధి, ప్రగతి ముడిపడి ఉంటాయన్న సంగతి మరచిపోకూడదు.

అందుకే ప్రశ్నించడం ఒక అవసరం, ఒక లక్షణం, ప్రగతి, దారి తీసే ఒక అంశం. దీన్ని అలవరచుకోవడం చిన్నతనంలోనే అలవాటుగా మారాలి. మనం వేసే ప్రశ్నలు కూడా జ్ఞాన నిర్మాణానికి తోడ్పడేవిగా ఉండాలి.

## ఆ) తరగతి కృత్యం – జట్టుపని

- మీకు ఆసక్తి కల్గించే విషయాల గురించి ఏ ఏ ప్రశ్నలు అడుగుతారో రాయండి.
- ప్రశ్నించాలని అనుకొని ఎప్పుడైనా ఆగిపోయారా? ఎందుకు? దీనివల్ల ఏమి జరిగింది?

## ఇ) ఆచరించడం – అనుభవాలు చెప్పడం

- వారం రోజులు స్వేచ్ఛగా ప్రశ్నించండి. ఏ ఏ అంశాల గురించి ప్రశ్నించారు? ఏ ఏ ప్రశ్నలు అడిగారు? ప్రశ్నించినందువల్ల ఏం జరిగింది? చెప్పండి.

**సూక్తి**

**ప్రశ్నించడంతోనే మన జ్ఞాన నిర్మాణం, మన ప్రగతి ఆధారపడి ఉంటుంది. ప్రశ్న పరిశోధనలకు అన్వేషణలకు తొలిమెట్టు.**

# 2 తృప్తిపడదాం

## I. ప్రధాన విలువ

సంతృప్తిగా జీవించడం

## II. ఉప విలువ

ఉన్నదాంతో తృప్తి పొందడం

## III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు

- ఉన్నదాంతో తృప్తిపడాలని తెలుసుకోవడం.
- అతిగా ఆశపడడం మంచిది కాదు అని తెలుసుకోవడం.

## IV. ఉపోద్ఘాతం

అవసరానికి మించి ఉన్న ఏవైనా సరే దుర్వినియోగం అవుతాయి. అవసరాలకు మించి కోరుకోవడం పిల్లల సహజలక్షణం. దీన్ని చిన్నతనం నుండే నియంత్రించాలి. ఉన్నంతలో తృప్తిపొందడంవల్ల కలిగే ఆనందాన్ని, అవసరాన్ని పిల్లలకు తెలియజేయాలి. అవసరాలకు మించి కోరుకోవడంలో వల్ల కలిగే నష్టాలను, ఫలితాలను పిల్లలకు అర్థమయ్యేలా తెలియజేయాలి. అతిగా ఆశపడడం, తృప్తిపడకపోవడం వల్ల కలిగే ఇబ్బందులు, సంతృప్తిగా ఉండడంలోఉన్న ఆనందం, అవసరాన్ని తెలియజేయడమే ఈ పాఠ్యాంశ ఉద్దేశం.

## V. కథ

శేఖర్ దంపతులు ఉద్యోగాలు చేస్తూ హాయిగా జీవితం గడపసాగారు. వారికి మనోజ్ ఒక్కగానొక్క కొడుకు. వారు అతన్ని ఎంతో అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. ప్రతి పుట్టిన రోజును ఘనంగా జరిపేవారు. ప్రతి పండగకి బట్టలు కొనిచ్చేవారు. ఆటవస్తువులకైతే లెక్కే లేదు. అయినా మనోజ్ అవి సరిపోవనేవాడు. అది కావాలి, ఇది కావాలి అంటూ మారాం చేసేవాడు. ఉన్నవి కాకుండా ఇంకా కావాలని అనేవాడు. బట్టలైతే ఒకటి రెండుసార్లు మాత్రమే వేసుకునేవాడు. మళ్ళీ కొత్తవి కొనమనేవాడు. శేఖర్ దంపతులు ఎంత నచ్చజెప్పచూసినా మనోజ్ వినేవాడుకాదు. ఎన్ని కొనిచ్చినా సంతోషం లేదు.

ఒకసారి శేఖర్ దంపతులు మనోజ్ పుట్టినరోజునాడు అతణ్ణి అనాథ శరణాలయానికి తీసుకువెళ్ళారు. అక్కడ పిల్లలను చూసి మనోజ్‌కు ఆశ్చర్యం వేసింది. వారి దగ్గర తనలాగా కొత్తబట్టలు, మంచి మంచి బొమ్మలు, ఆటవస్తువులు ఏమీ లేవు. అయినా వాళ్ళంతా సంతోషంగా గడపడం అతనికి ఆశ్చర్యం కలిగించింది. శేఖర్ దంపతులు మనోజ్‌తో “చూశావా! ఇక్కడి పిల్లలకు నీలాగా మంచి బట్టలు, ఆటవస్తువులు ఏమీలేవు. అయినా వాళ్ళు ఎంత సంతోషంగా ఉన్నారో మనకు ఉన్నవాటితో తృప్తిపడక అదనంగా కావాలనుకుంటే దానివల్ల సంతోషం ఉండదు అన్నారు. మనోజ్ ఇంటికి వచ్చాక తనవద్ద ఉన్న బట్టలు, ఆటవస్తువుల్లో కొన్ని దీసి పక్కన పెట్టాడు. నాన్నా! నాకు ఇవి చాలు. మిగిలినవన్నీ లేనివాళ్ళకు ఇస్తాను అన్నాడు. మరునాడు తండ్రితో పాటు అనాథ శరణాలయానికి వాటిని తీసుకువెళ్ళాడు.

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) కథ ద్వారా మీరు ఏం తెలుసుకున్నారు?

2) మీవద్ద వస్తువులు అవసరానికి తగినన్నే ఉన్నాయా? ఎక్కువగా ఉన్నాయా? ఉంటే ఏం చేస్తారు?

3) ఏ వస్తువులు ఎన్ని ఉంటే తృప్తికలుగుతుంది?

### తెలుసుకోండి

పెద్దల్లో మరియు పిల్లల్లో వస్తువులు తమ వద్ద ఎన్ని ఉన్నా అదనంగా కోరుకునే తత్త్వం ఈ రోజుల్లో బాగా పెరిగింది. ఉన్నదానితో తృప్తిపడకుండా ఇంకా ఇంకా కావాలని అనుకోవడం, అదేపనిగా వస్తువులను కొనడం బాగా ఎక్కువగా కనిపించే దృశ్యం. గతంలో పండగలప్పుడు అంటే కూడా దసరా, సంక్రాంతి, మాత్రమే కొత్తబట్టలు తీసుకునేవారు. ఇప్పుడు ప్రతి చిన్న పండగకి, పెళ్ళిళ్ళకు వెళ్తున్నా కొత్త బట్టలు కావలసిందే. దీనితో లాభం ఏమీ లేకపోగా అవి గుట్టలుగా పేరుకుపోతాయి. ఎవరికీ ఇవ్వడానికి మనసొప్పదు. ఇంత ఖరీదుపెట్టి కొన్నాను! అని అనిపిస్తుంది. దీంతో అవి అక్కరకి రాకుండా పోతాయి. లేనివారికి ఇస్తే కనీసం వారైనా సంతోషిస్తారు కదా!

ఉన్నదానిలో తృప్తిపడడం పిల్లలకు చిన్నప్పటి నుండే అలవాటుకావాలి. ఇది అలవాటుగా మారకపోతే కోరికలుగా మారి క్రమంగా అవి దురాశకి దారితీసి వినాశనానికి దారితీస్తుంది. ఇప్పుడే వారిలో 'తృప్తి' అని విత్తు నాటకపోతే సమాజానికి భవిష్యత్తులో అవినీతిపరుడిని అందించినట్లే అవుతుంది.

## ఆ) తరగతి కృత్యం - జట్టుపని

విద్యార్థులను వారి వద్ద ఉన్న వస్తువులను ఉండవలసినవి, అవసరానికి మించి ఉన్నవి గుర్తించి పట్టిక రూపంలో రాయించాలి. (పుస్తకాలు, నోట్‌బుక్స్, పెన్సిళ్ళు, ఎరేజర్లు, పెన్నులు మొదలగునవి)

| వస్తువులు | ఉండవలసినవి | అవసరానికి మించి ఉన్నవి |
|---|---|---|
| | | |

## ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

విద్యార్థులను అవసరానికి మించిన వస్తువులు, ఎప్పుడు ఉపయోగించనవి తమ తమ ఇళ్ళలో ఏమున్నాయో గుర్తించి చెప్పమనాలి. చర్చించాలి.

**సూక్తి**

**ఎంత సంపదున్నదని కాదు ముఖ్యం.**
**ఎంత తృప్తిగా జీవిస్తున్నామనేది ముఖ్యం.**

# 3 నిజాయితీ

**I. ప్రధాన విలువ**

శీలనిర్మాణం

**II. ఉప విలువ**

నిజాయితీ కలిగి ఉండడం

**III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు**

- నిజాయితీ కలిగి ఉండడం ఒక మంచి లక్షణమని తెలుసుకుంటాడు.
- నిజాయితీగా ఉండడం నేర్చుకుంటారు.

## IV. ఉపోద్ఘాతం

మానవునికి ఉండాల్సిన వాటిలో ముఖ్యమైనది శీలం. శీలం యొక్క లక్షణాల్లో ఒకటి నిజాయితీ. నిజాయితీ వల్ల వ్యక్తిగతంగా, సమాజానికి మేలు జరుగుతుంది. చేసే పనులు, చెప్పేమాటలు చేసినవి చేసినట్లుగా, చెప్పినవి చెప్పినట్లుగా ఒప్పుకోవడం, సత్యంపలకడం, అబద్దాలు చెప్పకపోవడం, చూసినవి చూసినట్లుగా చెప్పడం వంటివి, ఒప్పుకున్న పనులు తగిన సమయంలో చేయడం వంటివి మనిషి నిజాయితీని తెలియజేస్తాయి. నిజాయితీ కల్గిన రామయ్యకు ఏం జరిగిందో ఈ కథ నుండి తెలుసుకోండి.

## V. కథ

### కథ-1

రామయ్య చాలా నిజాయితీ కల మనిషి. కానీ పేదవాడు. పగలంతా అడవిలో ఎండుకట్టెలు కొట్టి, సాయంకాలం కాగానే మోపు కట్టి బజారుకు వెళ్ళేవాడు. కట్టెలు అమ్మగా వచ్చిన డబ్బుతో తిండి గింజలు కొనుక్కొని ఇంటికి వచ్చేవాడు. కష్టపడి పనిచేసి కడుపు నింపుకొనేవాడు.

ఒక రోజు రామయ్య కట్టెలు కొట్టడానికని అడవికి వెళ్ళాడు. నది ఒడ్డున ఉన్న ఓ ఎండుచెట్టు కొమ్మను నరకడానికని చెట్టు ఎక్కాడు. కొమ్మ నరుకుతున్నప్పుడు చెయ్యి జారి గొడ్డలి నదిలో పడిపోయింది. రామయ్య కిందికి దిగాడు. నదిలో ఎంత వెదికినా గొడ్డలి కనబడితే ఒట్టు. రామయ్య ఎంతో విచారంతో, నది ఒడ్డున తలపట్టుకు కూర్చుండిపోయాడు. అతని కళ్ళలోంచి నీళ్ళు కారసాగాయి. అతని వద్ద మరో గొడ్డలి కొనడానికి డబ్బుల్లేవు. గొడ్డలి లేకపోతే ఇంటిల్లిపాదీ పస్తులు ఉండాల్సిందే. అతనికి దిగులు పట్టుకుంది.

రామయ్య స్థితి చూసి వనదేవతకు జాలి కలిగింది. అతనికి ప్రత్యక్షమై 'అయ్యా! ఎందుకు ఏడుస్తున్నావు?' అని అడిగింది. రామయ్య వనదేవతకు నమస్కారం చేసి ఇలా అన్నాడు. "నా గొడ్డలి నీళ్ళలో పడిపోయింది మరి నేను కట్టెలు ఎలా కొట్టేది? నా భార్యా పిల్లలను పోషించే దారి ఏది అన్నాడు. 'నీవు బాధపడకు, నేను నీ గొడ్డలి తీసి ఇస్తాను' అని వనదేవత అంది.

వనదేవత నీటిలో నుండి ముందుగా ఓ బంగారు గొడ్డలి పైకి తీసుకువచ్చి 'ఇదిగో నీ గొడ్డలి తీసుకో' అంది.

రామయ్య ఆ గొడ్డలిని చూసి, అది తనది కాదన్నాడు.

దేవత మరోసారి నీటిలో మునిగి ఈసారి వెండి గొడ్డలి పైకి తీసి రామయ్యకు ఇవ్వబోయింది.

రామయ్య అది కూడా తనది కాదన్నాడు.

వనదేవత ఈసారి నీటిలో మునిగి ఇనుప గొడ్డలి తెచ్చింది. దాన్ని చూడగానే రామయ్య సంతోషంగా ఇదే నా గొడ్డలి అని తీసుకొని వనదేవతకు కృతజ్ఞతలు తెలిపాడు. వనదేవత రామయ్య నిజాయితీ చూసి సంతోషించింది. బంగారు, వెండి గొడ్డళ్ళకు ఆశపడకుండా నిజాయితీగా నీ గొడ్డలి నీవు తీసుకున్నావు. నీ నిజాయితీకి మెచ్చి నేను ఈ బంగారు, వెండి గొడ్డళ్ళు కూడా ఇస్తున్నా, తీసుకో" అంది.

రామయ్య సంతోషంతో వనదేవతకు నమస్కరించి, వాటితో ఇంటికి వెళ్ళాడు. ధనవంతుడయ్యాడు. ఆ తరువాత అడవికి వెళ్ళడం మానివేశాడు.

పక్కింటి పుల్లయ్య రామయ్య అడవికి వెళ్ళకపోవడం, అకస్మాత్తుగా ధనవంతుడు కావడం గమనించి రామయ్యను కలిసి కారణం అడిగాడు. రామయ్య జరిగిన కథ అంతా పుల్లయ్యకు చెప్పాడు.

పుల్లయ్య దురాశాపరుడు. తాను కూడా బంగారు, వెండి గొడ్డలి సంపాదించాలని గొడ్డలి తీసుకొని అడవికి వెళ్ళాడు. రామయ్య కొట్టిన చెట్టుపై కూర్చుని కట్టెలు కొట్టినట్టు నటిస్తూ గొడ్డలిని నదిలో జారవిడిచి కల్లబొల్లి ఏడుపు ఏడవసాగాడు.

వనదేవత ప్రత్యక్షమై ఏమైందని అడిగితే గొడ్డలి నీటిలో పడిపోయిందని దొంగ ఏడుపు ఏడ్చాడు. వనదేవత బంగారు గొడ్డలి తెచ్చి 'నీదేనా!' అని అడిగింది. పుల్లయ్య ఆనందంతో గంతేసి 'నాదే!' అన్నాడు.

వనదేవతకు పుల్లయ్య దొంగబుద్ధి అర్థం అయి, 'నువ్వు అబద్ధం చెబుతున్నావు. నీకు తగిన గుణపాఠం చెబుతాను' అంటూ గొడ్డలితో సహా మాయమయింది.

దురాశకు పోయిన పుల్లయ్య, బంగారు గొడ్డలి దొరకలేదు కదా! ఉన్న ఇనుప గొడ్డలిని కూడా పోగొట్టుకున్నాడు. గుండెలు బాదుకుంటూ ఇంటి ముఖం పట్టాడు.

## కథ-2

గంగ నాల్గో తరగతి చదువుతోంది. చాలా చురుకైన పిల్ల. బడిలో కూడా టీచర్‌కు గంగ అంటే చాలా ఇష్టం. పాఠం వినేటప్పుడు ఎన్నో రకాల సందేహాలను అడుగుతూ ఉంటుంది. బడిలో జరిగిన విషయాలు జరిగినట్లు చెబుతుంది. ఏదీ దాచిపెట్టే గుణం గంగకు లేదు. ఒకసారి గంగ ఇంట్లో ఏం జరిగిందో చూడండి.

గంగ నాయనమ్మ బట్టలు కుడుతుంది. వాళ్ళ పక్కింట్లో ఉండే ముంతాజ్ వాళ్ళ కూతురు గౌను కుట్టమని బట్టతెచ్చి ఇచ్చింది. నిజానికి ఆ బట్టతో రెండు గౌన్లు కుట్టచ్చు. గంగ నాయనమ్మ ఒక గౌను కుట్టి ఇచ్చి మిగతా బట్టతో దిండు కవరు కుట్టింది. గంగ ఇది గమనించి అదేంటి నానమ్మా! ముంతాజ్ ఆంటీ గౌను కుట్టమని ఇచ్చిన గుడ్డతో దిండు కవర్ కుట్టావు అని అడిగింది. నానమ్మ గంగను తిట్టి ఊరుకుంది. కానీ గంగ ఊరుకోలేదు. గౌనుతో బాటు దిండుకవరును కూడా తీసుకెళ్ళి ముంతాజ్ ఆంటీకి ఇచ్చింది. వాళ్ళ నానమ్మకు భయపడకుండా వాస్తవాన్ని చెప్పింది. ముంతాజ్ ఆంటీ గంగకు రెండు జామకాయలనిచ్చి పంపింది.

ఇంకొకసారి ఏమి జరిగిందో చూడండి. ఒకసారి గంగ వాళ్ళ పెదనాన్నగారి ఊరికి వాళ్ళ అమ్మతో కలిసి బయలుదేరింది. బస్సులో కండక్టర్ గంగకు ఫుల్ టికెట్ తీసుకొమ్మని అన్నాడు. కాని గంగ వాళ్ళ అమ్మ గంగకి ఆరేళ్ళే అని చెప్పింది. అంతలో గంగ లేదు కండక్టర్ గారు నాకు 9 ఏళ్ళు నేను 4వ తరగతి చదువుతున్నాను అంది. గంగ మాటలకు కండక్టర్ నవ్వి ఫుల్ టికెట్ కొట్టాడు.

పిల్లతో వేగలేక చస్తున్నా భయంలేదు. ఏదీ దాచదు అంటూ విషయమంతా వాళ్ళ పెద్దమ్మతో చెప్పింది. గంగ చేసింది ఏమైనా చెడ్డపనా! వాస్తవాలను చెప్పింది అంతేకదా! ఇలా నిర్భయంగా నిజం చెప్పేవారు ఎంత మంది ఉంటారు? గంగని మెచ్చుకోవాలి అంది.

ఇలా ఇంట్లోనైనా, బయటైనా తాను జరిగిన విషయాలు విన్నా, చూసినా అవి విన్నది విన్నట్టు, చూసినది చూసినట్టు నిర్భయంగా చెప్పేది.

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) కథలో రామయ్య ఎటువంటివాడు? మీరు రామయ్య స్థానంలో ఉంటే ఏం చేసేవారు?

2) పుల్లయ్య ఎందుకు నష్టపోయాడు?

3) నిజాయితీగా ఉండాలంటే మీరు ఏంచేయాలి?

4) వాస్తవాలను గంగ నిర్భయంగా చెప్పింది కదా! ఇలా చేయడం సరైనదేనా?

### తెలుసుకోండి

మనుషుల్లో నిజాయితీ తగ్గిపోతోంది అని చాలా మంది నోట వింటున్నాం. ఏంటి ఈ నిజాయితీ? మనది కాని వస్తువు మనకు దొరికినప్పుడు అది ఎవరిదో వాళ్ళకు ఇవ్వడం నిజాయితీ. నేను ఇది చేస్తానని చెప్పినప్పుడు ఆమాట మీద నిలబడి ఆ పని చేయడం నిజాయితీ. మనమేదైనా తప్పు చేసినప్పుడు ఆ తప్పు చేశామని ఒప్పుకోవడం నిజాయితీ.

పాలల్లో నీళ్ళు కలపకపోవడం నిజాయితీ. వస్తువులను కల్తీ చేయకపోవడం నిజాయితీ. అమ్మే వస్తువు దాని ధరకు తగిన విధంగా అమ్మడం నిజాయితీ. ఉన్నది ఉన్నట్టుగా చెప్పడం నిజాయితీ. చెప్పింది చెప్పినట్టు చేయడం నిజాయితీ. తమ పని తాము చక్కగా చేయడం నిజాయితీ. ఇలా ఎన్నో ఉన్నాయి.

మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని చూస్తే మీకు నిజాయితీ కలిగిన వ్యక్తులు ఎక్కువమంది ఉన్నారా? నిజాయితీ లేనివాళ్ళు ఎక్కువ మంది ఉన్నారా? పరిశీలిస్తే మనకే తెలుస్తుంది. నిజాయితీ మన స్వీయ క్రమశిక్షణకు ఒక గుర్తు. మనం ఎవరి నుండైనా ఒక వస్తువు మళ్ళీ ఇచ్చేస్తామని తెచ్చుకుంటాం కాని ఇవ్వడం మరిచిపోతాం. ఇలా మరిచిపోతే మన నిజాయితీని శంకించే ప్రమాదం ఉంది. కాబట్టి మన ప్రవర్తనలో నిజాయితీ ఎంత వరకు ఉంది. మన ప్రవర్తనద్వారా ఎవరూ మోసపోకుండా, ఎవరూ బాధపడకుండా ఉన్నారా అని ఆలోచించుకోవాలి. నిజాయితీ కల్గి ఉండడంవల్ల అందరిలో మనకొక ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. మన మీద అందరికీ నమ్మకం పెరుగుతుంది. ఆ నమ్మకం వల్ల మంచి సంబంధాలు పెరుగుతాయి.

## ఆ) తరగతి కృత్యం - జట్టుపని

విద్యార్థులను తాము తమ మిత్రులలో నిజాయితీగా వ్యవహరించిన సందర్భాలను గురించి చెప్పమనాలి. చర్చించాలి. అభినందించాలి.

## ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

విద్యార్థులను వారం రోజులపాటు నిజాయితీగా వ్యవహరించమని చెప్పాలి. దొరికిన వస్తువులను నిజాయితీ పెట్టెలో వేయమనాలి. వారి అనుభవాలను చెప్పమనాలి. చర్చించాలి. దీన్ని కొనసాగించమని చెప్పాలి.

### మీకు తెలుసా!

**పాఠశాలలో నిజాయితీ పెట్టె :**

బడిలో ఒక నిజాయితీ పెట్టెను ఏర్పాటుచేశారు. ఆ బడిలో తరగతిలోగాని బడిలోగాని ఏ వస్తువులు తమకు దొరికినా పిల్లలు అవి తీసుకెళ్ళి నిజాయితీ పెట్టెలో వేస్తారు. అలా నిజాయితీ పెట్టెలో పడిన వస్తువులు ఎవరివో ప్రార్థన సమయంలో పిల్లల్ని అడిగి ఎవరివి వాళ్ళకు ఇస్తారు. నిజాయితీ పెట్టెలో తమకు దొరికిన వస్తువులను వేసిన పిల్లలందరినీ అభినందిస్తారు.

**నిజాయితీ దుకాణం :**

పాఠశాలలో పిల్లలకు అవసరమయ్యే పెన్నులు, పెన్సిళ్ళు, రబ్బర్లు, షార్ప్‌నర్లు, స్కేళ్ళు, నోటుపుస్తకాలు ఇలా ఒక్కొక్కటి ఒక్కొక్క ట్రేలో పెట్టి ఆ ట్రే పై వాటి ధరను ప్రదర్శిస్తారు. దాని పక్కనే ఒక డబ్బులు వేసే పెట్టె ఉంటుంది. పిల్లలు తమకు కావలసిన వస్తువులను వాటి ధరను బట్టి తీసకొని డబ్బును ఆ డబ్బాలో వేస్తారు. అమ్మేవాళ్ళు ఎవరూ ఉండరు. పిల్లలే నిజాయితీగా ఎన్నికావాలో అన్ని కొనుక్కొని తగిన డబ్బును డబ్బాలో వేస్తారు. ఎక్కడ కూడా వస్తువులకు - డబ్బుకు తేడా రాదు. అంత నిజాయితీతో పిల్లలు కొంటారు.

### సూక్తి

పొరపాట్లు అందరూ చేస్తుంటారు.
కానీ ఆ పొరపాట్లను ఒప్పుకొని
సరిచేసుకున్నవాడే గొప్పవాడు.

# 4 అభినందన

## I. ప్రధాన విలువ

జీవననైపుణ్యాలు

## II. ఉప విలువ

ఇతరుల గొప్పదనాన్ని అభినందించడం

## III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు

- ఇతరులు ఏదైనా మంచి పనిచేసినప్పుడు, నైపుణ్యత కలిగిన పని చేసినప్పుడు అభినందించే తత్వాన్ని విద్యార్థులలో పెంపొందింపజేయడం.

## IV. ఉపోద్ఘాతం

ప్రస్తుత కాలంలో మనుష్యుల్లో స్వార్థం పెరుగుతోంది. నాది, నాది అన్న భావనే తప్ప ఇతరుల గురించి ఆలోచించలేకపోతున్నారు. తనకన్నా ఎవరు బలమన్నా, మంచిపని చేసినా వారి యొక్క గొప్పదనాన్ని గుర్తించి అభినందించకపోగా వారి పట్ల ఈర్ష్య, అసూయలను పెంచుకుంటున్నారు. చిన్న అభినందన వ్యక్తిలో ఉత్సాహాన్ని, చైతన్యాన్ని నింపుతుంది. మనుష్యుల మధ్య సంబంధాలను మెరుగుపరుస్తుంది. మనపట్ల గౌరవాన్ని కలుగజేస్తుంది. కనుక ఇతరులలోని మంచిని, నైపుణ్యాన్ని, గొప్పదనాన్ని గుర్తించి వారిని అభినందించే గుణాన్ని విద్యార్థులలో పెంపొందింపజేయాలి.

# V. సన్నివేశం

## సన్నివేశం - 1

మాస్టారు ఆ రోజు హాఫియర్లీ పరీక్ష పేపర్లు ఇస్తున్నారు. పిల్లలంతా ఆసక్తిగా మార్కుల కోసం ఎదురుచూస్తున్నారు. మూడు సబ్జెక్టుల్లో మహేష్. మిగిలిన మూడు సబ్జెక్టుల్లో గోపి ఫస్ట్ వచ్చారు. మాస్టారు వారిద్దరినీ పిలిచి అభినందించారు.

“మీరు చదువు విషయంలో ఇలా పోటీ పడటం నాకు చాలా ఆనందంగా ఉంది. ఏ విషయంలోనైనా పోటీ ఉన్నప్పుడే రాణిస్తారు. మీరిద్దరూ ఇలాగే చదువుకోండి” అన్నారు మాస్టారు.

‘అలాగే’ అన్నారు మహేష్, గోపి. మూడు సబ్జెక్టుల్లో ఫస్ట్ వచ్చినందుకు గోపి మహేష్‌ను అభినందించాడు. మహేష్ మాత్రం ముఖం అదోలా పెట్టి వెళ్ళిపోయాడు.

వాళ్ళిద్దరు కేవలం చదువులోనే కాకుండా క్విజ్, వ్యాసరచన పోటీ, చదరంగం లాంటి అన్ని విషయాల్లోను పోటీపడతారు. మహేష్ తనకు రాని ఆటలలో కూడా గోపికి పోటీగా ఉండేవాడు. గోపీకి బహుమతి వస్తే మహేష్ సహించేవాడు కాదు. ఇది గోపి గమనించాడు.

వారం రోజుల తర్వాత జరిగే ఈతపోటీల్లో పాల్గొనేందుకు పేరు ఇచ్చాడు గోపి. గత రెండేళ్ళుగా గోపి ఈత పోటీల్లో ఫస్ట్ వస్తున్నాడు. మహేష్ కూడా పేరు ఇచ్చాడు. అది చూసి గోపి -

“మహేష్! నీకు ఈత రాదుకదా ఎలా ఈదుతావ్” అన్నాడు.

“ఏం పరవాలేదు. వారం రోజుల్లో ఈత నేర్చుకుని ఈదుతా. నేను పాల్గొంటే నీకు భయంగా ఉందా?” అన్నాడు మహేష్ ఎగతాళిచేస్తూ. ఈతపోటీల రోజు రానే వచ్చింది. అందరూ ఒకరికొకరు ‘విష్ యూ ఆల్ ది బెస్ట్’ అని చెప్పుకున్నారు. మహేష్ మాత్రం గోపికి చెప్పలేదు. పోటీ ప్రారంభమయ్యింది. పిల్లలందరు గమ్యంవైపు ఈదుతూ వెళుతున్నారు. కొంత దూరం తనతో సమానంగా వచ్చిన మహేష్ వెనకబడటం గమనించాడు. గోపి తనను దాటి వెళ్ళడంతో మహేష్ రొప్పుతూ ఈదబోయాడు. ఈలోగా దమ్ము పట్టడం కష్టమవడంతో నీళ్ళలో మునిగిపోయాడు. ఒడ్డున ఉన్న వాళ్ళంతా ‘మహేష్’ అంటూ అరవసాగారు. ముందు వెళ్తున్న గోపి వెనకకు తిరిగి మహేష్ నీళ్ళలో మునిగిపోవడం చూసి తొందరగా మహేష్ దగ్గరికి వచ్చి అతడిని ఒడుపుగా పట్టుకుని ఒడ్డుకు చేర్చాడు. కాసేపు ప్రథమ చికిత్స చేసేసరికి మహేష్ మెల్లగా తెప్పరిల్లాడు. మహేష్ గోపికి కనీసం ‘థాంక్స్’ అయినా చెప్పకుండా వెళ్ళిపోయాడు. ఆ మర్నాడు జిల్లా జడ్జి విజేతలకు బహుమతులు అందచేశాడు. సాహసం చేసి మహేష్‌ను రక్షించినందుకు గోపికి ప్రత్యేక బహుమతిని ఇచ్చి మెచ్చుకున్నాడు.

గోపి మైక్ వద్దకువెళ్ళి ‘మిత్రులారా! నేను చదువులో, ఆటల్లో శ్రద్ధ వహించడానికి మహేష్ పరోక్ష ప్రేరణ, అటువంటి మహేష్ వారం రోజుల్లో ఈత నేర్చుకుని నాకు పోటీగా ఎంతో సాహసంగా ఈదాడు. అతని పట్టుదల చూసి, నా ఈ బహుమతిని మహేష్‌కు ఇవ్వాలనిపిస్తున్నది. అంటూ మహేష్‌ను స్టేజి పైకి పిలిచి బహుమతిని మహేష్‌కు అందించాడు.

*గోపి మాటలకు మహేష్ మనసు కదిలిపోయింది. 'తను ఈర్ష్యతో గోపికి పోటీగా నిలబడితే గోపి దాన్ని మెచ్చుకుని తన బహుమతిని నాకు ఇస్తున్నాడు. దేనికైనా పోటీపడాలి. కాని ఎదుటివాడిని కించపరచేలా ఉండకూడదు. అలాగే పోటీలో గెలిచినా, ఓడినా సరదాగా తీసుకోవాలి. ఒకవేళ ఓడితే తర్వాత గెలిచేందుకు పట్టుదలతో కృషి చేయాలి. గెలిచిన వారిని, వారి నైపుణ్యాన్ని అభినందించాలి. అంతేగాని ఈర్ష్యపడకూడదు' అంటూ స్టేజిపైన ఆనందంతో గోపిని కౌగిలించుకున్నాడు.*

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) ఈ కథవల్ల నీవు ఏమి తెలుసుకున్నావు?

2) నిన్ను ఎవరైనా ఎప్పుడైనా అభినందించారా? అప్పుడు నీకు ఎలా అనిపించింది.

3) మనం ఎవరినైనా ఎప్పుడు అభినందించాలి? ఎందుకు అభినందించాలి?

4) మీ పాఠశాలలో, మీ మిత్రులలో మంచి నైపుణ్యాలు (బొమ్మలు గీయడం, ముగ్గులు వేయడం పాటలు పాడడం, ధైర్యంగా ఉండడం, ప్రశ్నలు అడగడం మొ॥) ఉన్నవారు ఎవరు? వారిని ఎప్పుడైనా ప్రశంసించారా? వారి పేర్లు చెప్పండి వారిని అభినందించండి.

### తెలుసుకోండి

ఒక అభినందన వ్యక్తిలో ఆనందాన్ని, సంతోషాన్ని, చైతన్యాన్ని కలిగిస్తుంది. ఎవరైనా ఏ పనినైనా సమర్థవంతంగా చేసినప్పుడు వారిని తప్పకుండా అభినందించాలి. అలా అభినందించడంవల్ల తను చేసిన పని విలువ (అది మంచి పని అని) తెలుస్తుంది. మంచి పనులను చేయడానికి అది ప్రోత్సాహకంగా పనిచేస్తుంది. మనల్ని ఎవరైనా అభినందించినప్పుడు మనకు ఎలా అనిపిస్తుంది. చాలా సంతోషంగా అనిపిస్తుంది. మళ్ళీ మళ్ళీ మంచి పని చేసి ఇతరుల మెప్పు పొందాలనిపిస్తుంది కదూ! కనుక మంచి పని చేసినవారిని ఎవరినైనా అభినందించాలి.

మీ తరగతిలో మంచి మార్కులు తెచ్చుకునే విద్యార్థులను, ఆటల్లో, పాటల్లో రాణించే విద్యార్థులను అభినందించాలి. వీలైతే వారితో పోటీపడటానికి ప్రయత్నించాలి. నాకన్నా ఎక్కువ మార్కులు తెచ్చుకుంటున్నారని, బాగా ఆడుతున్నారని వారి మీద ఈర్ష్యా, ద్వేషాలను పెంచుకోకూడదు. అందరితో కలిసి మెలిసి ఉండటానికి ప్రయత్నించాలి. ఇతరులను అభినందించడం వల్ల మనకు నష్టమేమీ కలుగదు ఇంకా లాభమే కలుగుతుంది. వారికి మన మీద మంచి అభిప్రాయం కలుగుతుంది. మనల్ని స్నేహితులుగా భావిస్తారు. అది మనకు గౌరవాన్ని కలుగజేస్తుంది. కనుక ఇతరులలోని మంచిని గుర్తించి అభినందించడం అలవాటు చేసుకోవాలి.

## ఆ) తరగతి కృత్యం - జట్టుపని

**కింది అంశాల గురించి పిల్లలతో చెప్పించండి.**

1) నిన్ను ఇతరులు అభినందించిన సందర్భాలు ఏవి? అప్పుడు నీకు ఎలా అనిపించింది?

2) నీవు ఇతరులను అభినందించిన సందర్భాలు ఏవి? నీవు వారిని అభినందించడానికి గల కారణాలేవి?

## ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

- మీరు ఈ వారం రోజులూ మీ ఇంట్లో, బడిలో మంచి పని చేసిన వారిని అభినందించండి. వారు చేసిన మంచి పనులను, మీరు అభినందించినప్పుడు మీకు ఎలా అనిపించిందో చెప్పండి.

### ఇలా చేయండి!

- పెద్దవారిని వినయంతో రెండు చేతులతో నమస్కరించాలి, చిన్న వారిని ప్రేమతో పలకరించండి.
- సజ్జనులతో స్నేహం చేయండి.
- సహనం, శాంతి అలవరచుకోండి. సేవాకార్యక్రమాల్లో పాల్గొనండి.
- మీ ఇంట్లో వారికి, బయటివారికి మీకు చేతనైన సాయం చేయండి.
- చిరునవ్వుతో పలకరించండి. మంచి పనులను అభినందించండి.

### సూక్తి

**చిన్న చిన్న అభినందనలే మనసుకు ఆనందాన్ని కలిగించడమే కాకుండా మరో మంచి పని చేయడానికి ప్రోత్సాహాన్నిస్తాయి.**

# 5 బాధ్యత

## I. ప్రధాన విలువ

బాధ్యతలు నిర్వర్తించడం

## II. ఉప విలువ

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం

## III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు

- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో మన పాత్ర ఏంటో తెలుసుకొంటారు.
- బాధ్యతలు నిర్వహించడంపట్ల అవగాహన కలిగి ఉంటారు.

## IV. ఉపోద్ఘాతం

మన వస్తువులను మనం చాలా జాగ్రత్తగా చూసుకుంటాం. అలాగే మనం ఇంటిని కూడా మనది అనే భావనతో ఎంతో బాగా చూసుకుంటాం. ఇదే భావనతో మన పరిసరాల గురించి మనం ఆలోచిస్తున్నామా లేదా అని మనము ఆలోచించుకోవాలి. పరిసరాల పరిశుభ్రత కూడా మన బాధ్యతగా భావించాలి. అమలుచేయాలి. అప్పుడే అందరూ ఆరోగ్యంగా సుఖంగా ఉండగల్గుతారు.

## V. సన్నివేశాలు

### సన్నివేశం – 1 : చెత్తను వీధిలో వేయడం

ఒక వీధి. ఆ వీధి వారందరు తమ ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకొని చెత్తను మాత్రం వీధిలోనే వేస్తున్నారు. ఎవరు పట్టించుకోరు. చెత్తను వేస్తూనే ఉన్నారు. ఇలా వేయడం ద్వారా చెత్తకుప్పకుప్పలుగా పెరిగి, చాలా రోజులు దాక ఉండడంవల్ల కుళ్ళిపోయి దుర్వాసన వచ్చింది. ఈగలు దోమలు ఎక్కువైనాయి.

ఇలా చెత్తను వీధిలో వేయడం మంచిదేనా? దానివల్ల కలిగే నష్టాలేమిటి?

### సన్నివేశం – 2 : పాఠశాలలో వంట చేసే స్థలం పరిశుభ్రంగా లేకపోవడం

ఒక పాఠశాల. అందులో వంటచేసే గది. గది పక్కనే నీటి కుళాయి ఉండడంవల్ల దాని చుట్టూ ఎప్పుడూ నీరు చేరి ఉంది. వంటవారు వంట పాత్రలు, బియ్యం అక్కడే కడిగిపోస్తున్నారు. కూరగాయల తొక్కలు తీసి గది పక్కనే వేస్తున్నారు. పాఠశాల చెత్తనంతా గది పక్కనే వేస్తున్నారు. పిల్లలు మధ్యాహ్న భోజనం అక్కడే చేస్తున్నారు.

ఇలాంటి భోజనం చేయడం ఆరోగ్యకరమా?

### సన్నివేశం – 3 : ఫంక్షన్ చేసినప్పుడు చెత్త, అన్నం పేరుకుపోవడం

ఒకరింట్లో అమ్మాయి పెళ్ళి. పెళ్ళి వేడుకలు (సంబరాలు) జరుగుతున్నాయి. చుట్టాలు, స్నేహితులు, పక్కవారు పెళ్ళికి వచ్చారు. 2 రోజుల నుండి వారు మిగిలిన వ్యర్థపదార్థాలను వీధిలోని రోడ్డు పక్కన వేస్తున్నారు. పెళ్ళి సంబరంలో ఎవరు పట్టించుకోవడంలేదు. పదార్థాలన్నీ కుళ్ళిపోయి వాసన వస్తుంది. వాసనకు రోడ్డుపైన వెళ్ళేవారు భరించలేకపోతున్నారు.

ఇలా ఇతరులకూ ఇబ్బంది కల్గించవచ్చా?

### సన్నివేశం – 4

లక్ష్మణ్ ఇంటికి వెళితే చాలా ముచ్చటగా అనిపిస్తుంది. ఎక్కడ చూసినా శుభ్రంగా ఉంటుంది. ఇంటి ముందు మొక్కలు. ఆ మొక్కలకు పాదులు చేసి ఇంట్లో వాడుకున్న నీళ్ళు మొక్కలకు మళ్ళించారు. చెత్తబుట్టలో చెత్తవేసి ఉంచారు. ఒకవైపు ఒక గొయ్యితీసి అందులో తడిచెత్త వేశాడు. దాంతో మొక్కలకు కావలసి ఎరువును తయారుచేస్తారట. ఇంటి ముందు పూలమొక్కలు చూడడానికి కళకళలాడిపోతూ ఉన్నాయి. ఎవరైనా వాళ్ళింటికి వెళితే అలా బయట కాసేపు హాయిగా కుర్చీలు వేసుకొని కూర్చుని మాట్లాడాలనుకుంటారు అంత బాగుంటుంది.

*అదే ఇంటి పక్క కుమార్ వాళ్ళ ఇల్లు ఉంది. ఇంటి ముందు ఎక్కడ చూస్తే అక్కడ చెత్త. తినిపారేసిన కవర్లు గాలికి ఎగురుతూ ఉంటాయి. ఇంట్లో మురుగునీరంతా ఇంటి ముందే ఒక మురికి నీటి గొయ్యిలా తయారయ్యింది. ఒకటే కంపు. ఇంటి ముందు ఒక మొక్కకూడా లేదు. ఎక్కడ పడితే అక్కడ ఉమ్మేసి అసహ్యంగా ఉంటుంది. ఎవరికీ వాళ్ళ ఇంటికి వెళ్ళాలనిపించదు.*

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) పై సన్నివేశాలు గమనించారు గదా! ఈ ప్రదేశాలు ఎలా ఉన్నాయి? అలా ఉండటం మంచిదేనా? ఎందుకు?
2) మీ ప్రాంతంలో అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలకు కారణాలేవి?
3) మనం పరిసరాలను పరిశుభ్రంగా ఎందుకు ఉంచుకోవాలి?
4) పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలంటే మనం ఏం చేయాలి?
5) మన ఇంట్లో పరిశుభ్రంగా ఉంటే చాలా? మన చుట్టు ప్రక్కల కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలా? ఎందుకు?
6) లక్ష్మణ్, కుమార్ ఇళ్ళలో మీకు ఏది నచ్చింది? ఎందుకు? మీ ఇల్లు ఎలా ఉంటుంది? మన బడి చుట్టు పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయా? లేకుంటే ఆ రోజు ఏం చేద్దాం?

### తెలుసుకోండి

### పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం

మనం మన వస్తువులను ఎంతో జాగ్రత్తగా చూసుకుంటాము. అలాగే ఇంటిని, ఇంటి పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వీధిని చెత్తకుప్పలతో, మురికి నీటితో అపరిశుభ్రం చేయకూడదు. అపరిశుభ్రంగా ఉంచుతున్నాము కాబట్టే అంటురోగాలు వచ్చి అనారోగ్యానికి గురౌతున్నాము. రోగాలకు మందుల ఖర్చు భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. అప్పుచేసినా సరే మన ప్రణాలను కాపాడుకోవడానికి వెనుకాడము. కాని రోగాల బారి నుండి తప్పించుకోవడానికి మాత్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలేదు. కాబట్టి ముందుగా పరిసరాల పరిశుభ్రతను పాటించాలి. ముఖ్యంగా ఇంటి పరిసరాలలోని చెత్తను చెత్తకుండిలోనే వేయాలి. ఈగలు, దోమలు రాకుండా బ్లీచింగ్ పౌడరు లాంటివి చల్లాలి. కుళాయి దగ్గర నీరు నిల్వలేకుండా చూసుకోవాలి. పరిశుభ్రత గురించి పిల్లలకు చిన్నతనం నుంచే అవగాహన కల్పించాలి. ఇది మనందరి బాధ్యత.

## ఆ) తరగతి కృత్యం - జట్టుపని

| వరుస సంఖ్య | అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాలు | అవి అపరిశుభ్రంగా ఉండటానికి గల కారణాలు | వాటిని పరిశుభ్రంగా ఉంచటానికి మనం ఏం చేయాలి? |
|---|---|---|---|
| 1 | ఇల్లు | | |
| 2 | పాఠశాల | | |
| 3 | తరగతి గది | | |
| 4 | వీథి | | |

## ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

ఈ కింది ప్రదేశాలలో ఏదైనా ఒక దానిని ఎంచుకొని దానిని పరిశుభ్రంగా ఉంచటానికి ప్రయత్నించండి. మీ అనుభవాలను చెప్పండి.

1) ఇల్లు 2) పాఠశాల 3) తరగతి గది 4) వీథి

### శుభ్రత

శుభ్రత అంటే స్వచ్ఛంగా, శరీరాన్ని శుభ్రంగా ఉంచుకోవడం, ఇందుకు మనం ఉదయముననే నిద్రలేవాలి. మలవిసర్జన పూర్తిచేసుకొనుట, పళ్ళను శుభ్రముగా తోముకొనుట, ప్రతిరోజు శుభ్రంగా ఒళ్ళు రుద్దుకొని స్నానం చేయుట, గోళ్ళను శుభ్రముగా చేసుకొని పెరిగిన గోళ్ళను కత్తిరించమని చెప్పుట, శుభ్రమైన బట్టలనే ధరించుతూ మనం మన శరీరాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి.

అలాగే మన శరీరాన్నే కాదు మన చుట్టూ ఉండే పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకుంటేనే మనం ఆరోగ్యంగా ఉంటాము. అదెలాగో తెలుసా? చినిగిన కాగితములు, తొక్కలు, చెత్త చెదారములు చెత్తబుట్టలోనే వేయాలి. తరగతి గదిలో ఉంచిన వస్తువులను శుభ్రంగా ఉంచుకోవాలి. కాగితములను చింపకూడదు. తోటలో పడిన ఆకులను తీసి తోటను శుభ్రంగా ఉంచాలి.

అలాగే మనం మన ఆహార విషయంలో కూడా శుభ్రత పాటించాలి. ఎలాగంటే మంచి తాజా పండ్లు, అమ్మ వండిన కూరలు, పప్పులు, అన్నీ వద్దనకుండా తింటూ, ప్రతిరోజూ తప్పకుండా పాలు త్రాగాలి. అలాగే ఆహారం తినటానికి ముందు కాళ్ళు, చేతులు శుభ్రంగా కడుగుకోవాలి. చేతిరుమాలు మీ దగ్గర ఎప్పుడూ ఉంచుకోవాలి. అలాగే చక్కగా ఆడుకుంటే ఆరోగ్యం శుభ్రంగా ఉంటుంది.

ఈ విధంగా మన ఆహారం, మన పరిసరాలు అన్నీ శుభ్రంగా ఉంచుకుంటే మన ఆరోగ్యం కూడా ఎంతో చక్కగా ఉండి మనం బాగా చదువుకోవడానికి సహకరిస్తుంది.

**సూక్తి**

**మన పరిసరాలు శుభ్రంగా స్వర్గంలా తయారవ్వాలంటే మన వంతు బాధ్యత మనం ఏం చేయాలో ఆలోచించాలి.**

# 6 ఆహారం వృథా చేయం

## I. ప్రధాన విలువ

పొదుపు

## II. ఉప విలువ

ఆహార పదార్థాలను వృథా చేయకుండుట.

## III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు

- ఆహార పదార్థాలను వృథా చేయకూడదని, మిగిలిన ఆహారపదార్థాలను ఏదో రకంగా సద్వినియోగపరచాలని తెలియజేయడం.

## IV. ఉపోద్ఘాతం

మన శరీరానికి బలాన్ని చేకూర్చి, ఆరోగ్యాన్ని అందించేవి ఆహారపదార్థాలు. ఈ ఆహార పదార్థాలు కేవలం మనకే కాదు సమస్త జీవులకు బలాన్ని చేకూర్చేవే. అలాంటి పదార్థాలను ఎక్కువగా వడ్డించుకోవటం, కిందపారేస్తూ తినటం, మిగిలినవి పారవేయడం ద్వారా వృథాచేస్తున్నారు. ఇలా వృథాచేయడంవల్ల ఎంతో మందికి ఆహారం లేకుండా పోతోంది. కనుక ఆహారపదార్థాలను వృథా చేయరాదని మిగిలిపోయిన ఆహారపదార్థాలను కూడా బీదవారికి, జంతువులకు పెట్టడం ద్వారా వాటిని సద్వినియోగ పరచాలని తెలియజేయాలి.

## V. సంభాషణ

### "ఆహారవృథా అరికడదాం"

| | | |
|---|---|---|
| మామయ్య | : | ఏరా! అశోక్ అన్నమంతా కిందపడేస్తున్నావ్? |
| అశోక్ | : | పడేయడంలేదు మామయ్య నేను తింటూంటే కిందపడుతూంది. |
| మామయ్య | : | మరి అలా కిందపడే అన్నం వృథా ఐనట్లే గదా! |
| అశోక్ | : | ఔను. మరి అక్కయ్య ఎప్పుడూ కూరల్ని అనవసరంగా ఎక్కువ ఎక్కువగా వడ్డించుకొని తినకుండా వదిలిపెడుతుంది కదా! |
| మామయ్య | : | అక్కయ్య ఐనా, నీవైనా, నేనైనా మరెవరైనా సరే మనకు ఉపయోగపడే పదార్థాల్ని అనవసరంగా పారేయకూడదు. |
| అవంతి | : | ఏంటి మామయ్య అశోక్ నాపైన ఏదో షికాయత్ చేస్తున్నట్టున్నాడు. |
| మామయ్య | : | ఏం లేదమ్మా! మన ఇంట్లో ఆహారపదార్థాలు ఎలా వృథా అవుతున్నాయో అశోక్ గమనిస్తున్నాడు. అదే విషయం నాకు చెప్తున్నాడు. |
| అవంతి | : | నేనేమన్నా వృథా చేస్తున్నానా? |
| మామయ్య | : | నువ్వు చేస్తున్నావో లేదో నాకు తెలియదు కాని ఎక్కువ ఎక్కువగా వడ్డించుకోవటం ఆహార పదార్థాలను పడేయటం చేయకూడదు. |
| అవంతి | : | ఔను మామయ్యా! తిందామనే వేసుకుంటాను. కానీ తినలేకపోతాను. |
| మామయ్య | : | అందుకే! మనకు ఎంత అవసరమో అంతే పదార్థాలను వడ్డించుకోవాలి. అన్నం, పప్పు, కూర, పచ్చడి ఇలా ఏదైనాసరే! నువ్వు వేస్ట్ చేసేది ఇంకొకరికి ఉపయోగపడుతుంది. |
| అవంతి | : | మీరు చెప్పేది నిజమే! మనం పడేయడంవల్ల ఇతరులకు తినే అవకాశాన్ని పోగొట్టినట్లే కదా! |
| మామయ్య | : | సరిగా గుర్తించావు. అంతేకాదు. ఇలాంటి విషయాల్లో నష్టం కూడా సంభవిస్తుంది. |
| అశోక్ | : | నష్టం ఎలా మామయ్యా? |
| మామయ్య | : | ఎవరికైనా ఆ ఆహారం ఉపయోగపడితే ఫరవాలేదు కాని లేదంటే నష్టమేకదా! |
| అవంతి | : | నష్టం ఎట్లా మామయ్య నాక్కూడా అర్థంకావట్లేదు. |
| మామయ్య | : | ఉదా॥ బెండకాయ కూర పడేశారనుకోండి! బెండకాయ కూర తయారుచేయటానికి అవసరమయ్యే పదార్థాలన్నీ మనం డబ్బు ఖర్చుపెట్టి కొన్నవేకదా! |

| | | |
|---|---|---|
| అశోక్ | : | మన డబ్బే కదా! |
| మామయ్య | : | డబ్బు కష్టపడి సంపాదించిందేకదా! అంటే మన కష్టం నష్టమైనట్లేకదా! మన శ్రమ వృథా ఐనట్లే కదా! అంతేకాదు. బెండకాయలు, నూనె, పసుపు, ఉప్పు, కారం మొదలగుపదార్థాలు తయరుచేసిన వారి కష్టాన్ని కూడా మనం వృథాచేసినట్లే! |
| అశోక్ | : | గ్యాస్ కూడా వృథా ఐనట్లే కదూ! |
| మామయ్య | : | అబ్బ! ఎంత సరిగ్గా చెప్పావు. ఇలా ఆలోచించడం నేర్చుకోవాలి? |
| అవంతి | : | మా అమ్మ సమయం, శ్రమ కూడా వృథా ఐనట్లే కదా! |
| మామయ్య | : | బాగా ఆలోచిస్తే నువ్వు చెప్పేదీ నిజమే. |
| అవంతి | : | మామయ్యా! ఇలా ఆలోచిస్తే చాలా ఆహారపదార్థాలు వృథా అవుతున్నట్లే కదా! |
| అశోక్ | : | మా బళ్ళో మధ్యాహ్న భోజన సమయంలో చాలా మంది ఆహారపదార్థాలు పడవేస్తారు. |
| మామయ్య | : | అవంతీ! నువ్వన్నట్లు ఆహార పదార్థాల వృథాను మనం అరికట్టాలి.<br>అశోక్! మీ బళ్ళో పిల్లలకు ఆహారపదార్థాల వృథా గూర్చి వివరించి, వృథా వల్ల కలిగే కష్టనష్టాల గూర్చి ఆలోచింపచేయాలి. |
| అశోక్ | : | మామయ్యా! మీ వల్ల ఓ ముఖ్యమైన విషయం తెలిసింది. దాని గురించి ఆలోచించాల్సిన అవసరం అర్థమైంది. |
| అవంతి | : | విందుభోజనాల్లో, పుట్టిన రోజు మొదలగు కార్యక్రమాల్లో మనం ఆహార వృథాను అరికట్టాలికదా మామయ్యా! |
| మామయ్య | : | బాగా చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనైనా మనకు బలాన్ని చేకూర్చి ఆరోగ్యాన్నందించే ఆహార పదార్థాలను వృథా చేయరాదు. ఐతే మనం తినాలి లేదా ఇతరులకు పెట్టాలి. అంతేకాని పారవేయరాదు.<br>మనకు బలాన్నిచ్చే ఆహారపదార్థాలను వ్యర్థపరిస్తే మనకు మనతోపాటు ఇతరులకూ నష్టం సంభవింపజేసినట్లే. అది గుర్తుంచుకోండి. |

## VI. అ) ఆలోచించడం – ప్రతిస్పందించడం

1) వృథా చేయడం అంటే మీరేమనుకుంటున్నారు?

2) అశోక్, అవంతిలా మీరెప్పుడైనా ఆహారాన్ని వృథాచేశారా? అది మంచి పనేనా?

3) ఇంట్లో ఆహార పదార్థాలు మిగిలిపోతే పెంట కుప్ప మీద వేస్తారా? లేక అవసరమున్న జంతువులకు పెడతారా? మీరైతే ఏం చేస్తారు?

4) ఆహారపదార్థాల వృథావల్ల ఎవరెవరికి కష్టం? నష్టం.

5) కింది వాటిలో సరైనవి ఏవి? కానివి ఏవి? గుర్తించండి.

అ) సోము చేకోడీలు కొన్ని తిని కొన్ని కాలువలోపడేసాడు.

ఆ) నాజియా అన్నాన్ని పడేయకుండా తింటుంది.

ఇ) రమేశ్‌కు మామిడిపండు రసం నచ్చకపోవడంతో మిగిలిన రసాన్ని చీమల పుట్టదగ్గర పోశాడు.

ఈ) అనిరుద్ధ వాళ్ళ అమ్మ రోజూ కూరలను ఎక్కువగా వండుతూ మిగిలిన వాటిని పెంటమీద పడేస్తుంది.

ఉ) భీం విందుభోజనాలకు వెళ్ళినప్పుడల్లా అక్కడ ఉన్నవారికి ఆహారపదార్థాలను "సరిపడా తినండి కాని పడేయకండి" అని చెబుతూంటాడు.

ఊ) విందు భోజనాలలో కొందరు ఎక్కువగా పెట్టుకొని వదిలేస్తుంటారు.

## తెలుసుకోండి

మనం జీవించాలంటే గాలి, నీరుతోపాటు ఆహారం కూడా అవసరం. ఆహారం తీసుకోకపోతే ఏ జీవులు కూడా తన జీవన కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించలేవు. మనం ఏపనిచేయాలన్నా శక్తి అవసరం. ఈ శక్తి మనకు ఆహారం ద్వారానే లభిస్తుంది. ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేసేది ఈ ఆహారం కోసమే అందుకే పెద్దలు "కూటి కోసం కోటి విద్యలు" అన్నారు. మనం జీవించడానికి అత్యంత అవసరమైన ఇటువంటి ఆహారపదార్థాలను తెలిసి కొంత, తెలియక కొంత ఇలా ఏదో విధంగా వృథా చేస్తున్నాము.

కోట్లాది మంది ఒక పూట కూడా తినడానికి తిండిలేక బాధపడుతుంటే ఉన్నవారు పెండ్లిళ్ళలో, ఫంక్షన్లలో విందులు, వినోదాలని, ఫ్యాషన్‌కోసం ప్లేట్లలో ఆహారపదార్థాలను వదిలివేస్తూ ఆహారాన్ని వృథా చేస్తున్నారు. ఇటువంటి వృథాను అరికట్టవలసిన బాధ్యత మనపై ఉంది.

మన ఇంట్లో చేసిన ఆహారపదార్థాలను మితంగా మనకు కావలసినంత పెట్టుకుని తినాలి. ఎక్కువగా పెట్టుకొని పారవేయరాదు. మిగిలిన పదార్థాలను చెత్తబుట్టలో వేయకుండా బీదవారికికాని, జంతువులకు కాని పెట్టాలి. అలాగే పెండ్లిళ్ళలో, ఫంక్షన్లలో, హోటళ్ళలో మిగిలిపోయిన ఆహారపదార్థాలను బీదలకు గానీ, అనాథాశ్రమాలకు కానీ పంపిణీ చేయాలి. అలాగే మధ్యాహ్నభోజన సమయంలో కూడా మీకు కావలసినది మాత్రమే పెట్టుకుని తినండి. అంతేకాని ఎక్కువగా పెట్టుకొని పారవేయకండి. మనం ఇలా అన్నాన్ని పారవేయడంవల్ల ఇతరులకు అన్నం లేకుండా చేసినవారమౌతాం. కనుక ఆహారపదార్థాలను వృథా చేయకండి.

## ఆ) తరగతి కృత్యం – జట్టుపని

- **కింది సందర్భాలలో ఆహారం ఎలా వృథా అవుతుందో దానిని ఎలా నివారించాలో జట్లల్లో పిల్లలతో చర్చింపజేసి చెప్పించాలి.**

  1) మధ్యాహ్న భోజన సమయంలో

  2) విందులు, పెండ్లి, వినోదాల సమయంలో

  3) ఇండ్లలో

## ఇ) ఆచరించడం – అనుభవాలు చెప్పడం

- మధ్యాహ్నభోజన సమయంలో జరిగే వృథాను ఎలా నివారించాలో చర్చించారు కదా! ఇక వారం రోజులు దానిని మీ పాఠశాలలో అమలుపరచండి. మీరు ఆహారపు వృథాను ఎంతవరకు అరికట్టగలిగారో చెప్పండి.

### ఇలా చేయండి!

- అన్నం తినేటప్పుడు చుట్టూ పడవేయకుండా తినండి.
- కూరల్లో కొత్తిమీర, కరివేపాకు ఏరిపారవేయకండి. వాటిలో పోషక పదార్థాలు ఉంటాయి.
- అన్నం, కూరలు, ఎంత కావాలో అంతే వడ్డించుకోండి.
- కొంచెం కూడా వృథా చేయకుండా ఒక్క మెతుకు మిగల్చకుండా తినండి.
- పండ్లు వంటివి కొరికి తిని పారేయడం చేయకండి. ముక్కలు కోసి కావలసినవి తిని మిగిలినవి ఇంకెవరికైనా పెట్టండి.

### సూక్తి

'అన్నం పరబ్రహ్మ స్వరూపం' – అన్ని దానాలలోకి అన్నదానం మిన్న

# 7 మన చేతుల్లోనే మన ఆరోగ్యం

## I. ప్రధాన విలువ

ఆరోగ్య విలువలు

## II. ఉప విలువ

వ్యక్తిగత పరిశుభ్రత – చేతులు, గోళ్ళు పరిశుభ్రతపై అవగాహన కలిగించడం

## III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు

- చేతుల పరిశుభ్రత ఆవశ్యకతను తెలుసుకుంటారు.
- పిల్లలు గోళ్ళు ఎప్పటికప్పుడు పెంచుకోకుండా కత్తిరించుకొని శుభ్రంగా ఉంచుకోవడం నేర్చుకుంటారు.

## IV. ఉపోద్ఘాతం

ఆరోగ్యమే మహాభాగ్యం. మనం ఆరోగ్యంగా ఉండడానికి పరిసరాల పరిశుభ్రత ఎంత అవసరమో వ్యక్తిగత పరిశుభ్రత కూడా అంతే అవసరం. ఎక్కువ శాతం మంది వ్యక్తిగత శుభ్రత లేకపోవడం వల్లనే రోగాలు తెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా పిల్లల్లో శుభ్రత లేకపోవడంవల్ల రకరకాల రోగాల బారిన పడుతున్నారు. శరీరంలోని ప్రతి అవయవం విషయంలో శ్రద్ధతీసుకొని శుభ్రతను పాటించాలి. చేతులు, గోళ్ళు శుభ్రంగా లేకపోవడం ఆహారం తీసుకొన్నప్పుడు అనేక సూక్ష్మజీవులు శరీరంలోకి ప్రవేశించి రోగాలకు కారణమవుతున్నాయి. అందువల్ల చేతులు, గోళ్ళు విషయంలో శుభ్రతను పాటించాలి.

- పిల్లలూ! ఆరోగ్యంగా ఉండటం అంటే ఏమనుకుంటున్నారు?
- మనకి అనారోగ్యాలు కలగడానికి కారణాలు ఏమై ఉంటాయో ఆలోచించి చెప్పండి.
- ఏయే సందర్భాలలో చేతులను శుభ్రంగా ఉంచుకోవాలి?

## V. కథనం

గోపి, రవి, రమ అక్కాతమ్ముళ్ళు. ఆ రోజు బడికి సెలవు కావడంతో వాళ్ళు ఇసుకలో ఆడుకుంటున్నారు. కొంచెం సేపు తర్వాత వాళ్ళమ్మ లడ్డూలు పెడతాను రమ్మని పిలిచింది. ముగ్గురూ పరుగెత్తుకుంటూ వచ్చారు. చేతులు చాపారు. చేతులు శుభ్రం చేసుకొని రండి అప్పుడు పెడతానని అమ్మ అన్నది. ముగ్గురూ వెళ్ళి వెంటనే వచ్చి లడ్డూలు పెట్టమని తొందర చేసారు. అప్పుడే అటుగా వచ్చిన మావయ్య పిల్లల్ని పలకరించి తన వద్దకు పిలిచాడు. లడ్డూలు తిని వస్తామని పిల్లలు చెప్పారు. లడ్డూలేకాదు ఇంకా వేరేవి కూడా నేను ఇస్తాను. ముందు నా దగ్గరకు వచ్చి మీ చేతులు చూపించమని అన్నాడు. ముగ్గురూ చూపించారు. రవి చేతులకు మట్టి ఉంది. గోపి, రమ చేతులకు మట్టి కనిపించకపోయినా గోళ్ళు మురికి ఉన్నాయి. అది చూసి మావయ్య "చేతులు కడగడం అంటే ఒంటికి తుడుచుకోవడం కాదు. ఊరికే నీళ్ళతో కడగడం కాదు. మన కంటికి కనిపించని క్రిములు చేతులకు అంటుకొని ఉంటాయి. చేతులను శుభ్రంగా సబ్బుతో రుద్ది కడగాలి. అలాగే మలవిసర్జనకు వెళ్ళివచ్చిన తరువాత కూడా సబ్బుతో రుద్దికొని చేతులు కడగాలి. అప్పుడు చేతులు శుభ్రంగా ఉంటాయి. అలాగే గోళ్ళను పొడవుగా పెంచారు. వాటిల్లో మట్టి చేరుకుంది. మనం స్నానం చేసినా, చేతులు కడుక్కొన్నా గోళ్ళలో ఉండే మట్టి పోలేదు చూసారు కదా! మురికి గోళ్ళతో ఉన్న వేళ్ళతో మనం ఆహారం తింటే చెడు బాక్టీరియా క్రిములు లోపలికి ప్రవేశించి నులి పురుగులు కడుపులో ఏర్పడతాయి. దానివల్ల కడుపునొప్పి వస్తుంది. అందువల్ల వారానికి ఒకసారి లేదా పదిహేను రోజులకు ఒకసారైనా గోళ్ళను కత్తించుకోవాలి. శుభ్రంగా ఉంచుకోవాలి. మన చేతులు, గోళ్ళు ప్రధానంగా రోగాలు రావడానికి కారణం. మురికిగా గోళ్ళతో గోకినప్పుడు అక్కడ పుండుపడుతుంది. అదే చేతిగోళ్ళతో ఇంకొక చోట గోకితే అక్కడ కూడా ఆ వ్యాధి వస్తుంది. రోగం వచ్చిన తరువాత డాక్టరు దగ్గరకు వెళ్ళడం, సూదిమందులు తీసుకోవడం కంటే మన శరీరభాగాల శుభ్రతపట్ల మనం జాగ్రత్త తీసుకుంటే ఎంతో మేలు జరుగుతుంది. చాలా రోగాలను నివారించుకోవచ్చు" అని అన్నాడు. వెంటనే పిల్లలు ముగ్గురూ వెళ్ళి పొడవైన గోళ్ళను కత్తిరించుకొని, సబ్బుతో శుభ్రంగా చేతులు కడుక్కొని వచ్చారు. అది చూసి మావయ్య మంచి పిల్లలని వారిని అభినందించి తాను తెచ్చిన పండ్లను వారికి ఇచ్చాడు. అమ్మ లడ్డూలు పెట్టింది. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందంటూ పిల్లలు అరుస్తూ పరిగెత్తారు.

## గోళ్ళపై పాట

నీ చేతికుండే నండి ఐదువేళ్ళు
ఐదువేళ్ళ కుండేనుగా పెద్దగోళ్ళు
ఇసుకలోన పెట్టినప్పుడు చిట్టిచేతులు
గోళ్ళలోన చేరునండి మట్టిముద్దలు

కాలు చేయి కడగకుండ నోటవేలు పెట్టిన
కడుపులోకి చేరునండి సూక్ష్మజీవులూ
పెరిగి పెద్దవై నీకు కలిగించు బాధలు
ఆరోగ్యం క్షీణించీ నీరసించి పోదవు

అందుకే....

చేతులు చక్కగా కడగాలి
గోళ్ళను పొట్టిగా కత్తిరించాలి
మురికిని, క్రిములను దూరం చేయాలి
చక్కని ఆరోగ్యం సొంతం చేసుకోవాలి.

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) పిల్లలూ! చేతులను ఎప్పుడెప్పుడు శుభ్రం చేసుకోవాలి? ఎందుకు? చెప్పండి.

2) గోళ్ళను ఎందుకు పెంచకూడదు?

3) చేతులు, గోళ్ళు శుభ్రంగా లేకపోతే ఏమవుతుంది?

### తెలుసుకోండి

- అంతర్జాతీయ చేతుల శుభ్రతా దినోత్సవాన్ని ప్రతి ఏటా అక్టోబరు 15న ప్రపంచం అంతటా జరుపుకుంటారు.
- మన చేతుల్లోనే మన ఆరోగ్యం ఉంది. భోజనానికి ముందు, ఆ తర్వాత అలాగే మలవిసర్జన తరువాత, మట్టిని, ఇసుకను తాకిన తర్వాత అలాగే అనేక మలినాలను తాకినప్పుడు సబ్బుతో రుద్ది చేతులును చక్కగా కడుక్కోవాలి. అలాగే గోళ్ళలో మురికి చేరకుండా ఉండాలంటే గోళ్ళను చిన్నగా కత్తిరించుకోవాలి.

పాఠశాలల్లో విద్యార్థులకు చేతులు ఎలా శుభ్రపరచుకోవాలో తెలియజేసే కార్యక్రమం ఒకటి ప్రభుత్వం తరఫున Hand wash పేరుతో నిర్వహించబడుతుంది.

## ఆ) తరగతి కృత్యం - జట్టుపని

1) పిల్లలూ! ప్రతి ఒక్కరూ అందరి చేతులను పరిశీలించండి. మురికిగా ఉన్న చేతులతో ఎంతమంది ఉన్నారు? శుభ్రంగా ఉన్న చేతులతో ఎంతమంది ఉన్నారు? పరిశీలించి నమోదుచేయండి.

| మురికి చేతులు వారు | శుభ్రంగా ఉన్న చేతులు వారు |
|---|---|
| | |

2) పిల్లలూ! గోళ్ళను పరిశీలించి ఎవరెవరిగోళ్ళు కత్తిరించుకున్నారు? ఎంతమంది కత్తిరించుకోలేదు. నమోదుచేయండి.

| గోళ్ళు కత్తిరించుకున్నావారు | గోళ్ళు కత్తిరించుకోనివారు |
|---|---|
| | |

3) పిల్లలను రెండు జట్లుగా చేసి గోళ్ళు కత్తిరించుకోవడంవల్ల లాభాలు, పెంచడంవల్ల వచ్చే నష్టాలు చెప్పించాలి. రాయించాలి.

| గోళ్ళు కత్తిరించడంవల్ల లాభాలు | గోళ్ళు పెంచడంవల్ల నష్టాలు |
|---|---|
| | |

4) పిల్లలూ! గోళ్ళు ఎలా తీసుకోవాలో ఒకరి తర్వాత ఒకరు వచ్చి అందరి ముందు ప్రదర్శించండి.

5) చేతులను ఎలా శుభ్రం చేసుకోవాలో ప్రదర్శించండి.

## ఇ) ఆలోచించడం - అనుభవాలు చెప్పడం

1) చేతులను శుభ్రంగా సబ్బుతో రుద్ది, వేళ్ళ మధ్యన కూడా రుద్ది కడగండి.
2) గోళ్ళలో మట్టి చేరకుండా గోళ్ళను కత్తిరించుకోండి. అలాగే కాలి గోళ్ళను కూడా పొట్టిగా కత్తిరించుకోవాలి.

వారం రోజుల తరువాత చేతులు శుభ్రంగా కడుక్కోవడం, గోళ్ళను కత్తిరించుకొని మురికి చేరకుండా చేయడంవల్ల మీకు కలిగిన అనుభూతులను చెప్పండి.

### ఇలా చేయండి!

ఆరోగ్యానికి సమయపాలన, క్రమశిక్షణ అత్యవసరం.

పది పనులున్నా సమయానికి మలమూత్రాలను విసర్జించాలి.

నూరు పనులున్నా సమయానికి వ్యాయామం, స్నానం చేయాలి.

వేయి పనులున్నా సమయానికి భోజనం చేయాలి.

లక్షపనులున్నా సమయానికి ప్రార్థించాలి.

కోటి పనులున్నా సమయానికి నిద్రపోవాలి.

ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి సుఖంగా ఉండవచ్చు, ధనవంతుడూ కావచ్చు కానీ ధనవంతుడు మాత్రం ఆరోగ్యంగా సుఖంగా ఉంటాడని అనుకోలేము.

### స్వచ్ఛత (శుభ్రత)

స్వచ్ఛత లేక శుభ్రత మనిషికి అత్యవసరమైనది స్వచ్ఛత అనేది అన్నింటిలోనూ ఉండాలి. మన శరీరం, మనం ధరించే వస్త్రాలు, తినే ఆహారం, త్రాగేనీరు, పీల్చే గాలి అన్ని స్వచ్ఛంగా శుభ్రంగా ఉండాలి. మన ఇంటిని, పాఠశాలను, తరగతి గదిని, మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. సరియైన పద్ధతిలో స్నానం, దంత ధావనం (పండ్లు తోముకోవడం) చేయడం ద్వారా శరీరాన్ని శుభ్రంగా వ్యాధులకు దూరంగా ఉంచుకోవచ్చు. దంతక్షయం లేకుండా ఉంటే ఏ పదార్థమునైనా బాగా నమిలి తినవచ్చు. సక్రమంగా మాట్లాడగలుగుతాము. మనం తినే ఆహారం, నీరు శుభ్రంగా ఉంటే దాని ద్వారా శరీరానికి ఆరోగ్యం కలుగుతుంది. పాచిపోయిన ఆహారం, ఈగలు, దోమలు ముసిరిన పదార్థాలు తింటే ఆరోగ్యం దెబ్బతింటుంది. నీరు కూడా అంటే క్రిమికీటకాలు, నాచు పట్టిన నీరు, ఆరోగ్యాన్ని

పాడుచేస్తాయి. కలుషితమైన గాలిని పీల్చడంద్వారా ఊపిరితిత్తుల సంబంధమైన వ్యాధులు వస్తాయి. గాలిని స్వచ్ఛంగా ఉంచుకోడానికి చెట్లు ఎక్కువగా పెంచాలి. పాఠశాల, ఇల్లు, తరగతి గది, పరిసరాలు చెత్తాచెదారం లేకుండా శుభ్రంగా ఉంటే క్రిమికీటకాలు, విషపు జంతువులు రావు. పరిశుభ్రమైన ప్రదేశాలు చూడడానికెంతో బాగుంటాయి.

భోజనం చేసేముందు కాళ్ళు, చేతులు, నోరు శుభ్రంగా కడుక్కోవాలి. చేతిగోళ్ళు పెంచకూడదు. గోళ్ళు పెరిగితే వాటిలోకి మట్టి వెళ్ళి అవి మనం తీసుకొనే ఆహారం ద్వారా మన కడుపులో చేరుతుంది. దానివలన రకరకాలైన వ్యాధులు సంభవిస్తాయి.

మలమూత్ర విసర్జన ఎక్కడపడితే అక్కడ చెయ్యకూడదు. వాటి ద్వారా దుర్గంధం వ్యాపించి రోగాలు వస్తాయి. ఇలాంటి విషయాలను తెలుసుకొని పరిశుభ్రతకు ప్రాముఖ్యత నియ్యాలి.

మన పరిసరాలు స్వచ్ఛంగా ఉంటే మన మనస్సు కూడా స్వచ్ఛంగా ఉంటుంది. స్వచ్ఛమైన మనస్సు మంచి ఆలోచనలు చేస్తుంది. దానివలన మంచి వ్యక్తులుగా తయారుకాగలుగుతాము. కాబట్టి పరిశుభ్రత మనకు చాలా అవసరం.

**సూచన : మంచి ఆరోగ్యవంతుడైన మనిషి – వ్యాధిగ్రస్థులు – వారి ఆకృతులు సూచించే చిత్రపటమును తరగతిలో ఉంచవలెను.**

## విద్యార్థుల కృత్యములు

బట్టలు, శరీరం, పుస్తకాలు మొదలగు వాటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. తనచేతిరుమాలను స్వయంగా ఉతుక్కోవడం, మే జోళ్ళు స్వయంగా ఉతుక్కోవడం స్వయంగా పాలిష్ (మెరుగు) పెట్టుకోవడం కాలకృత్యములు తీర్చుకున్నాక చేతులు, కాళ్ళు సబ్బుతో శుభ్రపర్చుకోవడం చెయ్యాలి. ఆహారం తీసుకొనేముందు చేతులు కడుక్కోవాలి. తిన్న తరువాత ఎంగిలి పదార్థములను చెత్తబుట్టలో వెయ్యాలి. పండ్లు కడుక్కొని తినాలి.

**పరిశుభ్రమైన ప్రదేశాలు ఆరోగ్యానికి సూచికలు**

**పరిశుభ్రమైన ప్రదేశం - దేవుడు నివసించే దేవాలయం**

* * *

సూక్తి

మంచి ఆరోగ్యపు అలవాట్లు మన మేథాశక్తిని పెంచి మన వ్యక్తిత్వానికి గుర్తింపు నిస్తుంది.

# 8 శ్రవణ కుమారుడు

**I. ప్రధాన విలువ**

సంస్కృతి సంప్రదాయాల పట్ల గౌరవం

**II. ఉప విలువ**

మాతృదేవోభవ – పితృదేవోభవ

**III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు**

- తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవములు అని గుర్తించడం.
- తల్లిదండ్రులను గౌరవిస్తూ వారికి ఆసాంతం సేవచేయాలని పిల్లలు భావించగలగడం. తెలుసుకొని ఆచరించగలగడం.

**IV. ఉపోద్ఘాతం**

భారతీయ సంస్కృతీ సంప్రదాయాల్లో తల్లిదండ్రులకు ఎనలేని గౌరవం ఉంది. వృద్ధాప్యంతో ఉన్న తల్లిదండ్రుల్ని కావడిలో మోస్తూ సేవలందించిన శ్రవణకుమారిని కథ ఓ గొప్ప ప్రేరణ. మహాత్ముడు బాపూజీని కూడా ప్రభావితం చేసిందా కథ. జన్మనిచ్చిన తల్లి, అందుకు కారకుడైన తండ్రి ప్రతివ్యక్తికీ ముఖ్యులు కనుకనే మాతృదేవోభవ – పితృదేవోభవ అన్నారు. కనిపించే దేవతలు అయినందున వారికి అగ్రతాంబూలం. అందుకేనేమో, వారుకూడా తమ సంతానానికి అవ్యాజమైన ప్రేమను పంచుతూ, అనురాగం ఆప్యాయతల్ని రంగరించి పిల్లల్ని వృద్ధిలోకి తెస్తారు. అందుకోసం ఎంత వ్యయప్రయాసలకైనా వెనుకాడరు. వివిధ దశల్లో పిల్లల సౌఖ్యం, సౌభాగ్యంకోసం

త్యాగనిరతితో జీవనం సాగించే తల్లిదండ్రులు ఇక్కడున్నట్లు ప్రపంచంలో మరెక్కడా ఉండరని ఒక ప్రతీతి. ఆ ఔన్నత్యాన్ని గుర్తించే కావచ్చు, అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా భారత పర్యటనకు వచ్చినప్పుడు ఈ దేశాన్ని కీర్తించారు. ఈ విశ్వానికి భారత్ చేసిన గొప్ప మేలు, విలువలతో కూడిన జీవనవిధానాన్ని నేర్పడమని నిర్ద్వంద్వంగా పేర్కొన్నారు.

పిల్లలూ! మన భారతీయ జీవన విధానంలో తల్లిదండ్రులను ప్రత్యక్ష దేవతలుగా గుర్తించి వారికి సేవచేసిన మహనీయుల పేర్లు కొన్ని చెప్పండి.

బాగా చెప్పారు. ఆ కోవకు చెందిన మహనీయ వ్యక్తులలో శ్రవణ కుమారుడు ఒకరు. మరిప్పుడు ఆ శ్రవణకుమారుని కథను మనందరం విందాం.

## V. కథ

శ్రవణ కుమారుడు తన తల్లిదండ్రులపై అమితమైన భక్తిప్రేమలు కలిగినవాడు. అతని తల్లిదండ్రులు ఇద్దరూ గుడ్డివారు (అంధులు), శ్రవణ కుమారుడు వారికి ఎంతో ఓర్పుతో, శ్రద్ధతో సేవలుచేసేవాడు. వారు కోరినవన్నీ తెచ్చిఇచ్చి వారిని ఎల్లప్పుడూ కంటికి రెప్పలా చూసుకునేవాడు. ఒకసారి తల్లిదండ్రులకు తీర్థయాత్రలు చేయాలని కోరిక కలిగింది. శ్రవణకుమారుడు ఒక కావడి తయారుచేసి చెరి ఒకవైపు వారిని కూర్చోబెట్టి కావడిని తన భుజాలపైకి ఎత్తుకొని యాత్రలకు బయలుదేరాడు. అడవులలో దొరికే కందమూల ఫలాలు సేకరించి తెచ్చి తల్లిదండ్రులకు పెట్టి తానూ తినేవాడు. ఈ విధంగా వారు యాత్రలు చేసుకుంటూ, అయోధ్యానగరానికి సమీపంలోగల అడవులకు చేరారు.

ఒకరోజు రాత్రి సమయంలో అతని తల్లిదండ్రులకు దాహం వేసింది. శ్రవణుడు వారి దాహం తీర్చడానికి నీటి కోసం సరయూనదికి నీటి తుంబను తీసుకునివెళ్ళాడు. అదే సమయంలో అయోధ్యకు రాజైన దశరథమహారాజు ఆ రాత్రి సమయాన ఒంటరిగా వేటకై బయలుదేరాడు. ఆ రోజుల్లో అయోధ్యానగర పరిసరాల్లో అడవి ఏనుగులు తిరుగుతున్నాయని ఒక వార్త వినవచ్చింది. శ్రవణకుమారుడు నీటితుంబను నీటిలో ముంచి నీరు పట్టుకుంటున్నప్పుడు బుడబుడమనే శబ్దం వచ్చింది. ఆ శబ్దంవిని అడవి ఏనుగు ఏదో నదిలో నీరు తాగుతున్నదని అనుకొని దశరథుడు ఆ దిశగా శబ్దభేధిబాణం వదిలాడు. దశరథుడు వదలిన బాణంపోయి నీరు పట్టుకుంటున్న శ్రవణ కుమారుడి ఛాతీలో గుచ్చుకుంది. అతడు ఎంతో బాధతో కేకవేసి మూలుగుతూ కిందపడ్డాడు.

మహారాజు ఆ కేక వినవచ్చిన దిశగా పరుగెత్తి వచ్చి చూడగా ఒక బాలుడు నేలపైపడి ఉండటం చూశాడు. శరీరం అంతా దుమ్ము రక్తప్రవాహంతో తడిసిపోయింది. మహారాజును చూసి "రాజా!" నేను మీ పట్ల ఏదైనా తప్పుచేశానా? నన్నెందుకు బాణంతో కొట్టారు? నా తల్లిదండ్రులు అంధులు. వారికోసం నీళ్ళు తీసుకెళ్ళడానికి ఇక్కడికివచ్చాను. నాకోసం నా తల్లిదండ్రులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. నేను ఇక్కడ ఇలా పడివున్నానని వారికెలా తెలుస్తుంది? తెలిసినా వారు గుడ్డివారు కావడంచేత వారు నడచిరాలేరు. నేను చనిపోతున్నానని నాకు బాధలేదు. కాని నా తల్లిదండ్రులు ఏమైపోతారో అని దుఃఖిస్తున్నాను. దయయుంచి మీరు పోయి వారికి జరిగిన

విషయం వివరించి వారికి నీరు త్రాగించి దాహం తీర్చమని" అన్నాడు. శ్రవణకుమారుడు తన తల్లిదండ్రుల వద్దకు చేరేమార్గం తెలియజేశాడు. బాణం గుచ్చుకొన్నందున నాకు ఎంతో బాధగా ఉంది. ఛాతీ నుండి బాణం తీసివేయమని ప్రార్థించాడు. బాణం తీసివేయగానే బాధతో విలవిలలాడుతూ శ్రవణుడు ప్రాణాలు వదిలాడు. దశరథుడు నీటి పాత్రతో శ్రవణుని తల్లిదండ్రుల వద్దకు వెళ్ళాడు. జరిగిన విషయం చెప్పాడు. వారు పుత్రుని మరణవార్త విని ఏడుస్తూ "మమ్మల్ని మా కుమారుని మృతశరీరం వద్దకు తీసుకుపొమ్మ"ని పలికారు. మహారాజు ఇద్దరిని భుజలపై ఎత్తుకొని అక్కడికి చేరాడు.

అదే సమయంలో శ్రవణకుమారుడు తన తల్లిదండ్రులకు చేసిన సేవాఫలితంగా స్వర్గంచేరుకున్నాడు. సరయూనదీ తీరాన చితిపేర్చి శ్రవణుని అంత్యక్రియలు జరిపారు. చివరి ఘడియలలో వారు దుఃఖం భరించలేక "రాజా! పుత్రవియోగంతో మేమెలా చనిపోయామో నీవు కూడా అదేవిధంగా పుత్రవియోగంతో విలపిస్తూ మరణిస్తావు" అని మహారాజును శపించారు. అదే చితిలో వారు కూడా ప్రాణాలు వదిలారు.

శ్రవణుని తల్లిదండ్రులకు కూడా కుమారుని యొక్క పుణ్యప్రభావం వలన స్వర్గానికి చేరుకున్నారు. ఈవిధంగా శ్రవణుడు తన తల్లిదండ్రులకు సేవచేసి అందరికీ ఆదర్శప్రాయుడైనాడు.

**సన్నివేశం - 1**

రంగాపురం గ్రామంలో ధర్మయ్యకు నలుగురు కొడుకులున్నారు. ఆయన కష్టపడి నలుగురిని పెంచి విద్యాబుద్ధులు నేర్పించి పెద్ద పెద్ద ఉద్యోగాలలో స్థిరపడేలా సహకారం అందించాడు. వారందరికీ పెళ్ళిళ్ళు జరిపించారు. ఆ నలుగురు వివాహానంతరం ఉద్యోగాలు, వ్యాపారాలకోసం తల్లిదండ్రులను వదలి ఇతరదేశాలకు వెళ్ళి స్థిరపడ్డారు. ముసలి వాళ్ళైన తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలలోకి చేర్పించి నెలానెలా కొంత డబ్బు వారికి పంపిస్తున్నారు. పిల్లలకు దూరమైన తల్లిదండ్రులు తమ బాధలను బైటకు చెప్పుకోలేక పిల్లలపై ప్రేమను వదులుకోలేక తమ పిల్లల చర్యలను సమర్థిస్తూ బిడ్డలపై గల మమకారాన్ని చాటుకుంటున్నారు.

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) తల్లిదండ్రులను దైవంగా ఎందుకు భావించాలో చెప్పండి.
2) తల్లిదండ్రులను గౌరవించడం అంటే ఏమి చేయాలి?
3) ప్రస్తుత సమాజంలో తల్లిదండ్రులకు ఎలాంటి గౌరవం లభిస్తున్నది? శ్రవణ కుమారుని లాంటి వాళ్ళు ఉన్నారా?
4) మీరు విన్న సంఘటనలో తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపారుకదా! అలా పంపడం న్యాయమేనా? కాదా? ఎందుకు?

### తెలుసుకోండి

మనిషి పుట్టకముందే తల్లి కడుపులో మొదటి శ్వాస పీల్చుకుంటాడు. తల్లి రక్తంతోనే పెరుగుతాడు. తల్లి లేకపోతే మనిషి పుట్టకేలేదు. మాతృమూర్తి తాను తినకుండా తన పిల్లలకు పెడుతుంది. వారి బాగోగుల కోసం అన్ని సమయాలలో పని చేస్తుంది. ఎక్కువ బాధ్యత వహిస్తుంది.

తల్లి మనిషికి మొదటిదైవం. క్షమాగుణానికి, ఓరిమికి మారుపేరు తల్లి. తనదేహంలో నవమాసాలు మోసి, మన శరీరంలోని ప్రతి అణువునూ రూపుదిద్దుతుంది తల్లి. ఆమె తన ప్రాణాన్ని పణంగాపెట్టి, తన శరీరాన్ని పంచి మనలను తయారుచేస్తుంది.

దైవం తెలియని జీవులు ఉండవచ్చేమో కాని అమ్మనెరుగని ప్రాణి ఉండదు. మనుష్యుల లోనేకాదు ఏ ప్రాణిని చూసినా ప్రాణం పోసి జీవాన్నిచ్చిన తల్లుల కుండే ప్రేమకు ఆకాశమే హద్దు అనిపిస్తుంది. ప్రపంచంలో చేసే ఉపకారాలన్నింటికంటే 'జన్మను ఇవ్వడం' అనే ఉపకారం మరిదేనికీ సరిరాదు. తల్లిచేసిన ఉపకారానికి ప్రత్యుపకారమే లేదు. ఏమి చేసినా అది తీరేదికాదు. అందుకే వేదం కూడా 'మాతృదేవోభవ' అంటూ, తండ్రిని పితృదేవోభవ అంటూ దైవంకంటే అగ్రపూజ మాతృమూర్తికి ఆ తర్వాత తండ్రికి నిర్ణయించింది. తల్లిని మించిన దైవమే లేదు.

తండ్రి మన జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దడానికి ఎల్లప్పుడూ శ్రమిస్తూ ఉన్నత శిఖరాలలో మనల్ని ఉంచడానికి ప్రయత్నిస్తాడు. చిన్ననాటి నుండి మన చిటికెన వ్రేలు పట్టుకొని లోకంలో ఎలా బ్రతకాలో నేర్పిస్తూ మనం వేసే తప్పటడుగులను సరిదిద్దుతూ సన్మార్గంలో నడిపే దైవమే తండ్రి. కాబట్టి పిల్లలూ! వారిని వృద్ధాశ్రమాలకు పంపాలనే ఆలోచనలను వీడండి. వారి సేవలో తరించండి.

కష్ట బెట్ట బోకు కన్నతల్లి మనసు
నష్ట పెట్ట బోకు నాన్న పనులు
తల్లిదండ్రులన్న దైవ సన్నిభులురా
లలిత సుగుణజాల తెలుగుబాల!

ఓ తెలుగుబాలా! తల్లిదండ్రులను ప్రత్యక్షదైవాలుగా భావించి తల్లి మనసు కష్టబెట్టకుండా, నాన్న పనులకు నష్టంచేయకుండా ఉన్నతంగా జీవించండి.

## ఆ) తరగతి కృత్యం - జట్టుపని

1) అమ్మ, నాన్నలు అంటే మీకిష్టం కదా! ఎందుకో చెప్పండి.

2) మీ అమ్మ, నాన్నలకు మీ ఇంట్లో ఏ పనులలో సహకరిస్తారో చెప్పండి. మీరు ఎలా సేవలు చేస్తారో రాయండి.

## ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

- తల్లిదండ్రుల మాట వింటూ వారికి అన్ని పనులలో వారికి సహకరించండి. వారం తర్వాత వారు మీతో ప్రవర్తించిన తీరును, మీకు కలిగిన అనుభూతులను చెప్పండి.

**సూక్తి**

**భగవంతుడు అన్ని చోట్ల ఉండలేక అమ్మ నాన్నల రూపంలో మనల్ని కాపాడుతుంటాడు.**

# ౯ పెరటితోట పెంచుదాం

## I. ప్రధాన విలువ

పర్యావరణ పరిరక్షణకు తోడ్పడడం

## II. ఉప విలువ

- పెరటితోట పెంపకంపై ఆసక్తి కల్గిఉండడం. ప్రతి విద్యార్థి ఒకమొక్కను పెంచడం.

## III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు

- పెరటి తోట పెంపకంపై ఆసక్తి పెంపొందింపజేయడం.
- బడి లేదా ఇంటి పరిసరాలలో ప్రతి విద్యార్థి మొక్కలను పెంచడం, సంరక్షించడం చేయగలగడం.

## IV. ఉపోద్ఘాతం

ఇంటి పెరటిలోనో బాల్కనీలోనో, లేక బడి ఆవరణలోనో కూరగాయల్ని పండించుకుంటే? అంతకంటే ఇంకేం కావాలి? ధరలు మండుతున్న ఈ రోజుల్లో చౌకగా పండించుకునే కొత్త మార్గం ఇది. ఇంట్లోనే/బళ్ళోనే తాజా. తాజా ఆకుకూరలు, కూరగాయలను తినే భాగ్యం కలిగిస్తోంది "రెడీటుగ్రో". రెడీటుగ్రో అంటే ఏమిటి? పెరటిలో తోటలను పెంచుకోవడం ఎలా? అవే విషయాల గురించి ఇప్పుడు చర్చిద్దాం.

- పిల్లలూ! పెరటితోట పెంపకం అంటే మీరేమనుకుంటున్నారు?
- మీరెప్పుడైనా ఇంట్లోగానీ లేక మరెక్కడైనా గానీ కూరగాయల మొక్కలు పెంచారా? ఏ ఏ మొక్కలను పెంచారు?

## V. సంఘటనలు

*సన్నివేశం - 1*

మీలో ఎంతమంది మొక్కలను పెంచాలనుకుంటున్నారు? ఎందుకు?

మరి ఈ పెరటి మొక్కలను ఎలా పెంచాలో ఇప్పుడు చూద్దాం. "రెడీటుగ్రో" అంటే పెరగడానికి సిద్ధంగా ఉన్నవి అని అర్థం. దీనిలో కూరగాయలు, ఆకుకూరలు పెంచుకొనేందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను సిద్ధంచేసి ఉంటారు. ఎంచక్కా ఓప్యాక్‌ను కొనుక్కుని నీళ్ళు పోయడమే మనం చేయాల్సిన పని. నెల నుండి నెలన్నరలోపు ప్యాక్‌లోని మొక్కలు పెరిగి కూరగాయలు కాయడం మొదలుపెడతాయి. కిచెన్‌గార్డెన్ పరికల్పనతో రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్టులో అతి తక్కువ స్థలంలో అతి తక్కువ ఖర్చుతో తాజాకూరగాయలను పండిచ్చుకోవచ్చు. ప్రత్యేకంగా తయారుచేసిన పాలిథీన్ సంచుల్లో సేంద్రీయ ఎరువును, సారవంతమైన మట్టిని, విత్తనాలను నింపి సిద్ధంగా ఉంచుతారు. ఈ బ్యాగును కొనుక్కున్నవారు సూచించిన ప్రకారం ఐదు నుంచి ఆరు లీటర్ల నీరుపోస్తేచాలు. నాలుగు నుంచి ఆరు వారాల్లో మొక్కలు పెరిగి కూరగాయలు ఇస్తాయి. ఆకుకూరలకైతే ఇంకా తక్కువ సమయం సరిపోతుంది. నీరు పోసిన తక్షణం ఈ బ్యాగు ఎత్తు నుంచి మొక్క పెరిగేందుకు వీలుగా విప్పారుతుంది. తొలిదశలో బెండకాయలు, దొండకాయలు, బీన్స్, వంకాయలు, కీరదోస, కాప్సికమ్, టమాటా, బీరకాయలు, కొత్తమీర, పాలక్, పుదీనా, కరివేపాకు, మెంతాకు, మిరపకాయలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

పై తాజా కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో మంచిది. మొక్కలకు పూర్తిగా సేంద్రీయ ఎరువులనే వాడుతున్నందున చీడపీడల భయం లేదు. రసాయనాలు వాడకపోవడంవల్ల ఇంటి వాతావరణమూ కలుషితం అవ్వదు.

మొక్కల పెంపకంలో కాస్త వెలుతురు, గాలి సోకితే సరిపోతుంది. అపార్ట్‌మెంట్‌లలోని బాల్కనీలలో మొక్కలను పెంచవచ్చు. మట్టినేలతో అవసరమే ఉండదు.

మనం తింటున్న కూరగాయలు పరిశుభ్రమైన నేలలో పెంచుతున్నారన్న నమ్మకం లేదు. ఈ మధ్య విపరీతమైన రసాయన మందుల్ని పిచికారి చేస్తున్నారు. దీనివల్ల రకరకాల జబ్బు లొస్తున్నాయి. సేంద్రీయ సాగుతో ఆరోగ్యానికి తాజా కూరగాయల్ని కోసుకొని వండుకోవచ్చు. దీనివల్ల వృథా తగ్గిపోతుంది. ఇంట్లో పండించిన కూరగాయలతో ఇంట్లోనే వండుకుని తిన్నామన్న సంతృప్తి దొరుకుతుంది..

*సన్నివేశం - 2*

అశ్విన్ ఒక మామిడి మొక్కను తన ఇంటి ఆవరణలో నాటడానికి ఈ విధంగా చేశాడు.

- నేలతడిపాడు.
- గుంత తవ్వాడు. మొక్కను గుంతలో పెట్టాడు. మంచి మట్టి వేశాడు.

*- పాదుచేసి రోజూ నీరు పోశాడు.*

*- రక్షణకోసం కంచెవేశాడు.*

*- మామిడి మొక్క చిగురు వేసింది.*

*- కొన్ని నెలలకు పెరిగి పెద్దదైంది.*

*మీ తోటలో మొక్కలు చిగురు వేయడం, కాయలు కాయడం, పండ్లు అవడాన్ని పరిశీలించండి. మీరు ఏమి గమనించారో చెప్పండి.*

## VI. అ) ఆలోచించడం – ప్రతిస్పందించడం

1) పిల్లలూ! పెరటితోట అంటే మీకు ఏమర్థమయింది? చెప్పండి.

2) పెరటితోటను పెంచాలంటే ఏమేమి కావాలి?

3) పెరటితోటను పెంచుటవల్ల కలిగే ప్రయోజనాలు ఏవి?

4) నగరాల్లో అపార్టుమెంటులు వంటివి ఉన్నాయి గదా! అక్కడ మొక్కలు పెంచడం సాధ్యమా! అసాధ్యమా! ఎలా? చెప్పండి.

### తెలుసుకోండి

మన ఇల్లంతా ఆకుపచ్చగా కళకళలాడిపోతే ఎంత బావుంటుంది. పచ్చని మొక్కలను పొద్దున లేవగానే చూసే కళ్ళకు ఎంతో హాయిగా ఉంటుంది. రంగురంగుల పూలు తాజా వాసనలు వెదజల్లుతుంటే మనసుకు ఉల్లాసంగా ఉంటుంది. అలాగే మన పెరటినిండా తాజా కూరగాయలు అందుబాటులో ఉంటే వాటితో మనకు ఆరోగ్యం, ఆదాయం రెండూ లభిస్తాయి. ఇది సాకారం చేసుకోవాలంటే మనకు కావాల్సిందల్లా ఆసక్తి, కాస్త సమయం దాని కోసం వెచ్చించడం.

మొక్కలు పెంచాలంటే కాస్త స్థలం ఉండాలి. శ్రద్ధ ఉండాలి. ఈ కాలంలో స్థలం లేకపోయినా ఇళ్ళల్లోనే కుండీలు పెట్టి మొక్కలు పెంచుతున్నారు. మనసు పెట్టాలేగాని మొక్కలు ఎక్కడైనా పెంచవచ్చు. మొక్కల పెంపకం మన కొక వ్యాపకంగా మారాలి. ఎక్కడ ఖాళీ ప్రదేశం కనిపించినా మొక్కలు నాటాలనే కోరిక కలగాలి. మనకోసమే కాదు పరులకోసం మనం చేసే పని ఉపయోగపడాలి. అందుకే వనమహోత్సవం పేరుతో మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నారు.

మన బడిలో మొక్కలు నాటితే బడి కళకళలాడుతుంది. మన ఊరిలో దారిపొడువునా మొక్కలు నాటితే అది ఊరందరికీ నీడనిస్తుంది. ఇలా మొక్కలు నాటడం మనం బాధ్యతగా చేపట్టాలి.

## ఆ) తరగతి కృత్యం - జట్టుపని

1) పిల్లలూ! పెరటి తోటలోని పూలు, పండ్లు, కూరగాయలు బయట పెరిగిన పూలు, పండ్లు, కూరగాయలు మధ్య ఉన్న ఆరోగ్యపరమైన తేడాలను చెప్పండి. రాయండి.

| పెరటి తోట కూరగాయలు | బయట మార్కెట్టు కూరగాయలు |
|---|---|
| | |

2) పెరటి తోటలో పెంచదగినవి, పెంచలేనివి ఏమిటో చెప్పండి. రాయండి.

## ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

1) పెరటిలో మొక్కలు నాటి పెంచండి. అలా పెంచడంవల్ల నీకు కలిగిన అనుభూతిని చెప్పండి.

2) మీ ఇంటి ఖాళీ స్థలంలో లేక కుండీలలో ఏదైనా కూరగాయల చెట్లను పెంచండి. వాటిని తిని ఆ అనుభూతిని అందరికి చెప్పండి.

## ప్రకృతి ప్రేమ - ఆరాధన

మనమందరము ప్రకృతి ఒడిలో బ్రతుకుతున్నాము. ప్రకృతి అంటే చెట్లు, పర్వతములు, నదులు, సముద్రాలు, పక్షులు, జంతువులు, క్రిమికీటకాలు మొదలైనవన్నీ కూడా. ఈ ప్రకృతిలో మనమూ ఒక భాగమే. పైన చెప్పినవన్నీ మన జీవనానికి ఎంతో సహాయపడుతున్నాయి. ప్రకృతికి పక్షులు అందాన్నిస్తాయి. పక్షులకు ఆధారం చెట్లు. పక్షులకే కాదు అన్ని జీవులకు చెట్లు ఆధారమే. వాటివలన మనకు ప్రాణవాయువు లభిస్తుంది. ఫలాలు, కలప, పూలు, మందులు మొదలైనవన్నీ చెట్లు అందిస్తాయి. అలాగే నదులు, పర్వతాలు అన్నీ కూడా మనకు ఎంతో మేలు చేస్తాయి.

ప్రకృతిని రక్షించమంటే, మనం సుఖంగా జీవించగలం. ప్రకృతి మనకు ఎంతో ప్రశాంతతను, ఆహ్లాదాన్ని ఇస్తుంది. ప్రకృతితో మనకు విడదీయరాని సంబంధం ఉంది. అందుకే ప్రాచీనులు వనమహోత్సవాలు, విహారాలు ఏర్పాటుచేశారు. ఆ సందర్భంగా మనందరం వనాలలోకి వెళ్ళి అక్కడ గడిపి, వాటి ప్రాముఖ్యాన్ని గుర్తించవచ్చును. నేడు చెట్లు తగ్గిపోతున్నాయి. మనమంతా చెట్లను నాటాలి. **"వృక్షోరక్షతి రక్షితః"** - అని పెద్దలు చెప్పారు. వానలు కురవాలన్నా, ప్రకృతి రక్షించబడాలన్నా చెట్లు చాలా అవసరం. మన ఇంటి చుట్టూ మొక్కలు పెంచితే మంచిగాలి, చల్లదనం, ఇంటికి అందం చేకూరుతాయి.

ప్రకృతి వలన మనకు ఎన్నో లాభాలు ఉన్నాయి. కాబట్టి మనం ప్రకృతిని ఆరాధించాలి. కాపాడాలి. ప్రకృతిపై ప్రేమను పెంచుకోవాలి.

**సూక్తి**

**మొక్కలే కదా అని నిర్లక్ష్యం చూపకు.
అవే మనం బతకడానికి ఆధారమౌతున్నాయని
మరువకు**

4వ తరగతి

# 10 నిర్భయంగా మాట్లాడుదాం

## I. ప్రధాన విలువ

శాస్త్రీయ దృక్పథం

## II. ఉప విలువ

నిర్భయంగా వాస్తవాలను చెప్పడం.

## III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు

- వాస్తవాలను నిర్భయంగా చెప్పడమనే లక్షణాన్ని అలవర్చుకుంటారు.

## IV. ఉపోద్ఘాతం

మనలో చాలా మంది వాస్తవాలు తెలిసినా చెప్పడానికి భయపడుతుంటారు. నిర్భయంగా మాట్లాడడం అనేది మనిషికున్న గొప్ప లక్షణం. ఇలాంటి మనుషులుండడం వల్లనే సమాజానికి ఉపయోగం. వాస్తవాలను నిర్భయంగా చెప్పకపోవడం దాచి ఉంచడంవల్ల నష్టాలు కలుగుతాయి. నిర్భయంగా వాస్తవాలను చెప్పే గుణాన్ని పెంపొందింపజేయడమే ఈ పాఠ్యాంశ ముఖ్య ఉద్దేశం.

## V. సంఘటనలు

*సంఘటన-1*

*మనం భూమిని చూస్తుంటే దాన్ని ఎంత దూరం చూసినా చదునుగా బల్లపరుపుగా కనిపిస్తుంది. ఇదే భావన పూర్వకాలంలో మత పెద్దలు కూడా నమ్మేవారు. అటువంటి రోజుల్లోనే గెలీలియో అనే శాస్త్రవేత్త తన పరిశీలనల ద్వారా భూమి చదునుగా ఉండదని గుండ్రంగా ఉంటుందని చెప్పాడు. చెప్పడమేకాదు తన పరిశీలనలు ఎందుకు గుండ్రంగా ఉందో కూడా తను పరిశీలించిన అంశాలను ప్రజలకు చెప్పాడు. ప్రజలంతా గెలీలియోను వెర్రివాడని నవ్వింది. ప్రజలేకాదు ఈ విషయం చర్చి మత పెద్దలకూ తెలిసింది. వెంటనే వాళ్ళు గెలీలియోను బంధించి తీసుకురమ్మన్నారు. గెలీలియోను బంధించి మత పెద్దల ముందు నిలబెట్టారు. నువ్వు నీ మాటలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నావు భూమి బల్లపరుపుగా ఉండడం అనేది అందరూ నమ్ముతున్నాం. నువ్వేమో దాన్ని గుండ్రంగా ఉందని ప్రచారం చేస్తున్నావు. ఇది తప్పు అని నువ్వు ఒప్పుకో లేదా నిన్ను శిక్షించాల్సి ఉంటుంది. శిక్ష ఏమిటో తెలుసా ఈ విషం తాగడం అని మత పెద్దలు హెచ్చరించారు. అప్పుడు గెలీలియో "మీరు నన్ను శిక్షించినా సరే నేను నమ్మిన నిజాన్ని చెప్పకుండా ఉండను." వాస్తవాలు ఎప్పటికైనా మీకు తెలుస్తాయి. మీరు నమ్మకపోతే మీ ఇష్టం. మీరు నమ్మనంత మాత్రాన నిజం నిజం కాకపోదు. మీ భయానికి నేను వాస్తవం చెప్పకుండా ఉండలేను" అన్నాడు.*

*సంఘటన-2*

*గెలీలియోలాగానే కోపర్నికస్ అనే శాస్త్రవేత్త తన పరిశోధనల ద్వారా భూమి సూర్యుని చుట్టు తిరుగుతున్నదని చెప్పాడు. ప్రజలెవ్వరూ అతని మాటలు నమ్మలేదు సరికదా పిచ్చోడని హేళన చేశారు. మనం రోజూ చూస్తూనే ఉన్నాం సూర్యుడు తూరుపు దిక్కున ఉదయించి పడమర దిక్కున అస్తమిస్తున్నాడు. భూమి ఇక్కడే కదలకుండా ఉంటుంది. సూర్యుడే కదులుతున్నాడు. ఇది ఇంత స్పష్టంగా తెలుస్తుంటే సూర్యుని చుట్టూ భూమి తిరగడమేమిటని మత పెద్దలు కోపర్నికస్‌ను ప్రశ్నించారు. కోపర్నికస్ వివరించే ప్రయత్నంచేసినా వాళ్ళు వినిపించుకోలేదు. శిక్షిస్తామంటూ జైల్లో పడేశారు. అయినా సరే కోపర్నికస్ నిర్భయంగా తను నమ్మిన సిద్ధాంతాన్ని చెప్పాడు. అదే నేడు నిజమైంది.*

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) పై రెండు సంఘటనలు విన్నారు కదా! మీ అభిప్రాయం చెప్పండి.

2) మనకు కష్టాలుగాని నష్టాలుగాని వచ్చినప్పుడు వాస్తవాలను దాచిపెట్టడం సరైందని భావిస్తున్నారా?

3) మీరు గమనించిన వాస్తవాలను ఎవరితో చెప్పారు? దాని వలన ఏం జరిగింది?

4) మీరు వాస్తవాలను దాచిపెట్టిన సందర్భాలు ఉన్నాయా? ఎప్పుడెప్పుడు? ఎందువల్ల?

5) గెలీలియో, కోపర్నికస్‌లు నమ్మిన సిద్ధాంతాలు నేడు వాస్తవాలని ఋజువయ్యాయి కదా! వాళ్ళు అలా చెప్పకపోతే ఏం జరిగి ఉండేది?

## తెలుసుకోండి

నిర్భయంగా మాట్లాడడం మనిషికి ఉండాల్సిన ఒక ముఖ్య లక్షణం. వాస్తవాలను గురించి మాట్లాడాలంటే ధైర్యం కావాలి. అలాగే వాస్తవాలను కప్పిపుచ్చడం వల్ల అనవసర అనర్థాలకు దారితీసే ప్రమాదం ఏర్పడుతుంది. ఒక రోగి తన రోగలక్షణాలను రోగం రావడానికి కారణాలను డాక్టరుకు భయపడి దాచాడనుకోండి నష్టం ఎవరికి? డాక్టరు సరిగా నిర్ధారణ చేయలేడు. ఒకదాని బదులు ఇంకొక మందు రాయచ్చు. ఇలా ఏదైనా జరగవచ్చు. అక్కడ వాస్తవాలను చెప్పిల్సిన అవసరం ఉంటుంది. అలాగే మన కళ్ళముందు జరిగిన ఒక ఆక్సిడెంట్ ఒక మినిష్టర్ కొడుకో ఇంకొక అధికారో చేశాడనుకుందాం. వాళ్ళ అధికారానికి భయపడి వాస్తవాలను దాచితే ఆక్సిడెంట్‌లో నష్టపోయినవాడికి న్యాయం జరగదు. సమాజంలో వాస్తవాలను మాట్లాడకపోవడం ఎంత తప్పో, వాస్తవాలను కప్పిపుచ్చడం అంతే తప్పు.

నిర్భయంగా మాట్లాడే గొప్ప లక్షణాన్ని ప్రతి ఒక్కరు కల్గి ఉండాలి. అది చిన్నతనం నుండే అలవరచుకోవాలి. సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా తయారవుతాయి. ఇలాంటి వ్యక్తులు నిశితంగా పరిశీలిస్తారు. వాస్తవాలను చెప్పడంలో ఇబ్బందులు ఎదురైతాయని తెలిసినా వెనకడుగు వేయరు. నిజాన్ని ధైర్యంగా చెప్పడం మూలంగా నిజాయితీగల వ్యక్తులుగా తయారవుతారు. శాస్త్రీయ దృక్పథం కల్గిన వ్యక్తులలో వాస్తవాలు ధైర్యంగా చెప్పడం అనేది ఒక ముఖ్య లక్షణం. ఈ లక్షణం కల్గిన వ్యక్తులవల్ల సమాజానికి ఎంత మేలు జరుగుతుంది.

### ఆ) తరగతి కృత్యం – జట్టుపని

మీరెప్పుడైనా నిర్భయంగా మాట్లాడిన సందర్భాలు ఉన్నాయా? ఆ సందర్భాలను రాయండి. అలాగే భయపడి దాచిపెట్టిన సందర్భాలను రాయండి.

### ఇ) ఆచరించడం – అనుభవాలు చెప్పడం

పిల్లలూ! వారం రోజుల మీరు ఇంటా, బయట బడిలో ఉన్నదున్నట్టు వాస్తవాలను మాట్లాడండి. మీ అనుభవాలను చెప్పడం.

### సూక్తి

ఆలోచించడం సమస్యా పరిష్కారానికి మూలం.
మన భయమే మన ఓటమి.
మన ధైర్యమే మన గెలుపు.
గుడ్డిగా దేనిని నమ్మకూడదు. ఆలోచనతో స్వయంగా నిర్ధారించు కోవాలి. స్వయంగా నిర్ధారించుకోవాలి.

# 11 అందరూ సమానమే

## I. ప్రధాన విలువ

న్యాయం

## II. ఉప విలువ

సమాన అవకాశాలు పొందడం

## III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు

- అవకాశాలు అందరికీ సమానంగా ఇవ్వాలని తెలుసుకుంటారు.

## IV. ఉపోద్ఘాతం

మనుషులంతా ఒక్కటే. ఇందులో ఎక్కువ తక్కువ అనే వివక్ష ఉండకూడదు. అన్నింటిలోను అందరినీ సమాన దృష్టితో చూడడం, అందరికీ సమాన అవకాశాలు ఇవ్వడం, జరగాలి. సమానత్వం అనేది ఒక విలువ. ఈ సమానత్వ భావన కలిగి ఉన్నప్పుడే అందరికీ సమాన అవకాశాలు ఇవ్వడం, పొందడం జరుగుతుంది. మన నిత్యజీవితంలో సమాన అవకాశాలు పొందలేక పోవడం వివక్షకు గురవ్వడం అనేది పలు సందర్భాలలో చూస్తుంటాము. కింది సంఘటనలను చూడండి. మనం ఏం చేయాలో చెప్పండి.

## V. సంఘటనలు

*సంఘటన - 1*

రజని వాళ్ళ ఇంట్లో ఆమెతోపాటు వాళ్ళ అన్నయ్య, అమ్మ, నాన్న, తాతయ్య ఉంటారు. రజని వాళ్ళ అన్నయ్య కన్నా బాగా చదువుతుంది. కానీ రజని వాళ్ళ తాతయ్య రజని ఇప్పటిదాకా చదివింది చాలు. ఆడపిల్ల చదివి ఎవరిని ఉద్ధరించాలి? పెళ్ళి చేసుకొని వెళ్ళిపోతుంది. ఐదవతరగతి వరకు చదివిందిగా చాల్లే అన్నాడు. పాపం రజనికేమో మంచి చదువు చదివి టీచర్ అవ్వాలని కోరిక. అలా కాదు తాతయ్యా అన్నయ్యలాగే నేనూ పై చదువులు చదువుతా అంది.

*సంఘటన - 2*

రాజానగరం గ్రామంలో బడిలో పిల్లలతో బాటు బడిబయట పిల్లలు కూడా ఉన్నారు. భరత్ ఒకరోజు బడికిపోతున్నాడు. దారిలో ఒక టీకొట్టులో తన వయసు పిల్లాడే టీ పంచుతూ కనిపించాడు. భరత్ వాళ్ళ నాన్నని అడిగాడు. "నాన్నా! ఆ అబ్బాయి కూడా నా వయసువాడే కదా! మరి బడిలో చదువుకోకుండా పనిచేస్తున్నాడేంటి? పాపం కదా! నాన్నా! అందరితో కలిసి చదువుకోకుండా అలా పనిచేసుకోవడం బాధగా ఉంది" అని అన్నాడు.

*సంఘటన - 3*

ఆ రోజు బడిలో పాటల పోటీలు పెడుతున్నారు. సంధ్య తరగతిలో ఎవరెవరు పాడుతారు పేర్లు ఇమ్మని అడిగింది. సాధారణంగా ఎప్పుడూ పాడేవాళ్ళు పేర్లు ఇచ్చారు. ఈ సారి నేను కూడా పాడుతాను అంటూ సునీత ముందుగా వచ్చింది. అరే! నీకేమి పాడ్డంవచ్చు. నువ్వు పేరు ఇవ్వడం ఏమిటి? అని అందరూ నవ్వారు. నేను కూడా పాటలు నేర్చుకున్నా పాడుతాను. మీరే చూడండి ఎలా పాడుతానో అంది సునీత ధీమాగా.

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) మొదటి సంఘటనలో కుటుంబంలో ఆడపిల్లలకు చదువెందుకు? అని తాతయ్య అన్నాడు కదా! ఇది సరైనదేనా? ఇంట్లో ఒకరిని చదివించి ఇంకొకరిని చదివించకపోవడం న్యాయమేనా?

2) కొంత మంది చదువుకోవడం, కొంత మంది చదువుకోకపోవడం న్యాయమేనా?

3) పిల్లలందరికీ అన్నింటిలో అవకాశాలు ఇవ్వాలి. మీరేమంటారు?

4) మీ తరగతిలో ఉన్న అందరి పిల్లలకూ అన్ని సౌకర్యాలు ఉన్నాయా? కారణాలేవి?

## తెలుసుకోండి

భూమి మీద పుట్టిన ప్రతి జీవికి సమానంగా ప్రకృతి అన్నీ అందిస్తోంది. సూర్యుడు అన్ని ప్రదేశాలకు కాంతిని అందిస్తాడు. సూర్యునికి ధనిక, పేద, చిన్న, పెద్ద, కులం, మతం అనే తేడాలేదు. వెలుగు పంచడంలో ప్రకృతిలోని అన్ని జీవరాశులు అంటే జంతువులు, మొక్కలు, మనుషులు అందరూ సమానమే. అలాగే గాలి, నీరు, వర్షం వంటివి. కాని మనుషులలోనే ఈ అసమానతలు నేను ఎక్కువ, నేను గొప్ప, అనే స్వార్థ పూరిత భావనల వల్ల సమానత్వ భావన కనుమరుగౌతోంది.

అంతే కాకుండా వివక్ష వాతావరణం ఆడపిల్లల్ని, మగపిల్లల్ని సమానంగా చూడకపోవడం ఎక్కువ కులం, తక్కువ కులం అని చూడడం, చదువుకున్న వాళ్ళను ఒకలాగా చదువుకోని వాళ్ళను వేరుగా చూడడం, హోదా ఎక్కువ ఉండే వారిని తక్కువ ఉండేవారిని వేరుగా గౌరవించడం. డబ్బున్నవాళ్ళు లేనివాళ్ళు అనే వివక్షతో చూడడం వంటివి నేడు ఎక్కువైపోయింది. ఇది ఇలాగే కొనసాగడం వల్ల సమాజంలో అశాంతి పెరిగి దౌర్జన్యం, అన్యాయం, అడుగడుగునా రాజ్యమేలి సమాజ శ్రేయస్సు దెబ్బతింటుంది.

అందుకోసం మనుషుల మధ్య, ఇతర జీవరాశులు జీవించడం పట్ల సమదృష్టి కలిగి ఉండడం అవసరం.

### ఆ) తరగతి కృత్యం - జట్టుపని

- ఆడపిల్లలు, మగపిల్లలు పట్ల వివక్షతతో చూసే సందర్భాలు మీకు తెలిసినవి ఏవి ఉన్నాయో చర్చించి రాయండి.
- మీ తరగతిలో అన్ని విషయాలలో సమానంగా అవకాశాలు ఎక్కడెక్కడ ఇస్తున్నారో ఎక్కడ ఇవ్వడంలేదో రాయండి.

### ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

- మీ ఇంట్లో, పక్క కుటుంబంలోని ఇళ్ళలో వాళ్ళ పిల్లలకు సమానంగా చూస్తున్నారా పరిశీలించండి. ఎక్కడ సమానంగా చూస్తున్నారో? ఎక్కడెక్కడ సమానంగా చూడడం లేదో రాయండి.

**సూక్తి**

**అందరికి అన్ని అవకాశాలు కల్పించినప్పుడే అందరూ ముందుకు వెళ్తారు.**
**అవకాశాలు అందరికీ సమానంగా వచ్చినప్పుడు అవి అందుకునే ముందుకు సాగే నేర్పే ఉండాలి.**

# 12 సాయంచేద్దాం

### I. ప్రధాన విలువ

శాంతి / కలిసి మెలిసి జీవించడం

### II. ఉప విలువ

ఇతరుల పట్ల దయ, కరుణ కలిగి ఉండడం.

### III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు

- ఇతరుల పట్ల దయ, కరుణ కలిగి ఉండడం వల్ల మనసుకు శాంతి, సంతృప్తి కలుగుతాయని తెలుసుకుంటారు.

### IV. ఉపోద్ఘాతం

మన చుట్టూ ఉన్న సమాజంలో ఎవరికో ఒకరికి ఏదో ఒక సందర్భంలో కష్టాలు, బాధలు వస్తూ ఉంటాయి. అవి చూసి మనకెందుకులే అని ఆలోచించకుండా దయతో, సానుభూతితో వారిని ఆదుకోవాలి. వారిలో మనోస్థైర్యాన్ని కలిగించాలి. అలాంటి దయాగుణంగల ఒక బాలుడు ఏమి చేశాడో తెలుసుకుందాం.

## V. సన్నివేశాలు

### సన్నివేశం - 1

ఒక బాలుడు బళ్ళో చదువుకోవడానికి రోజూ నడుచుకుంటూ వెళ్ళేవాడు. తాను వెళుతున్న దారిలో పక్కనే ఉన్న చెట్టు కింద ముడుచుకొని కూర్చున్న ముసలవ్వను చూశాడు. ఆమె లేవలేని స్థితిలో ఉంది. తనకు కావలసిన ఆహారం కోసం కూడా కదలలేని పరిస్థితి. బాలుడు రోజు వచ్చేటప్పుడు, వెళ్ళేటప్పుడు ఆ ముసలవ్వని గమనిస్తూనే వెళ్తున్నాడు. ఒక రోజు "పాపం ఆ ముసలవ్వ ఏం తింటుందో, తనకు ఆహారం ఎవరిస్తున్నారో" అనుకుంటూ ఆలోచిస్తూనే ఇంటికి వెళ్ళాడు. మరుసటి రోజు ఎలాగైనా ఆ ముసలవ్వని పలకరించాలని అనుకొని బడికి వెళ్ళేటప్పుడు ఆ ముసలవ్వ దగ్గరకు వెళ్ళి "అవ్వా బువ్వ తింటావా!" అని అడిగాడు బాలుడు. వృద్ధురాలు తలూపుతూ "తింటాను" అని చెప్పింది. వెంటనే బాలుడు తాను వెంట తెచ్చుకున్న టిఫిన్ బాక్స్‌లోని ఆహారాన్నంతా ఇచ్చివేశాడు. ఆ రోజంతా అతను ఆకలితో ఉండిపోయాడు. అప్పటి నుండి ఆ బాలుడు ప్రతిరోజూ ఇంటి నుండి వచ్చేటప్పుడు ముసలవ్వ కోసం కూడా ఆహారాన్ని తెచ్చియిచ్చేవాడు. ఆ అవ్వ బాలుడు తెచ్చిన ఆహారాన్ని ఎంతో ఇష్టంగా తింటూ బాలున్ని ఆశీర్వదించేది. అతను ఎంతో ఆనందించేవాడు.

ఒకనాడు రాత్రి భయంకరమైన తుఫాను వచ్చింది. భారీవర్షం కారణంగా బాలుడు బడికి వెళ్ళలేకపోయాడు. ఇంట్లోనే ఉండిపోయాడు. కానీ, మనసంతా అవ్వమీదనే ఉంది. ఆ రోజంతా అదే ఆలోచిస్తూ విచారంగా ఉన్నాడు. ఇంత పెద్ద వర్షంలో పాపం అవ్వ ఎలా ఉందోనని ఆమెకు ఆహారం ఎవరు పెడుతున్నారోనని బాధపడుతూనే ఉన్నాడు. వర్షం తగ్గింది. మూడు రోజుల తర్వాత బడికి వెళ్ళాడు. అవ్వని కలవాలనే ఆత్రుతతో వేగంగా నడిచాడు. తను రోజు అవ్వని కలిసే చోట చూశాడు ఎవ్వరూ కనబడలేదు. ఎంతో బాధతో అవ్వ ఉండే ప్రదేశం నుండి వెనుతిరిగాడు.

ఆ బాలుడు ఎవరోకాదు నేతాజీ సుభాష్ చంద్రబోస్.

### సన్నివేశం - 2

ఒక అమ్మాయి ఒకరోజు పాఠశాల నుండి ఇంటికి వస్తుండగా దారిలో ఒక దుర్ఘటన జరిగింది. అది చూసిన ఆమె మనసు ఎంతగానో తల్లడిల్లింది. రోడ్డుకు ఒక పక్కన పడుకుని ఉన్న ఒక చిన్న కుక్కపిల్ల కాలిపై నుంచి ఒక మోటారు కారు వేగంగా వెళ్ళిపోయింది. పాపం ఆ కుక్క పిల్ల కుయ్యో - కుయ్యో అంటూ అరుస్తూ రక్తసిక్తమైన కాలుతో కుంటుకుంటూ అటూ ఇటూ తిరుగుతుంది. అదే దారి వెంట నడుస్తున్న వారెవరూ దాన్ని పట్టించుకోకుండా ఎవరి దారిన వారు వెళ్ళిపోతున్నారు. అదే దారిలో వస్తున్న ఆ అమ్మాయి వెంటనే కుక్క పిల్ల దగ్గరికి వెళ్ళి దానిని ఎత్తుకొని, ఒళ్ళో పెట్టుకొని, తన చేతి రుమాలుతో గాయమైన కాలికి కట్టుకట్టి దగ్గర్లో ఉన్న పశువుల డాక్టరుకు చూపించి అక్కడి నుండి వెళ్ళింది.

ఆ అమ్మాయి ఎవరో కాదు మదర్ థెరిసా.

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) మొదటి సన్నివేశంలో ఆ బాలుడు ముసలవ్వకు ఎందుకు సహాయం చేయాలనుకున్నాడు?
2) చెట్టు కింద అవ్వ కనిపించకపోయే సరికి అతను ఎందుకు బాధపడ్డాడు?
3) రెండవ సన్నివేశంలో ఆ బాలిక కుక్క పిల్లకు సహాయం చేయడం సరైనదని భావిస్తున్నావా? ఎందుకు?
4) ఆపదలో ఉన్న వారిపట్ల దయా, కరుణతో ఉండాలికదా! అలా ఉండడం అంటే ఏమిటి?

### తెలుసుకోండి

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం, సాటివారికి సహాయం చేయడం, మానవతా దృష్టితో మెలగడం బాలబాలికలందరూ అలవర్చుకోవాలి. సాటివారు అంటే సమాజంలో కేవలం మనుషులే కాదు జంతువులు, పశువులు, పక్షులు ఎలా ఎన్నో రకాల జీవులు మనచుట్టూ ఉన్నాయి. అవి కూడా మనతో సమానంగా జీవిస్తున్నాయి. వాటి అవసరాలు మనకున్నాయి. మన అవసరాలు వాటికీ ఉన్నాయి. కాబట్టి వాటికీ మనతోపాటు స్వేచ్ఛగా జీవించే హక్కును ఇవ్వాలి. వాటికి ఆహారాన్ని ఇవ్వడం, దొరికేటట్లు చెయ్యడం మన బాధ్యత.

చాలా మంది జంతువులను పశుపక్షాదులను హింసిస్తూఉంటారు. ఒక్కసారి ఆలోచించండి. మనం అలా చేసినప్పుడు అవి ఎంత బాధపడి ఉంటాయో. సాటి మనిషి పట్ల, జంతువుల పట్ల గాని దయా, కరుణ భావనతో మనం ఉండాలి. నిత్యం ఎంతో మంది అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారు. అప్పుడు తోటివారిగా మనం వారికి తోచినంతగా సహాయం చేయాలి. నాకెందుకులే అని అందరూ అనుకుంటే సమాజం ఏమౌతుంది.

ఎంతో మంది అనాథలను, సమాజం వెలివేసిన కుష్టువ్యాధిగ్రస్తులను మేమున్నామని అక్కున చేర్చుకున్న బాబా ఆమ్టే, మథర్ థెరిస్సా వంటివారు మనకు ఎప్పుడూ ఆదర్శనీయులు. వారి సేవను మనం ఎప్పుడూ మరువకూడదు. తోటివారిపట్ల దయతో కరుణతో ఉండటం అలవర్చుకోవాలి.

## ఆ) తరగతి కృత్యం - జట్టుపని

- ఇతరులు మీకు ఏయే సందర్భాలలో సహాయపడ్డారు. అప్పుడు మీకు ఏమనిపించింది.
- మీరు ఇతరులకు ఎప్పుడెప్పుడు సహాయపడ్డారు. అప్పుడు మీకు ఎలా అనిపించింది.

## ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

- ఇతరులకు సహాయం చేయడంలో ఎంత ఆనందం ఉంటుందో అర్థమయ్యే ఉంటుంది మీకు. ఈవారం రోజులుగా ఇతరులకు గాని, ఇంట్లో కుటుంబ సభ్యులకుగాని, స్నేహితులకు గాని, జంతువులతో గాని పక్షులతో గాని దయా, కరుణతో ప్రవర్తించండి. సహాయం చేయండి. మీ అనుభూతులను చెప్పండి.

**సూక్తి**

**ఇతరులపట్ల మనం చూపే జాలి, కరుణ వారి జీవితాలలో బతుకుపై ఆశ, కృతజ్ఞత భావాన్ని పెంచుతాయి.**

# అనుబంధం

1. శ్లోకాలు
2. పద్యాలు
3. పాటలు / గేయాలు
4. కథలు
5. స్ఫూర్తిదాతలు

అనుబంధంలో ఉన్న శ్లోకాలు, పద్యాలు పాటలు, కథలు, స్ఫూర్తిదాతల చరిత్రలు మొదలగు వాటిని తరగతి గదిలో పిల్లలచే చదివించాలి. దానిపై మాట్లాడించాలి. ఉపాధ్యాయులు దాని ప్రాశస్త్యం గురించి వివరించాలి.

# 1. శ్లోకాలు

1) ఆలస్యం హి మనుష్యాణాం శరీరస్థోమహాన్ రిపుః ।
నాస్త్యుద్యమ సమోబంధుః కృత్వాయం నావసీదతి ॥

**భావం :** సోమరితనం, ఏమరుపాటు మనుష్యులకు మహా శత్రువులు. ప్రయత్నాన్ని మించిన బంధువు లేదు. ప్రయత్నం చేసినవాడు ఎన్నటికీ వైఫల్యం పొందడు.

2) దేశ రక్షా సమం పుణ్యం దేశ రక్షా సమం వ్రతం ।
దేశ రక్షా సమో యగో దృష్టోనైవ చ నైవ చ ॥

**భావం :** దేశరక్షణతో సమానమైన పుణ్యము, సమానమైన వ్రతము, సమానమైన యజ్ఞమును ఎక్కడనూ చూడలేము. అనగా దేశరక్షణయే సర్వశ్రేష్ఠకార్యము.

3) సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయత్ నబ్రూయత్ సత్యమప్రియం ।
ప్రియం చ నానృతం బ్రూయత్ ఏషధర్మస్సనాతనః ॥

**భావం :** సత్యమును పలుకవలెను. అదియును ప్రియముగా పలుకవలయును. సత్యమైనప్పటికినీ అప్రియముగా, కఠినముగా పలుకరాదు. ప్రియమును కలిగించును గదా అని అసత్యమును కూడా పలుకరాదు. ఇదే సనాతన ధర్మ లక్షణము.

# 2. పద్యాలు

1) అనగ ననగ రాగ మతిశయిల్లుచు నుండు
తినగ తినగ వేము తీయనుండు
సాధనమున పనులు సమకూరు ధరలోన
విశ్వదాభిరామ వినురవేమ!

**భావం :** సాధన చేయగా, చేయగా రాగాలాపన ఇంపుగా ఉంటుంది. తినగా, తినగా వేపచిగురు కూడా తియ్యగా ఉంటుంది. సాధన చేసిన పనులు విజయవంతంగా నెరవేరుతాయి.

2) కోపమునను ఘనత కొంచమైపోవును
కోపమునను గుణము కొఱత పడును
కోపమునను బ్రతుకు కొంచెమైపోవును
విశ్వదాభిరామ వినురవేమ!

**భావం :** కోపం వల్ల ఘనత (గొప్పదనం), గుణం తగ్గిపోతాయి. కోపంవల్ల జీవనం కూడా కష్టమే!

3) వినదగునెవ్వరు చెప్పిన
వినినంతనే వేగపడక వివరింపదగున్
గనికల్ల నిజము దెలిసిన
మనుజుడె పో నీతి పరుడు మహిలో సుమతీ!

**భావం :** మొదట ఎవ్వరు ఏమి చెప్పినను వినాలి. వినగానే తొందరపాటుగా ఏదో చేసివేయకుండా, ఆలోచించి సత్యాసత్యాలు తెలుసుకొని, తెలివిగా వ్యవహరించే వాడే నిజమైన వివేకవంతుడు.

4) ఉపకారికి నుపకారము
విపరీతము గాదుసేయ వివరింపంగా
నపకారికి నుపకారము
నెపమెన్నక సేయువాడె నేర్పరి సుమతీ!

**భావం :** మనకు ఉపకారం చేసిన వారికి ప్రత్యుపకారం చేయడం గొప్పకాదు. అయితే మనకు అపకారం చేసిన వారి తప్పులు క్షమించి, ఉపకారం చేయువాడే ఉత్తముడు.

5) పాముకన్న లేదు పాపిష్టి జీవంబు
అట్టిపాము చెప్పినట్లు వినును
ఖలుని గుణము మాన్ప ఘనులెవరు లేరు
విశ్వదాభిరామ వినురవేమ!

**భావం :** పాముకన్నా పాపిష్టి ప్రాణి మరొకటి లేదు. అట్టిపాము కూడా చెప్పినట్లు వింటుంది. కాని ఖలుని (నీచుని) గుణమును మాత్రం ఎవరూ మార్చలేరు.

6) ధనమెచ్చిన మదమెచ్చును
మదమెచ్చిన దుర్గుణంబు మానక హెచ్చున్
ధనముడిగిన మదముడుగును
మదముడిగిన దుర్గుణంబులు మానును వేమా!

**భావం :** ధనం మితిమీరితే మదం వస్తుంది. మదంతో దుర్గుణాలు పెరుగుతాయి. ధనంపోతే మదమణుగుతుంది. మదమణిగితే దుర్గుణాలు దూరమైపోతాయి. ఇది సహజం.

7) సత్యమార్గమునకు సమకూరు పదవులు
నిత్యనూతనముగ నిలిచి యుండు
సత్యమైన డొక్క సద్గురు పదవియో
కాళికాంబ! హంస! కాళికాంబ!

8) "దానధర్మము లేక దయయు సత్యము లేక
మానసమున మంచి నీతిలేక
చెడు గుణంబులతోడ చెలగాడుచున్నట్టి
హీనుడిలను చెడును పరము చెడును!

9) కన్నతల్లి కన్న, కన్న తండ్రికి నెన్న
కన్న భూమి కన్న మిన్న గలదె?
స్వర్గసీమ కూడ సాటి రాదెన్నడు
భవ్య సుగుణశీల! భరతబాల!

10) జన్మనిచ్చి నట్టి జననీ జనకులకన్న
గురుతరంపు విలువ గూడి యుండు
దైవమొకటి లేదు తల్లిదండ్రుల కన్న
భవ్య సుగుణశీల! భరతబాల!

# 3. పాటలు / గేయాలు

## 1. భరతమాత బిడ్డలం

భరతమాత బిడ్డలం అందరం – భరతమాత బిడ్డలమే అందరం

1) కలసి ఉంటె కలదు సుఖం – కలహిస్తే దుఃఖమయం
పరస్పరం ప్రేమిద్దాం – పరదూషణ మానేద్దాం
కుల భేదాలొద్దు మనకు – భాషా భేదము లొద్దు
అంటరాని తనమొద్దు – అందరమొకటిగ ఉందాం ॥ భరత ॥

2) జాతిని సేవించుదాము – దేశభక్తి పెంచుదాము
ఐకమత్యమే బలమని – అందరికీ చాటుదాము
శత్రువెవ్వడైనా – వాడెంతో బలము వాడైనా
విద్రోహుల నెల్ల దునిమి – విజయము సాధించుదాము ॥ భరత ॥

3) దేశమంటె మట్టే కాదు – దేశ మంటె మనుషులోయ్
దేశాన్ని ప్రేమిద్దాం – త్యాగాన్ని చూపిద్దాం
పవిత్రముగ జీవించి – పావన చరితను పొంది
స్వార్థమ్మును విడనాడి – సౌఖ్యమ్మును పెంచుదాము ॥ భరత ॥

## 2. తరువునురా – తల్లినిరా

చెట్టునురా – చెలిమినిరా!
తరువునురా – తల్లినిరా
నరికి వేయబోకురా
కరువు కోరుకోకురా!
అమ్మనురా! అమ్మకురా!
కొడుకునురా! నను కొట్టకురా!

నేల తల్లి గుండెలో
విత్తనాల గొంతులో
పసిపెదవుల నా గీతం
ప్రకృతికి సుప్రభాతం
నీకు నచ్చలేదటరా
పచ్చనాకు సంగీతం
చంటి పాప కాళ్ళతో
తన ఎదపై తన్నుకొనే, దీవెన నా తల్లి

ఆనందాశ్రువులు జార్చినట్లు
రాళ్ళు విసిరే మీకు
పళ్ళను అందిస్తున్నా
సూర్యరశ్మి బువ్వగా
లవణాలే పాలుగా కలిపి,
ఉగ్గుపాలపిండి తిండి చేసినానురా
కడుపు నింపు మాతకు
కడుపు కోత పెట్టకు
చనిపోయిన మనుషులకై

చితికి ఉన్న మమ్ము నరికి
చితిపేర్చి తగలేసే
నాగరికత మీది
బ్రతుకంటే త్యాగమునే
బాధ్యత మాది
మా తనువును త్రెంచినా
వేళ్ళు భూమిలో మిగుల్చు
మళ్ళీ మీ కోసము
చిగురించే దారి ఉంచు!
పెకలించాలంటే, మొదట
పది చెట్లను పెంచు!

– సుద్దాల అశోక్ తేజ

## 3. చెట్టమ్మ పాట

చెట్టమ్మా చెట్టమ్మా పచ్చాని చెట్టమ్మా
నీవు లేక మానవ మనుగడ లేనే లేదోయమ్మా

ఇంటింటీ గుమ్మంలోనా – తోరణాల ఆకైనావు
పెండ్లిళ్ళు పండుగలైనా పలకరించే పందిరివైనావు
నిండు ముత్తయిదువలాగ ఇంటి ముందే ఇలవేల్పయినావు
చుట్టాలు పక్కాలొచ్చిన చిరుగాలితో పలకరించినావు

ఆకలేస్తే అమ్మయివచ్చీ కడుపునిండే పండైనావు
నిద్దరొస్తే ఊయల అయ్యి గాలీల జోలపాడినావ్
ఎండొచ్చిన వానొచ్చిన గుండెల్లో దాచుకున్నావు
నీ గుణముల గోరంతయిన మనుషులకు లేదోయమ్మా

ప్రొద్దున్నే శుద్ధిని చేసే పళ్ళుతోమే పుల్లయినావు
వంటకుండ పురుడుపోయగా పొయ్యిలోన నిప్పయినావు
కూర్చుంటే కుర్చైనావు కునుకొస్తే మంచం అయినావు
అమ్మమ్మ తాతయ్యకు తోడునడిచే కర్రయినావు

పరులసేవ ముఖ్యం అంటూ శిరసువంచి ముందు నడిచినావు
చనిపోతే పాడైనావు కాల్చేస్తే కాడైనావు
దహనముకు దానము నిచ్చి నీ దేహం కాల్చుకున్నావు
ఎంతగొప్ప త్యాగమె నీది పచ్చని చెట్టమ్మా

నరులారా హితులారా – ఓ పండిత పామరులారా
ఆయురారోగ్యము నిచ్చే చెట్టు కథను విన్నారా
పచ్చనైన పరిమళ చెట్లు అంతరించిపోతున్నాయి
పర్యావరణాన్ని మనము రక్షించగ ముందుకుపోదాం

– జానపదగీతం

## 4. బాలల్లారా?

బాలల్లారా! పాపల్లారా!
బడికి క్రమంగా వెళ్ళండీ
చదువులు నేర్చి, శాస్త్రము తెలిసీ
చక్కని పేరును పొందండీ....

గురువులు చెప్పిన విద్యలన్నిటిని
గురుతుగ మీరు నేర్వండీ
మంచి రీతులను మంచి నీతులను
ఎంచి గ్రహించీ నడవండీ...

అల్లరి పిల్లల సావాసాలకు
వెళ్ళకండి ఏ వేళలను
మంచి పిల్లలా స్నేహము కోరి
మర్యాదగనూ మెలగండీ...

సాయంకాలం పిల్లలందరూ
చక్కగ ఆటలు ఆడండీ
ఆరోగ్యమ్ము మహాభాగ్యమను
సూత్రము జ్ఞప్తిని ఉంచండీ

వీరుల ధీరుల శూరుల గాథలు
మీరూ శ్రద్ధగ చదవండీ
దేశభక్తితో స్వయం శక్తితో
దివ్యముగా వెలుగొందండి...

– కవుల ఆంజనేయశర్మ

## 5. బాలకులు బాలికలు భావిజగతికి ఏలికలు

బాలకులం బాలికలం
భావి జగతి కేలికలం
పెంచిన తలిదండ్రుల హృది
నించు ప్రేమ మాలికం !!

ఆటల పాటల వెలుగుల
బాటల జను మిత్రులం
చీమకైన కీడెరుని
చిన్ని చిన్ని పవిత్రులం !!

అందము కను విందు జేయు
నందన మందారములం
తీయని కెందమ్మి విరుల
తేనెపోన పురములం !!

మిల మిల తలపులు మా క
న్నులలో తిలకించెదం
కిలకిల నవ్వులు మాపెద
వులపై నొలికించెదం !!

అల్లరి మల్లెలు కొల్లగ
జల్లి గుబాళించెదం
అల్లిబిల్లి పలుకులల్లి
ఉల్లము రంజించెదం !!

– బి.వి.నరసింహారావు

## 6. చిన్నారి పాపలు

చిన్నారీ పాపలమూ
సిరిమల్లే మొగ్గలమూ
దివినుండీ భువిమీదికి
దిగివచ్చిన విందులమూ

విశ్వమెల్ల మా కొరకై
వేయికండ్ల వేచినదీ
గున్నమావిపై కోయిల
సన్నాయిపలికినదీ

తీవెకన్నె ఒడలంతా
పూవులుగా నవ్వినదీ
గాలికుర్ర దల్లడుగో
ఈల వేసి మమ్ము పిలిచె

గిరులన్నీ మా కోసం
శిరములెత్తుకొని చూచెను
నదులన్నీ మమ్ము గాంచి
నడక మానుకొని నిలిచెను

పొదుగు చేపి పుడమిగోవు
మధుధారలు కురిపించెను
అంబురాలు వర్షించెను
ఆనందాశ్రువులు మాపై....

భూమి నెల్లవెల్లవేసె
పున్నమి వెన్నెల మాకై
మహిగర్భం దాచియుంచె
మణులూ గనులూ మాకై

– ఉండేల మాలకొండా రెడ్డి

## 7. నేలతల్లి

మరువలేము మరువలేము
కన్న తల్లినీ
మరువలేము మరువలేము
కన్న భూమినీ

జీవమిచ్చి భావమిచ్చి
చేరదీసినట్టి తల్లినీ
పాడిపంటలిచ్చి మాకు
తోడునిల్చినట్టి భూమినీ...

చదువునేర్పి నీతి నేర్పి
సాకినట్టి కన్నతల్లినీ
తిండినిచ్చి బట్టలిచ్చి
నీడ నొసగినట్టి భూమినీ....

దయను చూపి బ్రతుకు నేర్పి
దారి చూపినట్టి తల్లినీ,
వెలుగు చూపి విశ్వమందు
విలువ గూర్చినట్టి భూమినీ....

మరువలేము మరువలేము మరువలేమురా!

- నార్ల చిరంజీవి

## 8. భావిని దిద్దేది మేమే

బాల బాలికలము
భావిని దిద్దేది మేమే

మాట మాట కలుపుకొని
మసలుకొని ఉంటాము
ఆటపాట నేర్చుకొని
ఆనందంగుంటాము ॥ బాల ॥

చదువు సంధ్య నేర్చుకొని
చక్కగా ఉంటాము
సమతా భావముల నెల్ల
సాధించు కుంటాము... ॥ బాల ॥

అందరమొక్కటై మేము
అడుగులు ముందు కేస్తాము
అందరు బతకగ మేము
అధికోత్పత్తి తెస్తాం ॥ బాల ॥

- పాలడుగు నాగయ్య

## 9. ఉదయించే సూర్యుడా!

ఐదూ ఖండాల మీంచి
నాల్గూ సంద్రాల మీంచి
ఉరికురికి వచ్చినాము
ఉదయించే సూర్యుడా!
ఉప్పెనలా లేచినాము
ఉదయించే సూర్యుడా!
ఉద్యమాలు తెచ్చినాము
ఉదయించే సూర్యుడా!
ఉత్తేజం నీవె మాకు
ఉదయించే సూర్యుడా!

మెత్తని నీ చెయ్యి తాకి
పువ్వులమై పూసినాము
వెచ్చని నీ చూపు సోకి
మంచువలె కరిగినాము
నీ వల్లెనె నేలంతా
జల్లులమై కురిసినాము
నీవలెనే శత్రువుపై
ఎండలమై మండినాము
నీకోసం పిట్టలమై
ఆకసాన ఎగిరినాము

నీకోసం చేపలమై
నీటిలోన ఈదినాము

కళ్ళల్లో కలలమైన
నీళ్ళల్లో అలలమైన
మా కన్నుల కలవు నీవు
మా తలలో అలవు నీవు
తల్లిపాలతో ఎదిగే
పిల్లలమను తీగలం

కులం లేదు మతం లేదు
పేరు లేదు ఊరు లేదు
వెలుగే మా సరిహద్దు
శ్రమలో పొడిచె పొద్దు.

– వరవరరావు

## 10. మన భారతదేశం

అందమైన కాశ్మీరం – అత్యున్నత హిమాలయం
స్వచ్ఛమైన నదీజలం – ఉచ్ఛమైన తపోవనం
కలబోసుకున్నది – మన భారతదేశం ॥ అందమైన ॥

పురాణేతిహాసాలకు పుట్టినిల్లుగా
వేదాలు వెలసినట్టి కల్పవల్లిగా
పుణ్యమూర్తులెందరికో కన్నతల్లిగా
పుడమిలోన దేశాల్లో పుణ్యభూమి మనదేశం ॥ అందమైన ॥

సాంప్రదాయ దీపాలు వెలిగినట్టి కోవెలగా
సంస్కృతీ సౌరభాలు వెదజల్లిన వనములా
భిన్నమందు ఐక్యతను సాధించిన భూమిగా
వెలసినట్టి నిలిచిన ధన్యజీవి మనదేశం ॥ అందమైన ॥

# 4. కథలు

## 1. పనిపట్ల శ్రద్ధ

గంధసారదేశాన్ని చిత్రసేనుడనే రాజు పరిపాలిస్తున్నాడు. అతను తన ప్రజలను కన్నబిడ్డలవలే చూసుకొనేవాడు. మంచిరాజుగా అందరి మన్ననలు పొందాడు. ఒకనాడు ఆ రాజు తన రాజ్యంలో ప్రజలు ఎలా ఉన్నారో తెలుసుకోవాలని భావించి మారువేషంలో రాత్రిపూట సంచరించసాగాడు. తన కొలువులో ఉద్యోగులు చాలామంది చేస్తున్న అరాచకాలు, అన్యాయాలు చూసి ఆశ్చర్యపోయాడు. అలా తిరుగుతుండగా చాలా దృశ్యాలు అతనికి కనిపించి బాధపెట్టాయి. తిరిగి వస్తుండగా తన రాజప్రసాదం దగ్గర ఉన్న కాపలాదారుడు ఆ రాత్రివేళ రెండుగంటలప్పుడు కూడా మెలకువగా ఉండి తన విద్యుక్త ధర్మాన్ని నిర్వహిస్తున్నాడు. రాజుని చూశాడు. “ఎవ్వరు నువ్వు?” ఈ సమయంలో ఇక్కడికెందుకు వచ్చావు? రాజుగారు నిద్రించుచున్నారు. ఈ వేళప్పుడు రాజదర్శనం నీకు లభించదు. కాబట్టి వెళ్ళిపో. రేపు రా” అంటూ వారించాడు. ఆ మారువేషంలో ఉన్న రాజు ఎంతగానో బ్రతిమాలాడాడు. లోపలికి పంపమని. ఆ కాపలాదారు కాదన్నాడు. డబ్బు లంచంగా ఎరజూపాడు రాజు. అతనికి కోపం వచ్చింది. లంచం తీసుకొని నన్ను మోసం చేసుకోమంటావా? వీల్లేదు. ఈ విషయం రాజుకి చెప్పగలను జాగ్రత్త” అన్నాడు. చివరికి రాజు చేసేది లేక కాపలాదారుని విశ్రాంతి గదిలో నిద్రించాడు. తెల్లవారురఝామున ఆ గది నుండి వెళ్ళి వేరే మార్గం గుండా రాజప్రసాదంలోకి ప్రవేశించాడు రాజు. తెల్లవారాక రాజు ఆ కాపలాదారుని పిలిచి అందరి సమక్షంలో రాత్రి జరిగిన సంఘటనను గురించి వివరించాడు. కాపాలాదారు ఆశ్చర్యపోయాడు. ప్రభూ! మీరు మారువేషంలో ఉండటం వలన గుర్తించలేకపోయాను. క్షమించండి” అన్నాడు. రాజు అతనిని మెచ్చుకొని నీ పనిపట్ల నీవు అంకితభావాన్ని ప్రదర్శించావు. బాధ్యతను విస్మరించిన మిగిలిన వారందరికీ నీవు ఉదాహరణగా నిలిచావు. అంటూ అతనిని పొగిడి అందరి సమక్షంలో అతనిని సైన్యాధ్యక్షునిగా నియమించాడు రాజు. మనం చేస్తున్న పనిలో అంకిత భావాన్ని కలిగి, ఆ పనిని త్రికరణ శుద్ధిగా చేస్తే ఫలితం అమోఘంగా ఉంటుంది. అందుకే పనిపట్ల శ్రద్ధతో పాటు అంకితభావం కూడా ఉండాలి.

## 2. దైవదత్తమైన గాత్రం

అక్బర్ కొలువులో తాన్‌సేన్ అనే ప్రసిద్ధ సంగీతకారుడు ఉండేవాడు. అతను మంచి గాయకుడు. ప్రతిరోజూ రాత్రివేళ అక్బర్‌వద్ద పాడేవాడు. అక్బర్ అతని సంగీతాన్ని ఆస్వాదించేవాడు. బీర్బల్‌కు కూడా సంగీతమంటే ఇష్టం. అతను కూడా అక్బర్‌తో కలిసి తాన్‌సేన్ గాత్ర మాధుర్యాన్ని ఆస్వాదించేవాడు. ఒక వెన్నెల రాత్రి తాన్‌సేన్ సంగీతం విన్న తర్వాత అక్బర్, బీర్బల్ రాజమహల్ ఉద్యానవనంలోని పచ్చికలో నడుస్తున్నారు.

"తాన్‌సేన్ సంగీతం దైవదత్తమైనది. అతని గానం వింటుంటే నన్ను నేను మరచిపోతాను. ఈ ప్రపంచంలోనే అతను మంచి సంగీతజ్ఞుడు" అన్నాడు అక్బర్.

"అవును ప్రభూ! అయితే తాన్‌సేన్ అందుకు అంగీకరించడు. తన గురువైన హరిదాస్ సంగీతం దైవదత్తమైనదని, అతనే ప్రపంచంలో అత్యుత్తమ సంగీతజ్ఞుడని తాన్‌సేన్ అభిప్రాయం" అని చెప్పాడు బీర్బల్.

అక్బర్ వెంటనే తాన్‌సేన్‌ను పిలిపించి "తాన్‌సేన్! మీ గురువు నీ కంటే బాగా పాడతారని విన్నాను. నేను దాన్ని నమ్మడం లేదు. మీరు ఈ ప్రపంచంలో అత్యుత్తమ గాయకులని నా నమ్మకం" అన్నాడు.

"మహారాజా! సంగీత శాస్త్రానికే దేవుడైన తుంబురుడి మరో అవతారమే మా గురువు. వారిలా మరెవరూ పాడలేరు" బదులిచ్చాడు తాన్‌సేన్. "అయితే నేను మీ గురువుగారి గాత్రం వినాలి" అక్బర్ తన అభిలాషను వ్యక్తం చేశాడు. "వారిని తీసుకురాగలవా?" అని తిరిగి ప్రశ్నించాడు. "మా గురువుగారు స్వేచ్ఛా పిపాసులు. వారు ఎవరి అదుపు ఆజ్ఞల్లో ఉండరు. మనం ఆహ్వానించినా వారు రారు" చెప్పాడు తాన్‌సేన్.

ఆ మాటలకు అక్బర్ నిరాశ చెందాడు. "ఎలాగైనా వారి గాత్రం నేను వినాలి. అందుకు ఏం చేద్దాం" అని తాన్‌సేన్‌ను ప్రశ్నించాడు.

"మహారాజా! వారు బృందావనంలో ఆశ్రమంలో నివసిస్తున్నారు. మీరు వారి గాత్రాన్ని ఆశ్రమంలో వినవచ్చు" అన్నాడు తాన్‌సేన్.

అక్బర్ వెంటనే మంత్రి రాజా మాన్ సింగ్‌ను పిలిచి తాను హరిదాస్‌ను బృందావనంలో కలుసుకోవడానికి తగిన ఏర్పాట్లు చెయ్యమని ఆదేశించాడు. తన మందీ మార్బలంతో ప్రత్యేక రథంలో వెళ్ళాలని నిశ్చయించుకున్నాడు. "ప్రభూ! మందీ మార్బలంతో వెళితే మా గురువుగారు మిమ్మల్ని చూడడానికి తిరస్కరించవచ్చు. వారు నివసిస్తున్నది చిన్న ఆశ్రమం అని గుర్తించండి" అని వేడుకున్నాడు తాన్‌సేన్. బీర్బల్ కూడా తాన్‌సేన్‌ను సమర్థిస్తూ కొద్దిమందితో ఆశ్రమానికి వెళ్ళడం మంచిదని అక్బర్‌కు సూచించాడు.

చివరకు అక్బర్ చక్రవర్తి, తాన్‌సేన్, బీర్బల్ ముగ్గురూ రథంలో బృందావనంకు వెళ్ళారు. కొద్ది దూరంలో రథాన్ని వదలి నడుచుకుంటూ ఆశ్రమాన్ని చేరారు. తాన్‌సేన్, అక్బరు చక్రవర్తిని తన గురువుకు పరిచయం చేశాడు.

"ప్రభూ! మీరు నా గాత్రం వినాలని ఇంతదూరం వచ్చారా! అయితే ఇతరుల కోరికపై పాడే అలవాటు నాకు లేదు నాలో భావావేశం పొంగినప్పుడు, తాదాత్మ్యం చెందినప్పుడు మాత్రమే నా గొంతు సంగీతం పలుకుతుంది. మిగిలిన వేళలలో నేను పాడలేను" అని తన నిస్సహాయత వ్యక్తం చేశాడు హరిదాస్.

అక్బర్‌కు నిరాశ కలిగింది. చిరుకోపం కూడా వచ్చింది. అప్పుడు బీర్బల్, తాన్‌సేన్‌ను బయటకు తీసుకువెళ్ళి ఇప్పుడేం చేస్తావని ప్రశ్నించాడు. "ఒకే ఒక మార్గం ఉంది. మా గురువుగారి ఎదుట ఎవరైనా తప్పుగా పాడితే వారిని సరిదిద్దడానికి వారు కూడా పాడతారు" అని చెప్పాడు తాన్‌సేన్.

"అలాగా! అయితే నువ్వు వెళ్ళి ఒక రాగాన్ని అపస్వరాలతో ఆలపించు. నిన్ను సరిచేయడానికి మీ గురువు పాడతారు" అని బీర్బల్ సూచించాడు. ఈ విషయాన్ని అక్బర్‌కు చెప్పాడు. అక్బర్ సంతోషించాడు.

సూరదాస్ స్వరపరచిన భైరవి రాగంలోని గీతాన్ని అపస్వరాలతో తాన్‌సేన్ పాడసాగాడు. అది విన్న హరిదాస్‌కు కోపం వచ్చింది. తప్పుడు స్వరాలను సరిదిద్దుతూ తానూ పాడసాగాడు.

హరిదాస్ గాత్రం వినేసరికి అక్బర్ తనను తాను మరచిపోయాడు.

అది నిజంగా దైవదత్తమైన గాత్రమే. అక్బర్, బీర్బల్ ఆ గాత్ర మాధుర్యాన్ని మైమరచి విన్నారు. తర్వాత హరిదాస్ ఆశీర్వాదం తీసుకొని బయటకు వచ్చారు.

వచ్చేటప్పుడు "తాన్‌సేన్ నువ్వు మీ గురువుగారి అంత గొప్పగా ఎందుకు పాడలేకపోతున్నావు?" అని ప్రశ్నించాడు అక్బర్.

"నేనెంత ప్రయత్నించినా నేను వారిలా పాడలేను. అందుకు కారణం..." అంటూ అర్ధోక్తిలో ఆగిపోయి బీర్బల్ వైపు చూశాడు తాన్‌సేన్.

"మహారాజా! కారణం నాకు తెలుసు. మీరు కోపగించుకోనంటే నేను చెబుతాను" అన్నాడు బీర్బల్. అక్బర్ చెప్పమన్నాడు.

"తాన్‌సేన్ గాత్రం తన గురువు గాత్రం కన్నా తక్కువదేమి కాదు. అయితే గానానికి లక్ష్యం ప్రధానం. తాన్‌సేన్ మిమ్మల్ని మెప్పించడానికి పాడతాడు. వారి గురువు హరిదాస్ దేవుడ్ని మెప్పించడానికి పాడతాడు. అదే వారిద్దరి గాత్రాలలో ఉన్న తేడా" అని విషయాన్ని విడమర్చి చెప్పాడు బీర్బల్.

బీర్బల్ నిశిత దృష్టిని అక్బర్ మెచ్చుకున్నాడు.

## 3. పట్టుదల

రామాపురం అనే గ్రామంలో రాము, సోము అనే విద్యార్థులు ఒకే తరగతి చదువుతున్నారు. ఇద్దరూ స్నేహితులు. రాము ధనవంతుల కుటుంబంలో పుట్టి పెరగడం వలన చదువుమీద శ్రద్ధ చూపేవాడు కాదు. విలాసవంతమైన జీవనాన్ని గడిపేవాడు. చదువు మీద నిర్లక్ష్యం నానాటికీ పెరిగిపోసాగింది. కానీ, సోము పేదకుటుంబంలో జన్మించడం వలన తన తల్లిదండ్రులకు సహాయపడుతూ, ఖాళీ సమయంలో చదువుకొనేవాడు. పాఠశాలలో మంచి మార్కులు సంపాదించేవాడు. ఈ విషయం గమనించిన రాము సోమును ద్వేషించేవాడు. 'జీవితంలో విలువైనది డబ్బు, ఆ డబ్బుతో నేనేమైనా సాధించగలను' అని గర్వంగా మాట్లాడేవాడు. సోముని హేళనచేసేవాడు. ఐనా, సోము బాధపడకుండా రాముని ఎలాగైనా మార్చి, తన చదువుపట్ల శ్రద్ధ చూపేలాగా చేస్తానని ప్రతిజ్ఞ చేశాడు. అందుకు ప్రయత్నించి చాలాసార్లు విఫలమయ్యాడు. రాము రోజురోజుకీ చెడు ప్రవర్తనతో జులాయిగా తిరగసాగాడు. ధనాన్ని విపరీతంగా ఖర్చుచేసేవాడు. సోము కష్టపడి చదివాడు. పట్టుదలతో, శ్రమించి ఉన్నత విద్యను అభ్యసించాడు. తను అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నాడు. తాను శ్రమించి, ఇతరుల ఆర్థిక సహాయాన్ని కూడా పొంది ఐ.ఎ.ఎస్. పరీక్ష పాసై, తనుంటున్న జిల్లాకే కలక్టర్ అయ్యాడు. అందరికీ సహాయపడుతూ మంచి కలక్టరుగా గుర్తింపు పొందాడు.

రాము పరిస్థితి బాగా దిగజారిపోయింది. చదువు రాలేదు. ఉన్న ధనమంతా ఖర్చుపెట్టేశాడు. ఎందుకూ పనికి రాకుండాపోయాడు. ఈ విషయాలన్నీ సోము తెల్సుకున్నాడు. తనతో కల్సి బడిలో చదివిన రాము స్థితికి జాలిపడ్డాడు సోము. అతనిని పిలిపించి ఆర్థిక సహాయాన్ని అందించాడు సోము. దాంతో రాముకి బుద్ధి వచ్చింది.. తన సోమరితనం, పనిపట్ల విశ్వాసం లేకపోవడం తన పతనానికి కారణమని గుర్తించాడు. రాము అందించిన ఆర్థిక సహాయంతో ఒక చిన్న వ్యాపారం ప్రారంభించి, ఎంతో కష్టపడి, శ్రమించి ఆ వ్యాపారాన్ని పెంచి పెద్దదిగా చేసుకున్నాడు. అప్పుడు తెలిసివచ్చింది. అతనికి శ్రమనిష్ఠలో ఎంత లాభముందో. అందుకే మనం మన పనిపట్ల, విశ్వాసాన్ని పెంచుకొని పట్టుదలతో దాన్ని చేస్తే విజయాన్ని పొందగలుగుతాం.

## 4. తెలివిగల అవ్వ

ఒక గ్రామంలో ఒక వృద్ధురాలుండేది. ఆవిడకు కంటి చూపు తగ్గింది. ధనానికి లోటు లేకపోయినా, ఇంట్లో తోడెవ్వరూ లేకపోవడంవల్ల కళ్ళు బాగుచేయించుకొంటే కాని తన పనులు తాను చేసుకోలేననుకొన్నది. అందువల్ల ఆ గ్రామం లోని వైద్యుణ్ణి తన కళ్ళు బాగుచెయ్యవలసిందని అడిగింది. ఆ చికిత్సకు అతను అడిగిన సొమ్ము ఇస్తానన్నది. అతను ప్రతి దినం వచ్చి ఆమె కళ్ళకు మందు పోసేవాడు. తర్వాత ఇంట్లో ఉన్న వెండిగిన్నో, బంగారపు వస్తువో ఏది కనిపిస్తే అది తీసుకుపోయేవాడు. చూపు సరిగా లేనందువల్ల ఆమె అతని దొంగతనం కనిపెట్టలేకపోయింది.

ఇలా కొంత కాలం గడిచిన తర్వాత "నీకు చూపు వచ్చింది. నాకు ఇవ్వవలసిన సొమ్ము ఇమ్మ"ని వైద్యుడడగ్గా, నాకు చూపు ఏమీ బాగుపడలేదు కాబట్టి నేను నీకేమీ ఇవ్వనన్నదామె. అందుకు వైద్యుడు కోపించి న్యాయస్థానంలో ఆమె మీద కేసు వేసాడు. ఆమె న్యాయస్థానానికి వెళ్ళింది. అప్పుడు న్యాయస్థానంలో న్యాయాధికారికి అవ్వకు మధ్య సంభాషణ ఇలా జరిగింది.

"ఏమమ్మా" ఈ వైద్యుణ్ణి కళ్ళు బాగుచెయ్యమని నీవు అడిగావా లేదా?"

"అడిగానండి."

"అతను నీకు రోజూ వచ్చి చికిత్స చేశాడా?"

"చేశారండీ?"

"ఇప్పుడు నీకు చూపు వచ్చిందా లేదా."

"రాలేదండీ?"

"కాదు, చూపు వచ్చిదంటున్నాడే వైద్యుడు?"

"ఆయన చెప్పేది అబద్ధమండీ?"

"నీదే అబద్ధమంటున్నాడాయన. చికిత్స చేయించుకొన్నందుకు ఇవ్వవలసిన సొమ్ము ఎగ్గొట్టడానికే నువ్విలా అంటున్నావని ఆయన నీమీద నేరం మోపుతున్నాడు. ఇందుకు నీ సమాధానం ఏమిటి?"

"అయ్యా! నేను ఒంటరిదాన్ని. నా కళ్ళు తిన్నగా ఉన్న రోజుల్లో ఇంట్లో వెండివస్తువులూ, బంగారు వస్తువులూ ఎన్నో ఉండేవి. ఈ మహానుభావుడు చికిత్స చేసిన తర్వాత వాటిలో ఒకటి కూడా నాకు కనిపించడంలేదు. నాకు నిజంగా చూపే వచ్చినట్లయితే అవి కనపడేవేకదా! పెట్టిన చోట పెట్టినట్లే ఉండేవికదా! న్యాయమూర్తులు మీరే చెప్పండి నాకు చూపు వచ్చినట్టా? లేనట్టా?"

న్యాయమూర్తి ఆమె సమాధానం విని ఆ వృద్ధురాలు కనబడటంలేదన్న వస్తువుల జాబితా రాయించి వాటి నన్నిటినీ ఆమెకు అప్పగించి పెట్టవలసిందనీ, ఆమెను మోసగించినందుకు వెయ్యి వెండి నాణేలు జరిమానా చెల్లించవలసిందనీ వైద్యుణ్ణి ఆదేశించాడు. వైద్యుడు న్యాయమూర్తి ఆజ్ఞకు బద్ధుడై ఆ వృద్ధురాలి వస్తువులన్నీ ఆమెకు ఇవ్వటమే కాక వెయ్యి వెండి నాణేలూ జరిమానా చెల్లించుకొన్నాడు. చికిత్స చేసినందుకు ప్రతిఫలం పొందక పోగా జరిమానా కూడా కట్టుకోవలసి వచ్చినందుకు దుఃఖపడ్డాడు.

మోసం ఎన్నటికీ జయించదు.

## 5. మార్కండేయుడు

మృకండడు ఒక మహర్షి. ఆయన భార్యపేరు మనస్విని. ఈయన ఎంతో నియమ నిష్ఠలతో తపస్సు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వీరికి సంతానంలేదు. వారు శివుని ప్రార్థించారు. గుణవంతుడు, బుద్ధిమంతుడు, సుందరరూపుడు, అల్పాయుష్కుడైన కుమారుని ప్రసాదించాడు శివుడు.

కలిగిన సంతానాన్ని మృకండు దంపతులు ఎంతో గారాబంగా పెంచారు. ఆ బాలుని పేరు మార్కండేయుడు. ఆ పిల్లవాడు పెద్దల శిక్షణలో పెరిగి శాస్త్రాలలో నైపుణ్యం సంపాదించాడు. శివభక్తుడై ఎల్లవేళలా శివుణ్ణే స్మరిస్తూ అందరి మన్ననలూ పొందాడు. శివుడు చెప్పిన అల్పాయువు గడువు పదహారు సంవత్సరాలు పూర్తి కావస్తున్నాయి. ముని దంపతులు తమ కుమారుడు ఇక కొద్దికాలంలో మరణిస్తాడని దుఃఖిస్తున్నారు. ఇంతలో అక్కడికి నారదుడు వచ్చాడు. ముని దంపతులిచ్చిన ఆతిథ్యం స్వీకరించాడు. మ్రొక్కిన మార్కండేయుని "దీర్ఘాయుష్మాన్ భవ" అని ఆశీర్వదించాడు. మృకండడు నారదునితో శివుని వరం గూర్చి చెప్పాడు. ఫరవాలేదు. ప్రాణం పోసిన వాడే ఆయువుపోస్తాడు. శివుని ప్రార్థించమని మార్కండేయునికి "ఓం నమఃశివాయ" అనే పంచాక్షరీ మంత్రాన్ని ఉపదేశించాడు నారదుడు.

మార్కండేయుడు ఆ మంత్రంతో శివుని గూర్చి తపస్సు చేస్తున్నాడు. ఆయువు తీరగానే యముడు మార్కండేయుని ప్రాణాలను తీసుకొనిపోవడానికి వచ్చాడు. యముడు కాలపాశం విసిరాడు. మార్కండేయుడు గట్టిగా శివలింగాన్ని కౌగిలించుకొన్నాడు. శివుని ప్రార్థించాడు. శివుడు ప్రత్యక్షమై యమపాశాన్ని తన త్రిశూలంతో నివారించాడు. శివుని ఆరాధనలో ఉన్నవారికి ప్రాణగండంలేదని శివుడన్నాడు. నాధర్మం నేను నెరవేర్చాలి కదా! అని యముడు విన్నవించుకొన్నాడు. శివుడు మార్కండేయుని ఆశీర్వదించి పూర్ణాయుస్సునిచ్చాడు. చిరంజీవివి కమ్మన్నాడు. యముడు వెళ్ళిపోయాడు. మార్కండేయుడు మృత్యుంజయుడై తన తల్లిదండ్రులకు ఆనందం కలిగించాడు. శివభక్తితో మృత్యువునే జయించాడు.

## 6. గుర్రం దొంగ

బీర్బల్ కీర్తి దశదిశల వ్యాపించింది. న్యాయం కోరుతూ దేశం నలుమూలల నుండి ప్రజలు బీర్బల్ దగ్గరికి వస్తుండేవారు. బీర్బల్ మంచి తెలివైనవాడని, యుక్తిపరుడని, న్యాయదృష్టి కలిగినవాడని ప్రజలు చెప్పుకునేవారు. ఈ విషయం త్రిపురను పాలించే రాజు చంద్రవర్మకు తెలిసింది. ఆయన బీర్బల్‌ను చూడాలనుకున్నాడు. ఒక వర్తకుడిలా మారువేషం వేసుకుని ఒక గుర్రంపై ఆగ్రాకు బయల్దేరాడు.

ఆగ్రాకు కొద్దిదూరం ఒక వ్యక్తి నడవడానికి ఇబ్బంది పడుతూ చంద్రవర్మకు కనిపించాడు. చంద్రవర్మ జాలిపడి గుర్రం దిగి ఆవ్యక్తి రవివర్మని గుర్రంపై కూర్చోమన్నాడు. చంద్రవర్మ గుర్రం కళ్ళెం పట్టుకుని ముందు నడవసాగాడు. ఇద్దరూ పట్టణంలోకి ప్రవేశించారు. చంద్రవర్మ, రవివర్మని గుర్రం దిగమన్నాడు. రవివర్మ అందుకు నిరాకరించి గుర్రం తనదేనని, కనుకనే తను గుర్రంపై కూర్చున్నానని, చంద్రవర్మ గుర్రం కళ్ళెం పట్టుకొని వచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపి అతనిని వెళ్ళమన్నాడు.

చంద్రవర్మకు మతిపోయింది. గుర్రంలేకుండా తను తిరిగి త్రిపురకు ఎలా వెళ్ళగలడు? ఏం చెయ్యాలో పాలుపోక చూస్తుండగా గుమికూడిన ప్రజలు ఈ తగవుకు పరిష్కారానికి బీర్బల్ వద్దకు వెళ్ళమన్నారు.

ఇద్దరూ బీర్బల్ ఇంటికి వెళ్ళి తమ వాదనలు వినిపించారు. ఒకరోజు గడువుకావాలని, అప్పటి వరకు గుర్రాన్ని తన దగ్గరే ఉంచమని చెప్పాడు బీర్బల్. ఇద్దరూ అంగీకరించి అక్కడ్నుంచి వెళ్ళారు. వెంటనే బీర్బల్ తన సేవకుడు తిరిగివచ్చి గుర్రం చంద్రవర్మ వెనక వెళ్ళిందని చెప్పాడు. తెల్లవారి చంద్రవర్మ, రవివర్మ ఇద్దరూ బీర్బల్ ఇంటికి వచ్చారు. బీర్బల్ సేవకుణ్ని పిలిచి వారిద్దరినీ గుర్రపుశాలలోకి తీసుకువెళ్ళమని, గుర్రం నిజమైన సొంతదారు తన గుర్రాన్ని తీసుకెళ్ళవచ్చని చెప్పాడు.

ఇద్దరూ గుర్రపుశాలలోకి వెళ్ళేసరికి అక్కడ పది గుర్రాలు ఉన్నాయి. అన్నీ ఒకే ఎత్తు ఒకేలావు, ఒకే రంగులో ఉన్నాయి. దాంతో రవివర్మ గుర్రాన్ని గుర్తించలేక నిలబడ్డాడు. చంద్రవర్మ తన గుర్రం దగ్గరకు వెళ్ళి దానితాడు విప్పాడు. అది యజమానిని గుర్తించి ప్రేమగా సకిలించింది.

రవివర్మ బీర్బల్ పాదాలపై పడి క్షమించమని వేడుకున్నాడు. బీర్బల్ తీర్పుకు చంద్రవర్మ సంతోషించాడు. అతను బీర్బల్‌కు కృతజ్ఞతలు తెలిపి వెనుదిరిగాడు. తను ఎవరో అతను చెప్పదలచలేదు.

బీర్బల్ అకస్మాత్తుగా "మహారాజా! మీరు మా అతిథిగా మరికొన్ని రోజులు గడపకూడదా!" అని అడిగాడు.

తాను మారువేషంలో ఉన్నప్పటికీ బీర్బల్ ఎలా గుర్తించాడా అని రాజు చంద్రవర్మ ఆశ్చర్యపోయాడు. తనను ఎలా గుర్తించారని ప్రశ్నించాడు. "మహారాజా! మా రాజ్యంలోకి ఎవరు ప్రవేశించినా మా వేగుల వారి ద్వారా మాకు వెంటనే తెలుస్తుంది" అని బదులిచ్చాడు బీర్బల్.

రాజు చంద్రవర్మ "ఈగుర్రం నాదేనని మీరు ఎలా గుర్తించగలిగారు?" అని మరో ప్రశ్న అడిగాడు.

"అది చాలా సులభం. గుర్రాన్ని మీ ఇద్దరి వెనుక తీసుకెళ్ళమని మా సేవకుణ్ని ఆదేశించాను. అది మీ వెనక వెళ్ళిందని తెలిసి అది మీ గుర్రమే అని నిశ్చయించాను. అయినా మరోసారి నిర్ధారణ కోసం ఒకే తరహా గుర్రాలతో కలిపి కట్టివేయించాను. నిజమైన సొంతదారే తన గుర్రాన్ని గుర్తించగలడు. మీరు గుర్తించారు. అందుకే అది మీ గుర్రమేనని తేలింది" అని చెప్పాడు బీర్బల్. రాజు చంద్రవర్మ బీర్బల్ తెలివితేటలకు సంతోషించి అనేక బహుమతుల వర్షం కురిపించాడు.

## 7. సింహం – కుందేలు

అనగనగా ఓ అడవి. ఆ అడవిలో భాసురకమనే సింహం ఉండేది. అది మహాబలశాలి. కంటపడ్డ జంతువునల్లా కండకావరంతో చంపేసి కరకరనమిలి మింగేసేది. ఆకలి మీద ఉన్నా, ఆకలి లేకపోయినా విచక్షణారహితంగా జంతువుల్ని అంతం చేయడం దాని మూర్ఖపు సరదా.

అనాదిగా అదే అడవిలో జీవిస్తున్న లేళ్ళు, దుప్పులు, పోతుపందులు, అడవి బర్రెలు, మదపుటెద్దులు, కుందేళ్ళు వగైరా జంతువులన్నీ కలిసి ఒకనాడు భయభక్తులు నటిస్తూ, తలలు వంచి, మోకాళ్ళు నేలకు తగిలేట్టుగా మోకరిల్లి మృగరాజు భాసురకానికి ఓ విన్నపం చేశాయి : "మృగరాజా, తమరు మాబోటి చిల్లరమల్లర జంతువులను విచ్చలవిడిగా చంపేయడంతో మేమంతా నిత్యం ప్రాణభయంతో గజగజలాడిపోతున్నాం. రోజుకొక్క జంతువు మీ ఆకలిని తీర్చగలిగి ఉండగా ఇలా అనవసరంగా అనేక జంతువుల్ని చంపుతూ పోవడం ధర్మంకాదు. ఇకపై ప్రతిరోజూ తమ ఆహారార్థం ఒక జంతువు చొప్పున తమ గుహ ముంగిటికి పంపుతాం. ప్రతి ఫలంగా తమరు మమ్మల్ని ప్రాణహాని లేకుండా అడవిలో తిరగనివ్వండి. ఇది ఉభయతారకంగా ఉంటుంది. పెద్దల సూక్తి ప్రకారం, తగిన మోతాదులో ఔషధం సేవించడం ద్వారా మనిషికి శక్తి కలుగుతుంది. అలాగే రాజు తన పౌరులపై మితంగా పన్నులు విధించి ధనం రాబట్టుకోవడం ద్వారా ఆర్థిక బలసంపన్నుడవుతాడు. ఆవు చేపాలంటే ముందు దానిని పుష్టిగా మేపాలి. లతలు పుష్పించి కళకళలాడాలంటే రోజూ నీళ్ళుపోసి చక్కగా పోషించాలి. అదేమాదిరిగా రాజు కూడా తన పౌరుల నుండి పన్నులు, సేవలు ఇమ్ముగా రాబట్టుకోవాలంటే ప్రజల్ని బిడ్డల మాదిరిగా చూసుకోవాలి."

వాటి విన్నపం ఆలకించిన భాసురకం "మీ విన్నపం న్యాయంగానే ఉంది. ప్రతిరోజు ఒక జంతువు చొప్పున నాకు పంపకపోయారో, మీ అందరికీ చావు మూడుతుంది. జాగ్రత్త!" అన్నది.

అవగాహన కుదిరిన మేరకు ప్రతిరోజు ఒక జంతువు సింహానికి ఆహారంగా వెళ్తున్నది. ఒక రోజు కుందేలు వంతు వచ్చింది. పుట్టెడు దిగులుతో అది సింహం గుహకు బయల్దేరింది. దారిలో ఓ పెద్ద బావి కనిపించింది. బావి అంచున నిలబడి నీళ్ళలోకి చూడగా తన ప్రతిబింబం కానవచ్చింది. వెంటనే కుందేలుకో ఉపాయం తోచింది. బుర్రలేని సింహాన్ని బురిడీ కొట్టించలేకపోతే నేను కుశాగ్రబుద్ధిగల కుందేలుని కానే కాను అని మనసులో అనుకుంది. మెల్లగా పెళ్ళి నడకలు నడుచుకుంటూ కుందేలు సింహం గుహ ముందుకు వచ్చి తలవంచి నిలబడింది.

భాసురకం ఆకలితో నకనకలాడుతున్నది. అనుకున్న వేళకి జంతువు అయిపులేకపోయేసరికి సింహం పళ్ళు పటపట కొరికింది. "వాగ్దానభంగం చేస్తార్రా? ఇప్పటికప్పుడు మీ అంతు చూస్తాను, యేమనుకున్నారో?" అని చిందులు తొక్కుతోంది. సరిగ్గా అదే సమయంలో వినయంగా, భయసంభ్రమాలతో వణికిపోతూ ఎదురుగా తలవాల్చి నిలబడ్డ కుందేలు కనపడగానే "ఏమిటింత ఆలస్యం? మీ అధమాధమ జంతువులకు వేటికీ బ్రతకాలని లేదా? మీ అందరి అంతు చూస్తాను" అని సింహం గర్జించింది.

"మహాప్రభో! ఈ దీనుడి తప్పుకాయండి. దార్లో జరిగిందేమిటో తమకు విన్నవిస్తాను. ఆలకించిన తరువాత తమరే శిక్ష విధించినా, భరిస్తాను" అని కుందేలు ప్రాధేయపడింది.

“త్వరగా చెప్పియేడువు” గర్జించింది సింహం.

“మహాప్రభో, ఈ రోజు తమవద్దకు ఆహారంగా రావటానికి నా వంతు వచ్చింది. నేను మరీ అర్భకురాలిని కాబట్టి తమకు ఆహారంగా నేనొక్కత్తెనూ చాలనని మరో నాలుగు కుందేళ్ళు నాతోపాటు బైల్దేరాయి. మార్గమధ్యంలో ఆకలిగొన్న సింహం ఒకటి మా దారికడ్డు నిల్చి “ఎక్కడికే మీ పోక? మీ యిష్టదైవం నేనైతే నాకు బలి అవకుండా ఏమిటా పరుగు? ఆగండి” అని గర్జించింది మహాప్రభూ! మేం మా దేవుడు భాసురకునితో ఒప్పందం చేసుకున్న ప్రకారం వారికి ఆహారంగా వెళ్తున్నాం అని నేను అన్నాను.”

“ఎవడా భాసురకుడు? ఈ మహారణ్యానికంతటికీ అధిపతిని నేను. వాడెవడో వంచకుడు. మీలో నలుగురిని నా బందీలుగా కట్టేసి ఉంచుతాను. ఒకరు ఆ నకిలీ సింహం వద్దకు పోయి నాతో పోరుకు రమ్మనమని చెప్పాలి. యుద్ధంలో గెలిచినవాడే వీరుడు. రాజ్యం వీరభోజ్యమని నానుడి. విజేతనై ఈ రాజ్యాన్ని ఏలతాను, మిమ్మల్ని భుజిస్తాను” అని అతడు తమ వద్దకు నన్ను తరిమాడు ప్రభూ. అందువల్ల నా రాక ఆలస్యమైంది. నేను తమ దాసుడిని, దయతలచినా, దండించినా తమ ఇచ్ఛ” అని అతి వినయంతో కుందేలు కట్టుకథ అల్లి చెప్పింది.

“అలాగా. ఆ నీచుని పీచమణచనిదే నాకు మనశ్శాంతి లేదు. ఎక్కడ వాడు? తొందరగా పద.

**రోగాన్ని, శత్రువుని, పురిట్లో చంపలేకపోయావో అవే యింతలంతలుగా ఎదిగి అంతం చేస్తాయి –**

అని సూక్తి. కాబట్టి వాడు దాగున్న చోటు నాకు చూపించు. వాణ్ణి సంహరిస్తాను” అన్నాడు భాసురకుడు.

“శత్రువు శక్తిని అంచనా వేయకుండా శత్రువుపైకి బరిలోకి ఉరికితే, నిప్పుల్లో చిమ్మట కాలిబూడిదైన మాదిరి అవుతుంది” అంది కుందేలు.

“అది నీకు నిమిత్తంలేని విషయం. నాకా నకిలీ సింహం దాగున్న చోటు చూపించు” అని ఆజ్ఞాపించింది భాసురకం.

కుందేలు ముందు నడుస్తూ సింహాన్ని బావి దగ్గరకు తీసుకొని వెళ్ళింది.

“స్వామీ, మీ బలం ముందు ఎవరు నిలవగలరు? తమ రాకను కనిపెట్టిన శత్రువు ఈ బావిలో దూరి దాగున్నాడు. ఇది అతడికి కోటలాంటిది” అని కుందేలు భాసురకుడిని బావి గట్టుదాకా తీసుకుపోయి చూపించింది. బుర్రలేని సింహం బావి అంచు మీద నుంచి కిందికి చూసింది. నీళ్ళలో కనబడ్డ తన ప్రతిబింబాన్ని చూసి అదే శత్రువనుకుంది. గట్టిగా గర్జించింది. గర్జన ప్రతిధ్వనించింది. రౌద్రంగా అది బావిలోకి దూకి నీటమునిగి హతమైంది. కుందేలు ఆనందంతో చిందులు వేస్తూ తన మిత్రులంతా ఉండే తావు చేరి బుద్ధిహీనుడైన మృగరాజు ఎలా హతుడైందీ చెప్పింది. మిత్రబృందం ఆనందంతో కుందేలుకు జేజేలు పలికి నిబ్బరంగా, నిర్భయంగా చాలాకాలం ఆ అడవిలో హాయిగా జీవించారు.

## 8. కోపం

సీతారామపురంలో ధర్మయ్య అనే సంపన్నుడు ఉండేవాడు. అతనికి కోపం ఎక్కువ. అయిన దానికి కాని దానికి ఊరికే చిరాకు పడేవాడు.ఇతరుల్ని ఇబ్బంది పెట్టేవాడు. ధర్మయ్య భార్య సీతమ్మ ఎన్నోమార్లు కోపం మంచిది కాదని శాంతంగా ఉండమని చెప్పినా చెవికెక్కించుకోలేదు.

ఒకరోజు మధ్యాహ్నం ధర్మయ్య భోంచేసిన తర్వాత ఇంటి వసారాలో చల్లగాలికి నడుం వాల్చాడు. ఇంటి ముందు రకరకాల పూల మొక్కలు ఏపుగా పెరిగి ఉన్నాయి. అంతలో ధర్మయ్య ఇంటి పక్కనే నివసించే సోమయ్య మేక ధర్మయ్య ఇంట్లో ప్రవేశించి పూల మొక్కలను తినేందుకు సిద్ధమైంది. వసారాలోంచి ఆ దృశ్యాన్ని చూసిన ధర్మయ్యకు విపరీతమైన కోపం వచ్చింది. వెంటనే పక్కనే ఉన్న దుడ్డుకర్రను తీసుకుని బలంగా మేక మీదికి విసిరాడు. అది వెళ్ళి గట్టిగా మేక వెనక కాళ్ళకు తగిలి దాని కాలు విరిగింది.

అంతలో సోమయ్య అక్కడి కొచ్చి “అయ్యో అయ్యో! ఇదేంటండి మీకేమైనా పిచ్చి పట్టిందా? నా మేక కాలు విరగ్గొట్టారు” అన్నాడు. దానికి ధర్మయ్య ఆగ్రహంతో ఊగిపోతూ “దరిద్రుడా! నీ మేకను నా ఇంట్లోకి తోలింది కాక నాకు పిచ్చిపట్టిందంటావా? ఎంత ధైర్యంరా నీకు” అంటూ సోమయ్యను బలంగా వెనక్కు ఒక్క తోపు తోశాడు. సోమయ్య కిందపడి తల ఓ బండరాయికి కొట్టుకుని రక్తం కారసాగింది. రక్తాన్ని చూడంతో సోమయ్యకు ఆవేశం వచ్చి ధర్మయ్య మీదికి ఉరికాడు.

అదే సమయంలో ఆ గ్రామ న్యాయాధికారి అటుగా వెళ్తూ ఈ దృశ్యాన్ని చూసి ధర్మయ్యను, సోమయ్యను న్యాయస్థానానికి తీసుకురమ్మని భటులకు చెప్పి వెళ్ళాడు.

ఆ రోజు సాయంత్రం న్యాయాధికారి ఇద్దరినీ విచారించాడు. ఆఖరికి ఆయన “సోమయ్య ఉద్దేశ పూర్వకంగా తన మేకను ధర్మయ్య ఇంట్లోకి తోలలేదు. ధర్మయ్య మేకకాలు విరగొగ్గట్టడమే కాకుండా సోమయ్యను గాయపరిచాడు. అందువల్ల తప్పు ధర్మయ్యదిగా భావిస్తూ సోమయ్యకు నష్టపరిహారంగా వంద వరహాలు చెల్లించాలి” అని తీర్పు చెప్పాడు. ధర్మయ్య మారు మాట్లాడక డబ్బు చెల్లించి ఇంటికి తిరిగొచ్చాడు. జరిగిన దానికి మధనపడుతుండడం గమనించిన సీతమ్మ “చూశారా! మీ కోపం మూలంగా ఎన్ని అనర్థాలు జరిగాయో! లోపలికి వచ్చిన మేకను అదిలించి బయటికి తోలితే పోయేది. కాని కోపంతో దాని కాలు విరగ్గొట్టారు. అదే కోపంతో సోమయ్యను గాయపరచి న్యాయస్థానంలో జరిమానా కట్టారు. గ్రామంలో పదిమంది ముందు మీరు దోషిగా నిలబడవలసి వచ్చింది. ఇన్ని అనర్థాలకు కారణం మీ కోపమే. అందుకే పెద్దలు అన్నారు గోరంత కోపాన్ని అణచుకోగలిగితే కొండంత విచారాన్ని తప్పించుకోవచ్చునని. ఇకనైనా మీలోని కోపాన్ని తగ్గించుకుని శాంతంగా ఉండండి” అంది. అటు తర్వాత ధర్మయ్య ఎప్పుడూ మితిమీరిన కోపాన్ని ప్రదర్శించలేదు.

## 9. యుక్తి

ఒక ఊళ్ళో చాలా కాకులు ఉండేవి. అవి కలసిమెలిసి ఐకమత్యంతో జీవించేవి. ఎక్కడ ఆహారం దొరికినా అన్నీ కలిసి వెళ్ళి తినేవి.

ఒకసారి తీవ్రమైన కరువు ఏర్పడింది. వర్షాలు కురవలేదు. చెరువులు, కుంటలు ఎండిపోయాయి. పశువులు మేత కరువై చనిపోయాయి. పంటపొలాల్లో గింజధాన్యం కూడా పండలేదు. చుక్క నీరు దొరకలేదు. ఆ ఊరివాళ్ళంతా కూలీ పనులు చేసి బతికే వారవడం చేత పనిదొరక్క ఆకలితో అలమటించిపోయారు. ఆ బాధకు కొందరు చనిపోయారు కూడా. పిడికెడు అన్నం కోసం ఊరు విడిచి వేరే ప్రాంతాలకు వలస వెళ్ళారు. కాకులకు కూడా తిండి దొరకడం కష్టమైపోయింది. తిండి కోసం అవన్నీ మరో గ్రామానికి వెళ్ళాలని నిర్ణయించుకున్నాయి.

అయితే ఇంతకాలం తామున్న ఆ ఊరును వదలడం ఏ కాకికీ ఇష్టం లేదు. అందుకని రోజంతా ఆహార సంపాదన కోసం తిరిగి సాయంత్రానికి అదే గ్రామానికి చేరాలని అనుకున్నాయి. రోజూ అలాగే చేయసాగాయి. ప్రతి రోజూ ఒక ముసలి కాకి మాత్రం తమతో కలిసి రావడం లేదన్న సంగతి ఒక కాకి గమనించింది.

ఓ రోజు ఆ కాకి ముసలి కాకితో "మేమంతా రోజూ ఆహారం కోసం వెళ్తుంటే నువ్వెందుకు మాతో రావడంలేదు? అసలు నీకు తిండెలా దొరుకుతోంది?" అని ప్రశ్నించింది. అందుకు ముసలి కాకి "దూర ప్రయాణం చేసేంత శక్తి నాకు లేదు. అందుకే నా తిండి ఇక్కడే వెతుక్కుంటున్నాను" అంది. "నీకు ఇక్కడ తిండి దొరుకుతోందా?" అని ఆశ్చర్యంగా అడిగింది కాకి. అందుకు ముసలి కాకి "నా మటుకు సరిపోయేంత ఆహారం సుబ్బయ్య శెట్టి ఇంట్లోనే దొరుకుతుంది" అని చెప్పింది.

అందుకు ఆ కాకి నవ్వుతూ "నువ్వు చెప్పేది వింతగా ఉంది. ఆ సుబ్బయ్య శెట్టి పరమ పిసినారి. జన్మలో పిల్లికి బిచ్చం పెట్టి ఎరుగడు. కరువు వల్ల జనమంతా ఊరు విడిచి వెళ్ళినప్పటికి అతడు చాలా ధనవంతుడు కావటంవల్ల తానొక్కడే సుష్టుగా తింటూ ఇక్కడే ఉండిపోయాడు. కలలో కూడా ఎదుటివాడి ఆకలి తీర్చని సుబ్బయ్య శెట్టి దగ్గర నీకు ఆహారం దొరకుతుందంటే నేను నమ్మలేకపోతున్నాను" అంది. అందుకు ముసలి కాకి "సుబ్బయ్య శెట్టి తత్వం గురించి నాక్కూడా తెలుసు. కాని ప్రతిరోజూ అతడు అన్నం తినే సమయానికి నేనతనికి కొద్ది దూరంలో నిలబడి కావు కావుమని అరుస్తూ ఉంటాను. నన్ను అదిలించే ప్రయత్నంలో అతడు అనేకసార్లు తన చేతిని ఊపుతాడు. అలా ఊపిన ప్రతిసారి అతని చేతికి అంటుకుని ఉన్న అన్నం మెతుకులు కింద పడతాయి. అవి తిని నా కడుపు నింపుకుంటున్నాను" అంది.

ముసలి కాకి చెప్పిన మాటలు విన్న కాకి "అనుకూలం కాని పరిస్థితుల్లో కూడా యుక్తితో వ్యవహరించి ప్రయోజనం పొందవచ్చన్న విషయం నీ ద్వారా తెలుసుకున్నాను నీ తెలివికి నా అభినందనలు" అంటూ ఎగిరిపోయింది.

# 10. లోకజ్ఞానం

ఆ రోజు ఆదివారం. పావని ఇంటి వెనక కొబ్బరి చెట్టు కింద కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటోంది. పుస్తకం చాలా ఆసక్తికరంగా ఉండడంతో అందులో లీనమైపోయింది.

అంతలో వాళ్ళ నాన్న వెంకట్‌రావు అటుగా వెళ్తూ పావనిని గమనించాడు. "ఏంటమ్మా చదువుతున్నావు?" అని అడిగాడు. అందుకు పావని ముఖాన్ని పుస్తకంలోంచి తండ్రి వైపు తిప్పి "కథల పుస్తకం నాన్నా! చాలా బాగుంది" అంది. "కథల పుస్తకమా! ఎక్కడిదీ?" అంటూ ఆమె దగ్గరకు నడిచాడు వెంకట్‌రావు. "నా ఫ్రెండ్ శైలజ ఇచ్చింది నాన్న! వాళ్ళ నాన్న కొనిచ్చాడట. ఇవాళ ఆదివారం కదా! చదివిస్తానంటే ఇచ్చింది" అంది పావని పుస్తకాన్ని చూపిస్తూ వెంకట్‌రావు చిరాగ్గా "ఇలాంటి పిచ్చి పిచ్చి పుస్తకాలు చదివితే నీ చదువు పాడవుతుంది. దీన్ని వెంటనే శైలజకు ఇచ్చేసిరా. ఇంట్లోకి వెళ్ళి నీ స్కూలు పుస్తకాలు చదువుకో" అన్నాడు. అందుకు పావని "ఇందాకటి వరకు చదువుకొని హోంవర్క్ కూడా పూర్తిచేశాను నాన్నా! ఈ పుస్తకంలో మంచి మంచి కథలు, రంగు రంగుల బొమ్మలు ఉన్నాయి. చదివేకొద్దీ చదవాలనిపిస్తుంది" అంది. "అదంతా సరేగాని ముందు నేను చెప్పినట్లు చేస్తావా లేదా?" అని కసురుకున్నాడు వెంకట్‌రావు. పావని తండ్రికి కోపం వచ్చిందని గ్రహించింది. మారు మాట్లాడకుండా అతడు చేయమన్న పని చేసింది.

కొద్ది రోజులు గడిచాయి. ఓ రోజు సాయంత్రం పావని స్కూలు నుండి ఇంటికొచ్చింది. ఇంట్లోకి అడుగుపెట్టగానే సాంబ్రాణి వాసన గుప్పుమంది. ఏమిటబ్బా? అనుకుంటూ లోపలి గదిలోకి నడిచింది. అక్కడ వాళ్ళ నాన్న, అమ్మ పద్మ మరో వ్యక్తి నేలమీద కూర్చుని ఉన్నారు. ఆ వ్యక్తి నేల మీద ముగ్గు వేసి అందులో జీడిగింజలు, గవ్వలు, నిమ్మకాయలు, వేపమండలు పెట్టి బిగ్గరగా ఏవేవో మంత్రాలు చదవసాగాడు. పావనిని చూసిన వెంకట్‌రావు వచ్చి తన పక్కన కూర్చోమన్నట్లుగా సైగ చేశాడు. పావని మెల్లగా వెళ్ళి తండ్రి పక్కన కూర్చుంది.

"మన ఇంటి చుట్టూ ఏదో దయ్యం తిరుగుతోందట. అందుకే మనకు ఏ పని చేసినా కలసిరావడం లేదు. అందుకని ఈయన్ని పిలుచుకువచ్చా. ఈయన పెద్ద మంత్రగాడు. దయ్యాల్ని వదిలిస్తాడు. మనందరికీ తాయెత్తులు కడతాడు" అని మెల్లగా పావనితో అన్నాడు వెంకట్‌రావు. పావని మౌనంగా చూస్తుండిపోయింది.

మంత్రగాడు కాసేపు కళ్ళు మూసుకుని మంత్రాలు చదివాడు వెంకట్‌రావుతో "దయ్యం భయపడి పారిపోయింది. ఇంకెప్పుడూ మీ ఇంటి ఛాయలకు కూడా రాదు" అంటూ ఓ నిమ్మకాయను కత్తితో కోశాడు. విచిత్రంగా అందులోంచి నిమ్మరసానికి బదులుగా ఎర్రటి ద్రవం కారసాగింది. "చూశారుగా! నిమ్మకాయలోంచి రక్తం వస్తోంది. అంటే దయ్యం పారిపోయిందన్నమాట" అన్నాడు మంత్రగాడు. వెంకట్‌రావు, పద్మ ఆశ్చర్యంగా చూస్తుండిపోయారు. అంతలో పావని "ఇది నేను కూడా చేయగలను" అంది మంత్రగాడితో. "ఏంటీ! నువ్వు చేస్తావా?" అన్నాడు గుర్రుగా మంత్రగాడు.

"అవును చేయగలను. నిమ్మకాయలోకి సిరంజితో ఎరుపు రంగు సిరాను ఎక్కించాలి. దాన్ని కోసి చూస్తే రక్తంలాగే అనిపిస్తుంది. అంతే!" అంది పావని కళ్ళు పెద్దవి చేసి. పావని మాటలు వినేసరికి మంత్రగాడి ముఖంలో రంగులు మారాయి. "నేనిప్పుడే వస్తాను" అంటూ బయటికెళ్ళాడు, ఇక తిరిగి రాలేదు.

వెంకట్‌రావు, పద్మలు పావనితో "ఈ విషయం నీకెలా తెలుసమ్మా?" అని అనడిగారు. అందుకు పావని "మొన్న శైలజ ఇచ్చిన కథల పుస్తకంలో చదివాను. అందులో కూడా ఒక మోసగాడు ఇలాగే చేసి జనాన్ని నమ్మిస్తుంటాడు. ఆఖరికి అతని బండారం బయట పడుతుంది" అని చెప్పింది.

వెంకట్‌రావు, పద్మ ఆలోచనలో పడ్డారు. పావని మంత్రగాడి బండారం బైటపెట్టకపోతే తాము వాడి వలలో పడిపోయి ఇంకింత డబ్బును వృధా చేసేవారమని తెలుసుకున్నారు. కథల పుస్తకాలు చదివితే లోకజ్ఞానంతోపాటు అనేక విషయాలు తెలుస్తాయని అర్థం చేసుకున్నారు. ఆ రోజు పావనని కథల పుస్తకం చదవొద్దని వారించినందుకు వెంకట్‌రావు చింతించాడు.

మరునాడు పొద్దున్నే వెంకట్‌రావు నాలుగు కథల పుస్తకాలను తీసుకువచ్చి పావనికిస్తూ "ఇదిగోనమ్మా నీ కోసం కథల పుస్తకాలు తెచ్చాను. బాగా చదువు" అన్నాడు. తనకిష్టమైన కథల పుస్తకాలు చూసి పావని ముఖం సంతోషంతో వెలిగిపోయింది.

## 11. సత్యహరిశ్చంద్రుడు

కృతయుగానికి చెందిన చక్రవర్తులలో హరిశ్చంద్రుడు గొప్పవాడు. ఇతను సూర్యవంశానికి చెందినవాడు. అతని భార్య తారామతి (చంద్రమతి). వారికి లోహితుడు అనే పుత్రుడు గలడు. హరిశ్చంద్రుడు సత్యవాక్పరిపాలకుడు. అందుచేతనే కృతయుగాన్ని సత్యయుగం అని కూడా పిలిచేవారు. ధర్మబద్ధంగా, సత్యనిష్ఠాగరిష్ఠుడై హరిశ్చంద్రుడు రాజ్యపాలన గావించేవాడు.

ఒకసారి, విశ్వామిత్రునికి తన యావద్రాజ్యాన్ని దానంచేశాడు హరిశ్చంద్రుడు. ఆ మాటకు కట్టుబడి హరిశ్చంద్రుడు తన సర్వస్వాన్ని విశ్వామిత్రునికి అప్పగించి భార్యాపుత్రులతో అడవులకు వెళ్ళిపోయాడు. విశ్వామిత్రునికి ఒకసారి యజ్ఞం కొరకు కొంత ధనమిస్తానని వాగ్దానం చేశాడు. అది "బలవంతుడొకడు ఏనుగుపై ఎక్కి రత్నాన్ని ఆకాశంలోకి విసిరి ఎంత ఎత్తుపోతుందో అంత ధనం". ఆ ధనాన్ని సమకూర్చిపెట్టడం కోసం హరిశ్చంద్రుడు భార్యాపుత్రులను కాశీక్షేత్రంలో బానిసలుగా అమ్మివేశాడు. తను కూడా స్మశానంలో కాటికాపరిగా అమ్ముడుపోయాడు. సత్యానికి కట్టుబడి హరిశ్చంద్రుడు సర్వస్వాన్ని కోల్పోయాడు. ఐనా, అతను సత్యాన్ని నమ్ముకున్న సత్యవ్రత దీక్షాపరాయణుడు. తన కుమారుడు పాము కరిచి చనిపోగా, అతని శవాన్ని శ్మశానంలో కాల్చడానికి భార్య తీసుకొని వచ్చింది. ఆ సమయంలో కూడా తన ధర్మానికి కట్టుబడి కాటిసుంకం చెల్లించమని అడిగారు. అలా చెల్లించని భార్యను శిక్షించడానికే సిద్ధపడిన ధర్మమూర్తి హరిశ్చందుద్రు. ఆడిన మాటను తప్పకుండా విపత్కర పరిస్థితులలో కూడా తన సత్యసంధతను వీడకుండా నిలిచిన హరిశ్చంద్రుని సత్యనిష్ఠకు శివుడు మెచ్చుకొని ప్రత్యక్షమైనాడు. అతని పుత్రుని బ్రతికించి తిరిగి రాజ్యాన్ని ప్రసాదించెను. అతని సత్యసంధత లోకంలో స్థిరంగా నిలిచిపోయింది. సత్యానికి మారుపేరుగా నిలిచిన హరిశ్చంద్రుడు సత్యహరిశ్చంద్రునిగా నేటికీ లోకంలో ప్రకాశిస్తూనే యున్నాడు.

**సూచన :** హరిశ్చంద్రునికి సంబంధించి లోకంలో వాడుకలోనున్న కథ గలదు. దానిని కూడా విద్యార్థులకు తెలిపి, అతని సత్యగుణాన్ని తెలియచెప్పవచ్చును. అందులో అతని సత్యనిష్ఠకు సంబంధించిన ఘట్టాలను వివరించాలి.

# 5. స్ఫూర్తిదాతలు

వేదవ్యాస మహర్షి

చదువుకోవడానికి అనువుగా వేదాలను ఈయన విభజించాడు. వేదాలు అర్థమవడానికి ఉపనిషత్తులు రాశాడు. అవి అర్థమవడానికి మీమాంస చేశాడు. ఈయన చేసిన ఈ కృషే మానవ వికాసానికి దారి తీసింది.

భారతీయ వాఙ్మయానికి మూల పురుషుడు. ఆది పురుష/డు వాల్మీకి అయితే, రెండవవాడు వేదవ్యాస మహర్షి ఈయనకు కృష్ణద్వైపాయనుడు అను మరొక పేరు కూడా కలదు. ఈయన శరీరం నల్లదైనందున ఈయనకీ పేరు వచ్చింది. ఈయన శంతనుని భార్య సత్యవతికి పరాశర మహర్షి ద్వారా కలిగాడు. ఈ సత్యవతి ఉపరిచరవసువనే రాజర్షి కూతురు. బెస్తరాజు వద్ద పెరిగింది. క్షత్రియ కన్య.

అపౌరుషేయాలైన వేదాలను నాలుగు భాగాలుగా విభజించడం వలన ఈయనకి వేదవ్యాసుడని పేరొచ్చింది. ఈయన వలన వేద విభాగం జరిగింది. కాబట్టే వేదాలు చదువుకోవడానికి వీలైనది. ద్వాపర యుగాంతరంలోనే మహాభారత యుద్ధానికి పూర్వమే ఈయన జన్మించి ఉండటం వలన ఆ మహాయుద్ధ పూర్వాపరాలను, కంటితో చూచిన వాడైనందువలన ఆ చరిత్రను యధాతధంగా రాశాడు. ఈ మహాభారతం ఐదువేల నూరు సంవత్సరాల క్రితం ఈయన చేత రాయబడింది. ఈ కావ్యం 18 పర్వాలు కలిగి, లక్షశ్లోకాలు గల గ్రంథమిది. వీటిని ఈయన శిష్యుడు శుకమహర్షి రాసి సూతునకు చెప్పగా, వారు అభిమన్యుని మనుమడైన జనమేజయునకు చెప్పారు. అప్పటి నుండే ఈ గ్రంథం ప్రజలు వినుటకందుబాటులోకి వచ్చింది.

ఈ మహాభారతంలో లేని కళగాని, రసముగానీ లేదు. సర్వరస కళల భూయిష్ఠమైన కావ్యమిది. మానవజన్మ మొదలు మోక్షము పొందుటకు గల అంతర్ దశల విభాగాలను చెప్పుటయేకాక 'మానవుడు ఉత్తముడుగా ఆఖరుకు దేవుడుగా కూడా కాగలడు. ఆ విధంగా ఎలా అయ్యేది ఈ గ్రంథంలో మనకు లభ్యమవుతుంది.

మహాభారతం ఉత్తమోత్తమమైన కథ. మానవ వికాసానికి సంబంధించిన అనేక విషయాలు అందులో నిక్షేపించి యున్నవి. ఇందలి పాత్రలు, వారి విభిన్న మనస్తత్వాలు, వారి పట్టుదలలు, కృత్య అకృత్యాలేగాక మనకెంతో ఆదర్శనీయమైన మహాగ్రంథమిది. ఇందులో అనేక ప్రశ్నలు ఉన్నాయి. ఏ పాత్రకాపాత్ర ప్రత్యేక ప్రతిపత్తి కలిగినవే. ఈ గ్రంథాన్ని ఒకసారి చదివితే చాలు. మానవ జీవితం సర్వతోముఖాభివృద్ధి చెందుతుంది.

ఇందులోని అనేక నీతులు, శాస్త్రాలు మానవ జీవితానికి ఉపయోగకరంగా ఉన్నవి. ప్రపంచ చరిత్రలో ఇంతటి గొప్ప గ్రంథం మరొకటి లేదు.

ఈయన వేదాలు అర్థమగుటకు, ఉపనిషత్తులు రాశాడు. అవి అర్థమవడానికి మీమాంస చేశాడు. ఆ మహామహుడు చేసిన కృషే ఈనాటి మన వికాసానికి కారణమయింది.

భగవద్గీత గ్రంథం ఈ మహాభారతంలోనిదే. జైమిని మహర్షి కూడా బాగా రాశాడు. అదీ ప్రాచుర్యములోనే ఉన్నది.

భారత చిరంజీవులలో ఈయన ఒకరు.

## రుద్రమదేవి

రుద్రమదేవి కాకతీయరాజైన గణపతి దేవుని కుమార్తె. ఈమె కాకతీయ సామ్రాజ్యాన్ని సుస్థిరం చేసింది. ప్రజాసంక్షేమ కార్యక్రమాలను ఎన్నో చేసింది. రైతులనే దేశానికి అన్నదాతలుగా భావించింది. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది.

ఊయలను ఊపేచేయి ఉర్విని కూడా పాలించగలదు. స్త్రీలు కూడా పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించిన సందర్భాలు మన చరిత్రలో కోకొల్లలు. కత్తిబట్టి కదన రంగంలో దూకిన స్త్రీలూ, కలం పట్టి కవిత్వం చెప్పినవారూ, రాళ్ళు సైతం కరిగేట్లు మధురంగా పాడగలిగేవారూ మన సమాజంలో దర్శనమిస్తారు. మన చరిత్రలో వీరనారులు ఎందరో ఉన్నారు. వారిలో తలమానికం రుద్రమదేవి.

రుద్రమ, కాకతీయ సామ్రాజ్యాన్ని ఏలిన గణపతిదేవ చక్రవర్తి కుమార్తె. చిన్ననాటి నుండి చనువుగా తండ్రి చెంత కూర్చొని రాజ్యపాలనను నిశితంగా పరిశీలిస్తూ ఉండేది. తండ్రి ఆమెను కొడుకువలె పెంచాడు. యుద్ధ విద్యల్లో శిక్షణ ఇప్పించాడు. ఆమె అన్ని విద్యల్లోనూ ఆరితేరింది.

గణపతిదేవుని మరణం తర్వాత రుద్రమ రాజ్యాన్ని చేపట్టింది. స్త్రీయని భావించిన సామంతులు తిరుగుబాటు చేశారు. విశ్వాసపాత్రులైన సేనాపతుల సాయంతో ఆమె తిరుగుబాటుదారులను అందర్నీ ఓడించింది. తెలుగునేలను ఏకంచేసి కాకతీయ సామ్రాజ్యాన్ని సుస్థిరం చేసింది.

రాజ్యంలో అలజడులు తగ్గిన తర్వాత ప్రజాశ్రేయస్సు వైపు దృష్టి మరల్చింది. ప్రజలకు రాజులయెడ గౌరవం కలిగించేటట్లు పరిపాలన చేయడానికి నడుంకట్టింది. ప్రజల్లో జాతీయభావాన్ని, సమైక్యతనూ దేశాభిమానాన్నీ పెంపొందిచాల్సిన అవసరాన్ని గుర్తించింది. పల్లెల్లో నివసించే రైతులే దేశానికి అన్నదాతలని నమ్మింది. వారు క్షేమంగా ఉంటే రాజ్యంలో కరువుకాటకాలుండవని వ్యవసాయం కోసం నీటివనరులు అభివృద్ధి పరిచింది. అన్నసత్రాలు, వైద్యశాలలు స్థాపించింది.

కన్న తల్లివలె, కనురెప్పలవలె, రక్షించే రుద్రమదేవి పాలనలో, ప్రజలు ఈతిబాధలు ఎరుగరు. వారికి భయాలూ బాధలూ లేకుండా చేసిన ప్రజాసేవాభిమాని రుద్రమ. ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్న ఆదర్శ సామ్రాజ్ఞి రుద్రమ.

ఆమె కాలంలో మార్కోపోలో అనే వెనిస్ వర్తకుడు మన దేశానికి వచ్చాడు. అతడు 'రుద్రమదేవి పాలన శాంతికి, దయకు, న్యాయానికి, ధర్మానికి నిలయంగా ఉండేదని, ప్రజలకు రుద్రమ అంటే అమితమైన భక్తి' అని రాశాడు. ప్రజానురంజనమే పరమావధిగా, ప్రజారక్షణయే ఆదర్శంగా, ప్రజల సౌకర్యమే పరమధర్మంగా పవిత్రపాలన సాగించిన రుద్రమ పరిపాలకులకు ఆదర్శప్రాయురాలు. ప్రజలకు నిత్యస్మరణీయురాలు.

## లోకమాన్య బాలగంగాధర తిలక్

బాలగంగాధర తిలక్ మహారాష్ట్రలో జన్మించాడు. స్వాతంత్ర్యసముపార్జనకోసం ప్రజలను మేలుకొలిపిన వైతాళికుడు. గొప్ప మతాభిమాని 'కేసరి' పత్రికను స్థాపించాడు. ఉత్తమ ప్రజాసేవకుడు, ప్రసిద్ధి చెందిన న్యాయవాది.

భారత స్వాతంత్ర్య సముపార్జన కోసం జీవితాలను త్యాగం చేసిన అగ్రశ్రేణి మహానాయకులకు మహానాయకుడు లోకమాన్య బాలగంగాధర తిలక్. "స్వాతంత్ర్యం నా జన్మహక్కు" అని గాంధికి పూర్వమే ఎలుగెత్తిచాలిన సుప్రసిద్ధ దేశభక్తుడు. మహారాష్ట్రలో మరాఠా బ్రాహ్మణ వంశంలో 1853లో పుట్టి 1919లో పరమపదించిన ఈయన మనకు, భావిభారత ప్రజలకు మార్గదర్శకుడే కాక పూజనీయుడు కూడా. భగత్‌సింగ్ మొదలగు విప్లవ వీరులతో కలసి మహారాష్ట్ర, బెంగాల్, పంజాబు మొదలగు రాష్ట్రాలలో స్వాతంత్ర్య సముపార్జన కోసం ప్రజలను మేలుకొలిపిన వైతాళికుడీయన. ఈయన యెంత దేశభక్తుడో అంతటి హిందూ మతాభిమాని.

బ్రిటీషు జాతీయగీతాన్ని కాదని "వందేమాతరం" అన్న భారత జాతీయ గేయాన్ని మన సభలలో ఆచరణలో పెట్టిన దేవాభిమాని ఈయన. అంతేకాదు, భారతీయ ప్రజలను స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనేటట్లు చేయుటకు దేశంలో జరుగుతున్న విషయాలను యెప్పటికప్పుడు ప్రజలలో తెలియచేయుటకు "కేసరి" అని ఒక పత్రికను స్థాపించాడు.

బ్రిటీషు ప్రభుత్వం ఈయన దేశభక్తికి, ఈయన "కేసరి" పత్రికలో రాస్తున్న అనేక విషయాలకు హడలిపోయి ఈయనను అనేకసార్లు జైలుకు పంపారు. అయినప్పటికీ ఈయనలో దేశాభిమానం నానాటికి వృద్ధి చెందిందనదేగాని, తగ్గలేదు. ఇంక ఇలాకాదని పూనాలో జరిగిన ఓ హత్యకేసులో - వాస్తవానికి ఈయనకు సంబంధం లేకపోయినప్పటికి ఈయన కూడా ఆ హత్యకు కారకుడేనని, ఇంకా కొంతమంది దేశభక్తులను కలిపి ఒకేసారి ఆరు సంవత్సరాలు జైలుశిక్ష విధించారు. ఎలాగయినా ఈయనను దేశభక్తి నుండి మరల్చాలని బ్రిటీషువారు యెన్నో ఆశలు చూపారు.

తిలక్ ఉత్తమ దేశభక్తుడేగాక అత్యుత్తమ ప్రజాసేవకుడు. మహారాష్ట్రలో 1898లో వచ్చిన ఘోరమయిన ప్లేగు వ్యాధికి వేలసంఖ్యలో ప్రజలు చనిపోతూ ఊళ్ళు వదలి పోతే ఉంటే వాళ్ళకు శారీరకంగా, మానసికంగా యెంతో ఆత్మీయతతో సేవ చేశాడు.

పూనాలో ప్రసిద్ధి చెందిన న్యాయవాది కూడ. 1879లో ఈయన న్యాయవాద వృత్తి స్వీకరించి "న్యాయవాది" అన్న పదానికి నిజమయిన న్యాయంను చేకూర్చిన వకీలీయన. అకారణంగా స్వాతంత్ర్య యోధులనేక మందిని జైలులో పెడుతుంటే వారి తరపున ఉచితంగా వాదించడమేకాక ఆర్థికంగా అనేక మందికి సహాయపడ్డాడు.

కాంగ్రెసులో ఈయన ఇమడలేకపోయాడు. కారణం, మానవ సహజమయిన సంకుచిత, స్వార్థ స్వభావం లేనివాడై నందున అవే ప్రధానంగా పెట్టుకొనివున్న కొంతమంది పద్ధతులు నచ్చక 1907 సూరత్ కాంగ్రెసు మహాసభ నుంచి వైదొలగాడు. అయితే వెంటనే "అనిబీసెంటు"తో కలిసి హోమ్‌రూల్ స్థాపించాడు. ఈ మహాపురుషుడు 31-7-1919న తన 66వ యేట పరమపదించాడు.

పరమపదించే ముందు షిరిడీ సాయిబాబా మహిమలు తెలిసి ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయక షిరిడీ వెళ్ళి సాయిబాబాను కలసి మనదేశ స్వాతంత్ర్యము ఎప్పుడు వస్తుందని అడగడానికి వచ్చానన్నాడు. అప్పుడు సాయిబాబా నీవు, నేను చూడము ముందు నీ గుండెను జాగ్రత్తగా చూచుకోమన్నాడు. ఆ సంవత్సరమే జరిగిన సత్యాగ్రహంలో పాల్గొన్న తిలక్‌గారు ఆంగ్ల పోలీసులు ఆయన గుండెలమీద లాఠీలు పెట్టి కొట్టడముతో కోలుకోలేని జబ్బుపడి స్వర్గస్థుడైనాడు.

స్వాతంత్ర్యానంతర భారత ప్రభుత్వం ఈయన విషయంలో ఏమి చేయలేదు. ప్రజల్లో తప్ప ప్రభుత్వపరంగా ఈయన జ్ఞాపకాలేమీ లేవు.

భగవద్గీతకు ఈయన రాసిన భాష్యం పరమ ప్రామాణికం. గణేష్ ఉత్సవాలు ఈయన ప్రవేశపెట్టినవే. అనాది అయిన హిందు సమాజం మీద మంచి పట్టు ఉన్న మనిషి. ఋగ్వేదం కాలం గురించి పాశ్చాత్య దేశాలలో నిర్ణయించిన కాలాన్ని కొట్టిపారేసి ఈయన సొంత పరిశోధనలతో చాలా పూర్వానికి తీసుకొని వెళ్ళాడు. నిజానికి అది కూడా సరైనది కాదు. ఇంకా ఇంకా ఎంతో పూర్వకాలం నాటిది ఋగ్వేదం కాలం.

## స్వామి వివేకానంద

వివేకానందుడు పశ్చిమ బెంగాల్‌లోని కలకత్తాలో జన్మించారు. ప్రపంచ మహాసభలో తన భావాలను, తన గురువు భావాలను ఆచరణలో ఉంచడానికి 'రామకృష్ణ మిషన్‌ను' స్థాపించాడు. హిందూమత ఔన్నత్యాన్ని చాటిచెప్పిన మహానుభావుడు.

హిందూ సంస్కృతి, హిందూమతమును గురించి యూరప్ దేశవాసులకు తొలిసారిగా చెప్పిన ఘనత స్వామి వివేకానందది. మనము హిందూమతము చాలా పురాతనమయినదని, వేదవిహితమైనదని మరియు హిందూ మతమునకు ప్రపంచములో మరి ఏ ఇతర మతము సాటిరాదని మానవ పురోభివృద్ధికి, వికాసానికి, ఈ మతమంత ఉన్నతి, ప్రత్యేకతకేది సమానముకాదని తెలియజెప్పిన మహానుభావుడీయన.

ఈయన 12-1-1863న పశ్చిమబెంగాల్‌లోని కలకత్తాలో జన్మించారు. బాల్యంలో ఈయనకు తల్లిదండ్రులు పెట్టిన పేరు “నరేంద్రనాథ్” ఈయన తండ్రి విశ్వనాథదత్తు. తల్లి భువనేశ్వరీదేవి. జీవితంలో ఉన్నతాశయములతో జీవించమని తల్లిదండ్రులు చెప్పేవారు.

కాలేజీ చదువులయిన తరువాత నరేంద్రనాథ్, రామకృష్ణ పరమహంసను కలుసుకున్నాడు. ఈ కాలంలోనే ఈయన తూర్పు, పశ్చిమదేశాల తత్వశాస్త్ర గ్రంథాలను అవగాహన చేసుకున్నాడు. ఈయన శ్రీ పరమహంసను కలుసుకునేముందు బ్రహ్మ సమాజంలో చేరాడు. కానీ ఆయనకు అందులోను స్థిరమయిన శాంతి లభించలేదు. శ్రీపరమహంసను కలిశాక హిందూతత్వాన్ని క్షుణ్ణంగా అవగాహన చేసుకొని భారతీయ ఆత్మకు ప్రతిబింబమైన సన్యాసత్వాన్ని స్వీకరించాడు.

1886వ సంవత్సరంలో శ్రీ రామకృష్ణ పరమహంస శివ కైంకర్యం చెందిన పిదప శ్రీ వివేకానందుడు శ్రీ పరమహంస చెప్పినట్లుగా హిందూమతాన్ని గురించి ప్రచారం చేయనారంభించాడు. “చికాగో””లో జరిగిన ప్రపంచమతాల మహాసభకు హిందూమత ప్రతినిధిగా వెళ్ళాడు.

ఆ మహాసభలో ఈయన ఉపన్యాసానికి ఆశ్చర్యపడనివారు లేరు. అన్ని మతాలవారు ఈయన వాగ్ధోరణికి ముగ్ధులైనారు. హిందూమతమంటే ఇంత గొప్ప మతమని తమ కింతవరకు తెలియనందుకు వారెంతో విచారించారు. అట్టడుగున పడియన్న మన మతాన్ని ప్రపంచ ప్రముఖుల కెరుకపరచిన ఘనత స్వామి వివేకానందుది.

ఈయన యూరప్ దేశాలలో పర్యటించునప్పుడు ఆ దేశాలలోని అనేకమంది ఈయనకు శిష్యులయినారు.

అంతేకాదు, వారి స్వమతాలను వదిలి మన హిందూమతాన్ని స్వీకరించి హిందూమతావలంబకులుగా కూడా ఉన్నారు.

శ్రీ వివేకానందుడు ఆ దేశాలలో పర్యటించినప్పుడు ఓ ఆంగ్ల వనిత హిందూమతం స్వీకరించడమే కాక తన సర్వస్వాన్ని వదిలి ఈయన వెంట భారతదేశానికి వచ్చింది. శ్రీ వివేకానందుడు ఈమెకు "నివేదిత" అని పేరుపెట్టాడు. మానవ సర్వతోముఖ వికాసానికి మతం మాత్రమే ప్రధానమని ఈయన దృఢవిశ్వాసం. ఈ మహామహుడు 5-7-1902న తన 39వ ఏట ఈశ్వర సాన్నిధ్యానికి చేరుకున్నాడు.

ఈయన తదనంతరం తన భావాలు, తన గురువైన రామకృష్ణ పరమహంస భావాలు ఆచరణలో ఉండేందుకు భావితరాల ప్రజలు వాటిని తెలుసుకొని అనుసరించేందుకుగాను ప్రపంచంలోని అనేక ప్రదేశాలలో "రామకృష్ణ మిషన్స్" పెట్టాడు. హిందూమతం కోసం, మతోద్ధరణకోసం, తన జీవితాన్ని త్యాగం చేసిన మహాపురుషుల్లో ఈయన ఒకరు.

## ప్రఖ్యాత శాస్త్రవేత్త సి.వి.రామన్

సి.వి.రామన్ మద్రాసు రాష్ట్రంలో తిరువనైకవల్ అనే గ్రామంలో జన్మించాడు. విజ్ఞాన శాస్త్రంలో ఘనమైన విజయం సాధించిన ఉపాధ్యాయుడు. ఈయన కాంతిపై చేసిన పరిశోధనకు నోబెల్ బహుమతి పొందాడు.

శ్రీ చంద్రశేఖర్ వెంకటరామన్ ప్రసిద్ధి చెందిన భారతీయ విజ్ఞాన శాస్త్రవేత్త, ఆయన 17 నవంబరు 1881వ సంవత్సరంలో మద్రాసు రాష్ట్రంలోని ఒక సంపన్న బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. ఈయన తండ్రికున్న సైన్సు జ్ఞానమే తనయుని అభివృద్ధికి కారణమైనదని చెప్పవచ్చు. శ్రీరామన్ బాల్యంలో చదువుకునే రోజుల్లోనే పెక్కుమంది పెద్దలచే ఉజ్జ్వల భవిష్యత్తు ఉన్న విద్యార్థిగా కొన్ని సంఘటనల వలన రుజువు చేసుకున్నాడు. అంతేకాదు, ఆయన డిగ్రీ అందుకునే ముందే విజ్ఞానశాస్త్రంలో గొప్ప పండితుడిగా పరిగణింప బడ్డాడు. ఆ రోజులలో ఆయన రాసిన రెండు ప్రధాన వ్యాసాలు ఆయన ఇవ్వాల్టి. కీర్తి ప్రతిష్టలకు కారణమైనాయి. అంతేకాదు విదేశాలలో ఉన్నత విద్యాభ్యాసం సమయంలో ఈయనకు స్కాలర్‌షిప్పు కూడా వచ్చింది. కాని అనారోగ్యం కారణాలవల్ల విదేశాలకు వెళ్ళలేక ఇక్కడనే ఒక ప్రభుత్వ ఉద్యోగంలో చేరాడు.

అయితే ఆయన ఉద్యోగం చేస్తున్నా విజ్ఞానశాస్త్రంలో కొత్త కొత్త విషయాలను కనుగొనడంలో అశ్రద్ధ చూపలేదు.

వైజ్ఞానిక శాస్త్రంలో ఈయన సాధించిన ఘనమయిన విజయానికి కలకత్తాలోని ఒక సుప్రసిద్ధ సైన్సు కాలేజీవారు ఈయనను ఆ కాలేజీలో సైన్సు టీచరుగా పని చేయుటకు 1914లో ఆహ్వానించారు. అది తన భావిలో ఆయన ప్రఖ్యాత ఆధునిక భారతీయ శాస్త్రవేత్త కావటానికి ఆ ఉద్యోగం మంచి అవకాశమిచ్చింది. ఈయన అక్కడ ఉండగనే శబ్దము, వెలుతురును గురించి కొన్ని కొత్త ప్రయోగాలు చేశాడు.

ఈయన కొత్త పరిశోధనలకు (రామన్ ఎఫెక్ట్) రామన్ కనిపెట్టిన నూతన పరిశోధనలకు 1930లో ప్రపంచ ప్రఖ్యాతి చెందిన నోబెల్ బహుమతి లభించింది.

తర్వాత శ్రీ రామన్ బెంగుళూరులో సొంత రీసెర్చి ఇన్‌స్టిట్యూషన్‌ను స్థాపించి మానవ వికాసానికి, పురోభివృద్ధికి ఎన్నో కొత్త పరిశోధనలు చేశాడు. భారతమాత కన్న ముద్దుబిడ్డలలో ఈయన ఒకరు.